# లోకల్ గైడ్

జాతీయ దినపత్రిక

LOCAL NEWS GOBAL FOCUS

LGTV

తెలంగాణ www.localguidenews.com RNI No:APBIL/2013/50718 ఆంధ్రప్రదేశ్








ప్రచురణ :, తెలంగాణ | సంపుటి 14, | సంచిక ,224 | పేజీలు -12 | శనివారం -13 - జూన్ - 2026 | వెల రూ.2/-

PUBILSHED FROM RANGAREDDY, HYDERABAD, circulated by Adilabad,Bhadradri Kothagudem,Hanumakonda. Jagtial,,Jangoan,Jayashankar Bhupalapally,Jogulamba Gadwal, Kamareddy,Karimnagar,Khammam, Kumuram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak ,Medchal Malkajgiri, Mulugu, Nagarkurnool,Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal,


## హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్--2 విస్తరణకు

# సహకారం అందించాలి

## హైదరాబాద్‌కు రూ.లక్ష కోట్లివ్వండి

- ★హైదరాబాద్ సహా ఆరు మెట్రో నగరాల అభివృద్ధికి ఎం--6 టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయండి
- ★నీతి ఆయోగ్ ముందు ప్రతిపాదించిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- ★ట్రిపుల్ ఆర్, మెట్రో విస్తరణ, మూసీ పునరుజ్జీవానికి సహకరించాలని వినతులు
- ★విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు, నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు వెల్లడి



న్యూఢిల్లీ: దేశ ఆర్థికాభివృద్ధికి ప్రధాన చోదకశక్తులుగా నిలుస్తున్న ఆరు మెట్రో నగరాల సమగ్ర అభివృద్ధికి ఎం--6 టాస్క్‌ఫోర్స్ పేరుతో ప్రధానమంత్రి కార్యాలయం ఆధ్వర్యంలో జాతీయ టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. ఈ నగరాలను ప్రపంచ ప్రమాణాలకు తీసుకెళ్లేందుకు ఒక్కో మెట్రో నగరానికి రూ. లక్ష కోట్ల చొప్పున మొత్తం మిగతా 2 లో




## అమిత్ షా చెబుతున్న ఈ బియ్యం ప్రత్యేకత ఏంటి?

- ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీతో రక్తహీనతను నివారించవచ్చన్న అమిత్ షా
- 80 కోట్ల మందికి ఉచితంగా పోషకాలు నిండిన బియ్యం పంపిణీ
- 2028 డిసెంబర్ వరకు పథకాన్ని పొడిగిస్తూ కేంద్ర కేబినెట్ నిర్ణయం
- ఈ పథకం కోసం రూ. 17,082 కోట్లు కేటాయించిన కేంద్ర ప్రభుత్వం
- ఐరన్, ఫోలిక్ యాసిడ్, విటమిన్ బి12 వంటి పోషకాలతో ఈ బియ్యం తయారీ

## భారతీయ సిబ్బంది నౌకపై దాడి.. అమెరికాకు భారత్ మరోసారి గట్టి నిరసన

48 గంటల్లో రెండోసారి అమెరికా దౌత్యాధికారిని పిలిపించిన భారత్



- ఒమన్ తీరంలో భారతీయ సిబ్బంది ఉన్న మరో నౌకపై దాడి
- గత దాడుల్లో ముగ్గురు భారతీయ నావికుల మృతి
- చర్చలు, దౌత్య పరిష్కారాల ద్వారానే ఉద్రిక్తతలు తగ్గాలని స్పష్టం



## అమెరికా క్షిపణి దాడిలో మెరైన్ ఇంజినీర్ పట్నాల సురేష్ మృతి...

- చంద్రబాబు తీవ్ర విచారం
- ఒమన్ తీరంలో ఆయిల్ ట్యాంకర్‌పై క్షిపణి దాడి
- దాడిలో విశాఖకు చెందిన చీఫ్ ఇంజినీర్ సురేష్ మృతి
- మృతుడి కుటుంబానికి అండగా ఉంటామని సీఎం చంద్రబాబు ప్రకటన
- మృతదేహాన్ని స్వదేశానికి తెచ్చేందుకు అధికారులకు ఆదేశాలు
- రాయబార కార్యాలయంతో ఏపీ భవన్ నిరంతర మిగతా 2 లో

## సముద్రాల్లో దాడులు.. భారత నావికుల రక్షణపై

# కేంద్రం కీలక ప్రకటన

భారత నావికుల భద్రత, సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని కేంద్రం ప్రకటన



- ఒమన్ సమీపంలో 24 మంది భారతీయులతో ఉన్న నౌకపై క్షిపణి దాడి
- విదేశాంగ శాఖ, నౌకాదళంతో కలిసి సమన్వయంతో పనిచేస్తున్నామని వెల్లడి

## జగన్ పేరులో 'జీ' అంటే

# 'జెన్ జీ' కాదు.. గొడ్డలి..

## విధ్వంసమే ఆయన ఎజెండా: మంత్రి లోకేశ్

- రూ. లక్ష కోట్లతో 'మిషన్ రాయలసీమ' ప్రాజెక్టును ప్రారంభిస్తామన్న మంత్రి
- జగన్‌కు క్రెడిట్ చోరీ డిజార్డర్ (సీసీడీ) అనే జబ్బు ఉందంటూ సెటైర్లు
- చిన్నప్పుడు టీచర్లు కొట్టారనే కోపంతోనే జగన్ డీఎస్సీపై పగబట్టారని ఎద్దేవా
- ప్రజాప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో దాడులు, కబ్జాలు, హత్యలు లేవన్న లోకేశ్
- డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్‌తో ఏపీలో అభివృద్ధి పరుగులు పెడుతుందన్న మంత్రి



అమరావతి: రాయలసీమను 'రాయల్ సీమ'గా మార్చడమే తమ ప్రభుత్వ ధ్యేయమని, ఇందుకోసం రూ.లక్ష కోట్ల భారీ బడ్జెట్‌తో 'మిషన్ రాయలసీమ' ప్రాజెక్టును చేపట్టబోతున్నామని మిగతా 2 లో



## నిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఖమ్మం బాలికకు హరీశ్ రావు పరామర్శ..

- కాంగ్రెస్ ప్రభుత్వంపై ఫైర్
- ఖమ్మంలో 12 ఏళ్ల బాలికపై లైంగిక దాడి, భవనంపై నుంచి తోసివేత ఘటన
- తీవ్ర గాయాలతో హైదరాబాద్ నిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాధితురాలు
- నిందితుడు గౌస్‌ను పోక్సో చట్టం కింద అరెస్ట్ చేసిన పోలీసులు
- బాధితురాలిని పరామర్శించిన హరీశ్ రావు

హైదరాబాద్: తెలంగాణలోని ఖమ్మం పట్టణంలో మిగతా 2 లో

## మీనాక్షి రాజ్యసభ నామినేషన్ వివాదంపై

# సిట్ విచారణ జరిపించండి

## ప్రతి అంశానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిట్ దర్యాప్తులు ఏర్పాటు చేస్తోందన్న కేటీఆర్

- మీనాక్షికి వ్యతిరేకంగా కొందరు కాంగ్రెస్ నేతలు వ్యవహరించి ఉండొచ్చని వ్యాఖ్య
- పార్టీ ద్రోహులను రాహుల్ గాంధీ గుర్తించాలని సూచన



హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ అంతర్గత వ్యవహారాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి అంశానికీ సిట్ దర్యాప్తులు మిగతా 2 లో

## ప్రపంచ తొలి ట్రిలియనీర్‌గా మస్క్.. ఆయన సంపద భారత జీడీపీలో నాలుగో వంతు!



- 1.1 ట్రిలియన్ డాలర్లకు చేరిన సంపద
- స్పేస్‌ఎక్స్ ఐపీఓతో సంపదలో భారీ పెరుగుదల
- తైవాన్ జీడీపీ కంటే ఎక్కువ ఆస్తులు
- స్పేస్‌ఎక్స్ వాటా విలువే 866 బిలియన్ డాలర్లు
- ప్రపంచ కుబేరుల జాబితాలో మస్క్ అగ్రస్థానం



## పాలకులం సేవకులం..

## ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాం

## రెండేళ్ల పాలనపై సీఎం చంద్రబాబు

- ఏపీలో రెండేళ్లు పూర్తి చేసుకున్న ఎన్డీఏ ప్రభుత్వం
- గత ప్రభుత్వం మిగిల్చిన సవాళ్లను అధిగమించామన్న సీఎం
- అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన అందించడమే లక్ష్యమని వెల్లడి
- ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన చంద్రబాబు

## రాష్ట్ర పునర్నిర్మాణం కోసం

# కూటమి ఏర్పడింది

## ప్రజాస్వామ్యంలో తుది నిర్ణేతలు ప్రజలే

- ప్రజల తీర్పే చరిత్రను మార్చింది.. ఏపీ పునర్నిర్మాణానికి కూటమి కట్టుబడి ఉంది: పవన్ కల్యాణ్
- ఎన్నికల హామీల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని వెల్లడి
- విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను అడ్డుకున్నామని వ్యాఖ్య



అమరావతి: ప్రజాస్వామ్యంలో అంతిమ న్యాయనిర్ణేతలు ప్రజలేనని, వారి తీర్పును మించిన శక్తి ఏదీ లేదని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. 2024 ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు కేవలం ప్రభుత్వ మార్పునకు మాత్రమే పరిమితం కాలేదని, రాష్ట్ర భవిష్యత్తుకు కొత్త దిశను నిర్దేశించిందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణం కోసం ప్రజలు కూటమిపై ఉంచిన నమ్మకాన్ని మిగతా 2 లో

## 'అఖండ' కాంగ్రెస్ దిశగా అడుగులు?

## ఆ పార్టీలు విలీనం కానున్నాయా?

- కాంగ్రెస్‌లోకి తిరిగి చేరే అంశంపై టీఎంసీ, ఎన్సీపీ-ఎస్పీ చుట్టూ చర్చ
- మమతా, శరద్ పవార్ విలీనానికి సిద్ధమంటూ నానా పటోలే వ్యాఖ్యలు
- రాహుల్ గాంధీ నాయకత్వంలో ప్రతిపక్ష ఐక్యతకు కాంగ్రెస్ నేతల పిలుపు
- సోనియా, రాహుల్‌తో మమతా-అభిషేక్ భేటీల తర్వాత ఊహాగానాలు
- విలీన ప్రతిపాదన వస్తే టీఎంసీ నుంచే రావాలని కాంగ్రెస్ స్పష్టీకరణ



ఢిల్లీ: దేశ రాజకీయాల్లో మరో కీలక పరిణామానికి వేదిక సిద్ధమవుతోందా? ఒకప్పుడు కాంగ్రెస్ నుంచి విడిపోయి ప్రాంతీయ పార్టీలను స్థాపించిన నేతలు మళ్లీ అదే గూటికి చేరబోతున్నారా? ఈ ప్రశ్నలే ప్రస్తుతం మిగతా 2 లో

## భారతీయ సిబ్బంది నౌకపై దాడి..
# అమెరికాకు భారత్ మరోసారి గట్టి నిరసన

అమరావతి: ఒమన్ తీరంలో భారతీయ నావికులు ఉన్న వాణిజ్య నౌకలపై వరుస దాడులు కొనసాగుతుండటంతో అమెరికా తీరు పట్ల భారత్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తోంది. గత 48 గంటల్లో రెండోసారి ఢిల్లీలోని అమెరికా సీనియర్ దౌత్యాధికారిని విదేశాంగ శాఖ పిలిపించి అధికారికంగా నిరసన తెలిపింది. నిన్న జరిగిన ఘటనలో 20 మంది భారతీయ సిబ్బంది ఉన్న ఓ వాణిజ్య నౌక దాడికి గురికావడం పరిస్థితిని మరింత ఉద్రిక్తంగా మార్చింది. అమెరికా అధికారి జేసన్ మీక్స్‌ను పిలిపించి భారత విదేశాంగ శాఖ తమ ఆందోళనలను నేరుగా తెలియజేసింది. గత దాడుల్లో ముగ్గురు భారతీయ నావికులు మృతి చెందడంతో పరిస్థితులు ఒక్కసారిగా వేడెక్కాయి. ఒమన్ తీర ప్రాంతంలో నాలుగు రోజుల వ్యవధిలో భారతీయ సిబ్బంది ఉన్న మూడు వాణిజ్య నౌకలను అమెరికా నౌకాదళం లక్ష్యంగా చేసుకుందని భారత ప్రభుత్వం వెల్లడించింది. భారత నావికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు. సెట్టెబెల్లో నౌకపై దాడి జరిగిన వెంటనే అమెరికా అధికారులకు గట్టి నిరసన తెలిపినట్లు వెల్లడించారు. ఇలాంటి దాడులు వెంటనే ఆగాలని, సమస్యల పరిష్కారానికి యుద్ధం కంటే చర్చలు, దౌత్య మార్గాలే సరైనవని భారత్ స్పష్టం చేసిందన్నారు. ప్రపంచ వాణిజ్యానికి అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిలో అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా నౌకాయానానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని భారత్ కోరింది. పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో పరిస్థితిని శాంతియుతంగా పరిష్కరించేందుకు అన్ని పక్షాలు సంభాషణల బాట పట్టాలని ఢిల్లీ పిలుపునిచ్చింది.

## పాలకులం సేవకులం.. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాం
# రెండేళ్ల పాలనపై సీఎం చంద్రబాబు

అమరావతి: ఏపీలో టీడీపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి శుక్రవారంతో రెండేళ్లు పూర్తయింది. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు స్పందిస్తూ, గత వైసీపీ ప్రభుత్వం మిగిల్చి వెళ్లిన సవాళ్లు, సంక్షోభాలను అధిగమించి, ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన అందిస్తున్నామని స్పష్టం చేశారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా చంద్రబాబు తన అభిప్రాయాలను పంచుకున్నారు. "ఐదు కోట్ల ప్రజల అపారమైన నమ్మకంతో ఈ ప్రజా ప్రభుత్వం ఏర్పడి నేటికి సరిగ్గా రెండేళ్లు పూర్తయింది. గత ప్రభుత్వం సవాళ్లు, సంక్షోభాలు, అపరిష్కృత సమస్యల వారసత్వాన్ని మిగిల్చి వెళ్లగా, వాటన్నింటినీ అధిగమించి మేము ముందుకు సాగుతున్నాం" అని ఆయన పేర్కొన్నారు. పాలనపై తమ ప్రభుత్వ విధానాన్ని వివరిస్తూ.. "అధికారం ఒక బాధ్యత అని, పాలకులు ప్రజలకు సేవకులని మా ప్రగాఢ నమ్మకం. ప్రతి పౌరుడు, ప్రతి కుటుంబం, సమాజంలోని ప్రతి వర్గం విజయం, శ్రేయస్సే మా ఎజెండా. వారి ఆశలు, ఆకాంక్షలను నెరవేరుస్తూ రాష్ట్ర భవిష్యత్తుకు బాటలు వేస్తున్నాం" అని చంద్రబాబు అన్నారు. ఈ రెండేళ్ల ప్రయాణంలో కేంద్ర ప్రభుత్వ సహకారానికి ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. "రాష్ట్ర అభివృద్ధికి ప్రతి అడుగులో అండగా నిలుస్తున్న ప్రధాని నరేంద్ర మోదీకి, కేంద్ర ప్రభుత్వానికి ప్రజల తరపున నా కృతజ్ఞతలు తెలుపుతున్నాను. కేంద్ర ప్రభుత్వ సహకారంతో, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ భాగస్వామ్యంతో 'స్వర్ణాంధ్ర' దిశగా పయనిస్తున్నాం" అని ఆయన పేర్కొన్నారు. తమకు అండగా నిలిచిన రాష్ట్ర ప్రజలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతూ, భవిష్యత్తులో చేపట్టబోయే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజల మద్దతు ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించారు.

పునరుద్ధరించబడిన ఆశావాదం: కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనపై కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కూడా 'ఎక్స్'లో స్పందించారు. "రెండేళ్ల క్రితం, ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఒక కొత్త ప్రారంభం కోసం ఎన్డీఏపై నమ్మకం ఉంచారు. మా ముందున్న సవాళ్లు చాలా పెద్దవి. రాష్ట్ర భవిష్యత్తుపై తిరిగి విశ్వాసం నింపడం అంత సులభమైన పని కాదు" అని ఆయన పేర్కొన్నారు. "గడిచిన రెండేళ్లలో ప్రధాని మోదీ మార్గదర్శకత్వంలో, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నాయకత్వంలో బలమైన కేంద్ర-రాష్ట్ర భాగస్వామ్యం ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను తిరిగి వృద్ధి, అవకాశాలు, అభివృద్ధి పథంలో నిలబెట్టేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నం జరిగింది. ఇంకా చేయాల్సింది చాలా ఉన్నప్పటికీ, ఈ రోజు మన ప్రజల్లో పునరుద్ధరించబడిన ఆశావాదం, రాష్ట్రం సరైన దిశలో పయనిస్తోందన్న విశ్వాసం మాకు మరింత ప్రోత్సాహాన్ని ఇస్తోంది. ప్రజలు మాపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు" అని రామ్మోహన్ నాయుడు తన పోస్టులో పేర్కొన్నారు.

## సముద్రాల్లో దాడులు.. భారత నావికుల రక్షణపై
# కేంద్రం కీలక ప్రకటన

ఢిల్లీ: సముద్ర వాణిజ్య మార్గాల్లో ఇటీవలి కాలంలో పెరుగుతున్న దాడుల నేపథ్యంలో భారతీయ నావికుల భద్రత, సంక్షేమంపై కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో దృష్టి సారించింది. ఈ విషయంలో అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని, ప్రతి నావికుడికి అండగా ఉంటామని స్పష్టం చేసింది. ప్రమాదకర ప్రాంతాల్లో ప్రయాణించే నావికులకు, నౌకా కంపెనీలకు కీలక సూచనలు జారీ చేసింది. ఇటీవల ఒమన్‌లోని సోహార్‌కు ఈశాన్యంగా 20 నాటికల్ మైళ్ల దూరంలో ప్రయాణిస్తున్న 'ఎంటీ సెట్టెబెల్లో' అనే నౌకపై క్షిపణి దాడి జరిగినట్లు వార్తలు వచ్చాయి. పలావు జెండాతో ఉన్న ఈ ట్యాంకర్‌లో మొత్తం 28 మంది సిబ్బంది ఉండగా, వారిలో 24 మంది భారతీయులే ఉన్నారు. ఈ ఘటనతో వాణిజ్య నౌకలకు పొంచి ఉన్న ప్రమాదాలు మరోసారి స్పష్టమయ్యాయి. ఈ పరిస్థితుల దృష్ట్యా, కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ కీలక ప్రకటన చేశారు. ప్రతి భారతీయ నావికుడి భద్రత, సంక్షేమానికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని ఆయన హామీ ఇచ్చారు. నావికుల భద్రత కోసం విదేశాంగ మంత్రిత్వ శాఖ, భారత నౌకాదళం, విదేశాల్లోని భారత రాయబార కార్యాలయాలు, మిత్రదేశాల సముద్రయాన యంత్రాంగాలు, షిప్పింగ్ కంపెనీలతో కలిసి సమన్వయంతో పనిచేస్తున్నామని ఆయన వివరించారు. బాధిత నావికులకు, వారి కుటుంబాలకు తక్షణ సహాయం అందించేందుకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ ఆధ్వర్యంలోని సీఫేరర్స్ వెల్ఫేర్ ఫండ్ సొసైటీ (ఎస్‌డబ్ల్యూఎఫ్ఎస్) సిద్ధంగా ఉందని ప్రభుత్వం తెలిపింది. ప్రోటోకాల్ ప్రకారం, ఇలాంటి సంఘటనల్లో మరణించిన నావికుల కుటుంబాలకు రూ.10 లక్షల ఆర్థిక సహాయాన్ని ఎస్‌డబ్ల్యూఎఫ్ఎస్ అందిస్తుంది. అంతేగాక డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ ద్వారా నావికులకు పలు సూచనలు జారీ చేసింది. ప్రమాదకర జలాల్లో ప్రయాణించేటప్పుడు అత్యంత అప్రమత్తంగా ఉండాలని నావికులను హెచ్చరించింది. నౌకల నిర్వాహకులు, షిప్పింగ్ కంపెనీలు సముద్ర భద్రతా ప్రోటోకాల్స్‌ను కచ్చితంగా పాటించాలని, ప్రభుత్వ సలహాలను ఎప్పటికప్పుడు గమనించాలని ఆదేశించింది. భారత నావికులకు సంబంధించి ఎలాంటి సంఘటన జరిగినా వెంటనే తమకు నివేదించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు అన్ని సంబంధిత ఏజెన్సీలు హై అలర్ట్‌లో ఉండాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

## ప్రపంచ తొలి ట్రిలియనీర్‌గా మస్క్..
# ఆయన సంపద భారత జీడీపీలో నాలుగో వంతు!

ఢిల్లీ: ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ మరో అరుదైన రికార్డు సృష్టించారు. 1 ట్రిలియన్ డాలర్లకు పైగా వ్యక్తిగత సంపద కలిగిన తొలి వ్యక్తిగా నిలిచారు. స్పేస్‌ఎక్స్ ఐపీఓ విజయవంతం కావడంతో మస్క్ సంపద భారీగా పెరిగింది. ప్రస్తుతం ఆయన నికర ఆస్తుల విలువ 1.1 ట్రిలియన్ డాలర్లను (రూ.94.6 లక్షల కోట్లు) దాటనున్నట్లు అంచనాలు చెబుతున్నాయి. స్పేస్‌ఎక్స్ షేర్లు మార్కెట్లోకి రావడంతో మస్క్ సంపదలో ఒక్కసారిగా భారీ పెరుగుదల నమోదైంది. ఐపీఓకు ముందు ఆయన సంపద సుమారు 780 బిలియన్ డాలర్లుగా అంచనా వేశారు. ఇప్పుడు స్పేస్‌ఎక్స్‌లోని వాటా విలువ ఒక్కటే 866 బిలియన్ డాలర్లకు చేరినట్లు తెలుస్తోంది. టెస్లా, ఇతర కంపెనీల్లోని వాటాలను కలుపుకొంటే మొత్తం సంపద 1.1 ట్రిలియన్ డాలర్లను దాటుతోంది. ఈ స్థాయిలో సంపద కలిగిన వ్యక్తి ఇప్పటివరకు లేరు. స్పేస్‌ఎక్స్ ఐపీఓకు ముందు కూడా మస్క్ ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడు. ఆయన సంపద దాదాపు 971 బిలియన్ డాలర్లుగా ఉండేది. రెండో స్థానంలో ఉన్న గూగుల్ సహ వ్యవస్థాపకుడు ల్యారీ పేజ్ సంపద సుమారు 304 బిలియన్ డాలర్లు మాత్రమే మస్క్ సంపద ఇప్పుడు కొన్ని దేశాల మొత్తం ఆర్థిక వ్యవస్థలనే దాటిపోవడం విశేషం. అంతర్జాతీయ ద్రవ్య నిధి అంచనాల ప్రకారం తైవాన్ జీడీపీ విలువ 976.7 బిలియన్ డాలర్లు. ప్రస్తుతం భారత జీడీపీ సుమారు 4.15 ట్రిలియన్ డాలర్లని (రూ.356.9 లక్షల కోట్లు) అంచనా. అంటే మన దేశ ఆర్థిక వ్యవస్థలో దాదాపు నాలుగో వంతుకు సమానమైన సంపద ఒక్క మస్క్ వద్దే ఉంది. 1971లో దక్షిణాఫ్రికాలో జన్మించిన ఎలాన్ మస్క్ గత మూడు దశాబ్దాల్లో ప్రపంచ వ్యాపార రంగాన్ని ప్రభావితం చేసిన వ్యక్తిగా ఎదిగారు. టెస్లా ద్వారా ఎలక్ట్రిక్ వాహనాలకు కొత్త దిశ చూపించారు. స్పేస్‌ఎక్స్‌తో అంతరిక్ష రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. న్యూరాలింక్, బోరింగ్ కంపెనీ వంటి సంస్థలను కూడా స్థాపించారు. 2022లో ట్విట్టర్‌ను కొనుగోలు చేసి దానికి 'ఎక్స్'గా పేరు మార్చిన సంగతి తెలిసిందే. మస్క్ కంపెనీలకు పెట్టుబడిదారులు ఇస్తున్న ప్రత్యేక విలువను మార్కెట్ విశ్లేషకులు 'ఎలాన్ ప్రీమియం'గా అభివర్ణిస్తున్నారు. ఆయన ఆలోచనలు, వ్యాపార దూకుడు, భవిష్యత్‌పై పెట్టే భారీ పందేలు పెట్టుబడిదారుల్లో విశ్వాసాన్ని పెంచుతున్నాయని చెబుతున్నారు. అందుకే సంప్రదాయ విలువల లెక్కలకు మించి ఆయన కంపెనీలకు మార్కెట్‌లో భారీ విలువ లభిస్తోందని విశ్లేషిస్తున్నారు.

## మీనాక్షి రాజ్యసభ నామినేషన్ వివాదంపై
# సిట్ విచారణ జరిపించండి

ప్రతి అంశానికీ సిట్ దర్యాప్తులు ఏర్పాటు చేస్తోందని, అదే విధంగా ఆ పార్టీ నాయకురాలు మీనాక్షి నటరాజన్ రాజ్యసభ అభ్యర్థిత్వానికి సంబంధించిన వివాదంపైనా సిట్ విచారణ జరపాలని వ్యంగ్యం ప్రదర్శించారు. మీనాక్షి నటరాజన్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్‌లోనే కొందరు నాయకులు వ్యవహరించి ఉండవచ్చని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. ఈ అంశాన్ని ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లింది కూడా కాంగ్రెస్ వర్గాలేనని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్‌లో ఉన్న అంతర్గత విభేదాలు, వర్గపోరాటాలే ఈ పరిస్థితులకు కారణమని పేర్కొన్నారు. పార్టీ ద్రోహులు ఎవరో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ గుర్తించాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వ పనితీరుపై కూడా కేటీఆర్ విమర్శలు గుప్పించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభివృద్ధి కంటే ప్రచారానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే ఉన్న హైదరాబాద్ నగర సమస్యలను పరిష్కరించకుండా భవిష్యత్ నగరాల పేరుతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం జరుగుతోందన్నారు. తాజాగా కురిసిన వర్షాలతో నగరంలో ఏర్పడిన పరిస్థితులు ప్రభుత్వ వైఫల్యాన్ని బయటపెట్టాయని వ్యాఖ్యానించారు. అలాగే, కేంద్రం తీసుకురానున్న డీలిమిటేషన్ ప్రక్రియపై కూడా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గేలా నిర్ణయాలు తీసుకుంటే బీఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని హెచ్చరించారు. దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా చూడాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందని కేటీఆర్ స్పష్టం చేశారు.

# హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్--2 విస్తరణకు సహకారం అందించాలి

మొదటి పేజి తరువాయి

రూ. 6 లక్షల కోట్లు కేటాయించాలని నీతి ఆయోగ్ సమావేశంలో ప్రతిపాదించింది. ఇందులో భాగంగా హైదరాబాద్ నగరాభివృద్ధికి రూ. లక్ష కోట్లివ్వాలని కోరింది. ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన నీతి ఆయోగ్ పాలకమండలి భేటీలో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక ప్రతిపాదనలు చేశారు. దేశ జనాభాలో దాదాపు 10 శాతం మంది హైదరాబాద్, ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, చెన్నై, బెంగళూరు నగరాల్లో నివసిస్తుండగా దేశ స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ)లో సుమారు పావు వంతు (25 శాతం) వాటాను ఇవే సమకూరుస్తున్నాయని.. అందువల్ల ఈ నగరాల అభివృద్ధిని సాధారణ వ్యయంగా కాకుండా, అభివృద్ధి చెందిన భారత నిర్మాణానికి అవసరమైన వ్యూహాత్మక పెట్టుబడిగా చూడాలని రేవంత్‌రెడ్డి సూచించారు. అదే సమయంలో రాష్ట్రంలోని పలు అభివృద్ధి ప్రాజెక్టులకు కేంద్రం నుంచి ఆర్థిక, పరిపాలనా సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వ వికసిత్ భారత్--2047 లక్ష్యాలకు అనుగుణంగా తెలంగాణ ముందుకెళ్తోందని రేవంత్‌రెడ్డి వివరించారు. '2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎస్‌జీడీపీ సాధించే రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం'అని ఆయన పేర్కొన్నారు. ఇందుకోసం పట్టణ, పారిశ్రామిక, గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు వెల్లడించారు. విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు చేపట్టామని.. తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ద్వారా ప్రీ--ప్రైమరీ నుంచి ఇంటర్ వరకు ఒకే క్యాంపస్‌లో విద్య, భోజనం, రవాణా, డిజిటల్ లెర్నింగ్ వంటి సదుపాయాలు కల్పించనున్నట్లు సీఎం రేవంత్ చెప్పారు. 105 నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు కోసం సుమా రు రూ. 24,000 కోట్ల వ్యయంతో ప్రణాళిక



రూపొందించామన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు శిక్షణ ఇచ్చేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామ ని వివరించారు. 65 ఐటీఐలను ఆధునిక అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా అభివృద్ధి చేస్తూ రోబోటిక్స్, ఎలక్ట్రిక్ వెహికల్స్ వంటి కోర్సులు అందిస్తున్నామన్నారు. 26 వేలకుపైగా విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్ అందించామని.. ఉపాధ్యాయుల కొరత తీ ర్చేందుకు 11 వేలకుపైగా ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు జారీ చేసినట్లు సీఎం వివరించారు. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నాలెడ్జ్ హబ్ గా తీర్చిదిద్దేందుకు హార్వర్డ్, స్టాన్‌ఫర్డ్, ఆక్స్‌ఫర్డ్ వంటి అంతర్జాతీయ విద్యాసంస్థలను రాష్ట్రానికి తీసుకురావడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని, యూనివర్సిటీ ఆఫ్ లండన్ హైదరాబాద్‌లో ఆఫ్‌షోర్ క్యాంపస్ ఏర్పాటు చేయనుందని తెలిపారు. ఏ రాష్ట్రానికి చెందిన ముఖ్యమంత్రి లేదా అధికారులైనా తెలంగాణలోని యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను చూడాలనుకుంటే సంతోషంగా చూపిస్తామని సీఎం చెప్పారు. రాష్ట్రంలోని అన్ని ఐటీఐలను ఆధునిక సాంకేతిక శిక్షణ కేంద్రాలుగా మార్చేందుకు టాటా గ్రూప్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్నామని సీఎం తెలిపారు. ఈ ప్రాజెక్టులో టాటా రూ. 2,100 కోట్ల పెట్టుబడి పెడుతోందన్నారు.

### నీతి ఆయోగ్‌కు సీఎం చేసిన వినతులు ఇవీ..

తెలంగాణ విద్యార్థుల దీర్ఘకాలిక ఆకాంక్ష అయిన ఐఐఎంను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలి. హైదరాబాద్ విస్తరణకు వెన్నెముకగా భావిస్తున్న రీజినల్ రింగ్‌రోడ్డు ప్రాజెక్టు వేగవంతానికి సహకరించాలి. భారత్ ఫ్యూచర్ సిటీని ఏపీలోని మచిలీపట్నం పోర్టుతో అనుసంధానించే 12 లేన్ల ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణానికి ఆర్థిక తోడ్పాటు అందించాలి. హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్--2 విస్తరణకు సహకారం అందించాలి. హైదరాబాద్ చారిత్రక జీవనాడి అయిన మూసీ నదిని ప్రపంచస్థాయి రివర్‌ఫ్రంట్‌గా అభివృద్ధి చేసేందుకు నిధులివ్వాలి. 30 వేల ఎకరాల్లో ప్రతిపాదించిన గ్రీన్‌ఫీల్డ్, నెట్ జీరో 'భారత్ ఫ్యూచర్ సిటీ'కి ప్రత్యేక గుర్తింపు, ఆర్థిక మద్దతు ఇవ్వాలి. పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టుకు సీడబ్ల్యూసీ అనుమతులు, పీఎంకేఎస్‌వై సాయం మంజూరు చేయాలి. ఐ సెమీకండక్టర్ మిషన్‌లో తెలంగాణకు ప్రాధాన్యమిచ్చి ఎలక్ట్రానిక్స్ రంగాన్ని బలోపేతం చేసేందుకు ఏపీఎంపీ, ఓసాట్ క్లస్టర్లు, మైక్రో ఎల్ఈడీ ఫ్యాబ్రికేషన్ యూనిట్లు ఏర్పాటు చేయాలి.

# జగన్ పేరులో 'జీ' అంటే 'జెన్ జీ' కాదు.. గొడ్డలి..

రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. ఈ ప్రాజెక్టు దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా తిరుపతిలో నిర్వహించిన విజయోత్సవ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో కలిసి లోకేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రతిపక్ష నేత జగన్ పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.

జగన్‌కు సీసీడీ జబ్బుంది.. జీ అంటే గొడ్డలి

ప్రతిపక్ష నేత జగన్‌కు 'సీసీడీ' (క్రెడిట్ చోరీ డిజార్డర్) అనే జబ్బు ఉందని లోకేశ్ ఎద్దేవా చేశారు. తాము కష్టపడి గూగుల్, ఆర్సెలర్ మిట్టల్ వంటి కంపెనీలను రాష్ట్రానికి తీసుకొస్తే, వాటిని తానే తెచ్చానని ప్రెస్‌మీట్ పెట్టి ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. "ఇంకొంత కాలం సమయం ఇస్తే, ఆగస్టు 15న ప్రెస్‌మీట్ పెట్టి భారతదేశానికి స్వాతంత్ర్యం తెచ్చింది మా తాతేనని ప్రకటించినా ఆశ్చర్యపోనక్కర్లేదు" అని లోకేశ్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. జగన్ తెచ్చిన కంపెనీలు కేవలం ఆంధ్రా గోల్డ్, ప్రెసిడెంట్ మెడల్, గోల్డ్ మెడల్ వంటి మద్యం బ్రాండ్లు మాత్రమేనని ఆరోపించారు. "జగన్ పేరులో ఉన్న 'జీ' అంటే జెన్-జీ అనుకుంటున్నారు. కానీ, ఆ జీకి అసలు అర్థం 'గొడ్డలి'. విధ్వంసమే ఆయన ఎజెండా" అని లోకేశ్ తీవ్రంగా విమర్శించారు. తమది గూగుల్ అయితే వాళ్లది గొడ్డలని, తమది ఫైటర్ జెట్స్ అయితే వాళ్లది ఫ్యాక్షన్ అని, తమది కియా అయితే వాళ్లది కిడ్నాప్ అని పోల్చారు.

రెండేళ్ల పాలనలో ప్రశాంతత

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో రాష్ట్రంలో



ప్రశాంత వాతావరణం నెలకొందని లోకేశ్ అన్నారు. గతంలో మాదిరిగా దాడులు, జేసీబీలతో కూల్చివేతలు, కబ్జాలు, హత్యలు, బెదిరింపులు లేవని చెప్పారు. "ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇదే చంద్రగిరి గడ్డపై చెప్పాను. వెంకన్నతో పెట్టుకోవద్దు, మాడి మసైపోతావని జగన్‌ను హెచ్చరించాను. ఆయన వినకుండా స్వామితోనే పెట్టుకున్నారు, ఫలితం 2024లో చూశారు" అని గుర్తుచేశారు. వై నాట్ 175 అన్నవారికి ప్రజలు 11 సీట్లు ఇచ్చారని, సిద్ధం అన్నవారికి ప్రజలు యుద్ధం ప్రకటించారని అన్నారు.

డీఎస్సీపై జగన్ విమర్శలు.. రాజ్యాంగంపై దాడి

చిన్నప్పుడు పదో తరగతి పేపర్ లీక్ కేసులో దొరికినప్పుడు టీచర్లు కొట్టారనే కోపంతోనే జగన్ ఉపాధ్యాయులపై కక్షగట్టారని లోకేశ్ ఆరోపించారు. ఉపాధ్యాయులను మద్యం దుకాణాల వద్ద కాపలా పెట్టిన చరిత్ర జగన్‌దని విమర్శించారు. మెగా డీఎస్సీని అడ్డుకోవడానికి 226 కేసులు వేశారని, అయినా 150 రోజుల్లో 16,347 పోస్టులను భర్తీ చేశామని తెలిపారు. ఇప్పుడు డీఎస్సీపై జగన్ చేస్తున్న ఆరోపణలు తనపైనో, ప్రభుత్వంపైనో కాదని, నేరుగా అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను ప్రశ్నించడమేనని అన్నారు.

అభివృద్ధి, సంక్షేమంలో పరుగులు

ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ దేశంలో ఏ రాష్ట్రం అమలు చేయని సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని లోకేశ్ తెలిపారు. పెన్షన్‌ను రూ.2000 నుంచి ఒకేసారి రూ.4000కు పెంచామని, అన్నా క్యాంటీన్లు పునఃప్రారంభించామని, 16,347 డీఎస్సీ పోస్టులతో పాటు 6,000 కానిస్టేబుల్ పోస్టులు, జాబ్ క్యాలెండర్ ద్వారా మరో 10,060 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు ఇచ్చామని వివరించారు. స్త్రీశక్తి ఉచిత బస్సు ప్రయాణం, 'దీపం-2' కింద ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం వంటి పథకాలతో జనరంజక పాలన అందిస్తున్నామన్నారు.

ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వం వల్లే ప్రపంచంలో భారత్‌కు గౌరవం పెరిగిందని లోకేశ్ అన్నారు. ఏపీలో ఉన్నది సాధారణ డబుల్ ఇంజన్ సర్కార్ కాదని, ఇది 'డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్' అని అభివర్ణించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతోనే విశాఖ స్టీల్ ప్లాంట్, రైల్వే జోన్, పోలవరం, అమరావతికి నిధులు, ఫైటర్ జెట్ ప్రాజెక్టు వంటివి సాకారమయ్యాయని తెలిపారు. త్వరలోనే కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కూటమిలోని టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు అహంకారానికి పోకుండా, ఒకే కుటుంబంలా కలిసి పనిచేయాలని, ప్రజలకు చేసిన మంచి పనులను వివరించాలని లోకేశ్ దిశానిర్దేశం చేశారు.

# రాష్ట్ర పునర్నిర్మాణం కోసం కూటమి ఏర్పడింది

ప్రజలు కూటమిపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా తిరుపతి సమీపంలోని దామినేడులో నిర్వహించిన 'రెండేళ్ల నమ్మకం.. అభివృద్ధి, సంక్షేమం' బహిరంగ సభలో పవన్ కల్యాణ్ మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌తో పాటు పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చారిత్రక విజయానికి కారణమైన ప్రజలకు, కూటమి శ్రేణులకు పవన్ కృతజ్ఞతలు తెలిపారు. "రెండేళ్ల క్రితం ప్రజలు మాకు కేవలం అధికారాన్ని ఇవ్వలేదు.. ఒక పెద్ద బాధ్యతను అప్పగించారు. అహంకారం, విధ్వంసక రాజకీయాలపై ప్రజాస్వామ్యం సాధించిన విజయమే 2024 ఎన్నికల ఫలితం. రాష్ట్ర అభివృద్ధి కోసం, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం కోసం కూటమి ఏర్పడింది. అధికారాన్ని పంచుకోవడం కోసం కాదు.. బాధ్యతను పంచుకోవడం కోసం ఈ కూటమి ముందుకొచ్చింది" అని పవన్ అన్నారు. జనసేన కేవలం 21 స్థానాల్లో పోటీ చేసినప్పటికీ, ప్రజల ఆశీర్వాదంతో అన్ని స్థానాల్లో విజయం సాధించడం తమపై ప్రజలు ఉంచిన విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పవన్ స్పష్టం చేశారు. గ్రామీణాభివృద్ధికి కీలకమైన పంచాయతీరాజ్ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అలాగే ఎన్డీయే ప్రభుత్వ సమష్టి కృషి వల్ల విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణను అడ్డుకోగలిగామని తెలిపారు. దేశంలో అత్యధిక కాలం నిరంతరాయంగా ఎన్నికైన ప్రధానమంత్రిగా కొనసాగుతున్న నరేంద్ర మోదీకి ఈ సందర్భంగా అభినందనలు తెలియజేశారు. ఇటీవల జరిగిన విశాఖ స్టీల్ ప్రమాదంలో తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోవడం తీవ్ర విషాదకరమని పవన్ పేర్కొన్నారు. ఆ దుర్ఘటన కారణంగానే ఈ నెల 9న జరగాల్సిన కార్యక్రమాన్ని వాయిదా వేసి ఇప్పుడు నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, రాష్ట్ర అభివృద్ధి కోసం అందరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు.

# అమిత్ షా చెబుతున్న ఈ బియ్యం ప్రత్యేకత ఏంటి?

ఢిల్లీ: దేశంలో రక్తహీనత, పోషకాహార లోపాలను అరికట్టేందుకు ఫోర్టిఫైడ్ బియ్యం (పోషకాలతో కూడిన బియ్యం) పంపిణీ ఎంతగానో దోహదపడుతుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన (పీఎంజీకేఏవై) పథకం కింద 80 కోట్ల మందికి ఉచితంగా ఫోర్టిఫైడ్ బియ్యం సరఫరాను 2028 డిసెంబర్ వరకు కొనసాగించాలని కేంద్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాన్ని ఆయన స్వాగతించారు. ఈ నిర్ణయం వల్ల కోట్లాది మంది లబ్ధిదారుల ఆరోగ్యం స్థితిగతులు మెరుగుపడతాయని ఆయన సామాజిక మాధ్యమాల వేదికగా వెల్లడించారు. ఫోర్టిఫైడ్ బియ్యం అంటే ప్రత్యేకమైన వంగడం ఏమీ కాదు. మనం రోజూ తినే సాధారణ బియ్యానికే ఐరన్, ఫోలిక్ యాసిడ్, విటమిన్ బీ12 వంటి కీలక సూక్ష్మ పోషకాలను జోడిస్తారు. ఈ ప్రక్రియలో బియ్యం గింజలపై పోషకాల పూత పూయడం లేదా పోషకాలతో కూడిన గింజలను సాధారణ బియ్యంలో కలపడం జరుగుతుంది. ఈ బియ్యం రుచి, వాసన, రంగులో సాధారణ బియ్యంలాగే ఉంటాయి. వండినప్పుడు కూడా ఎలాంటి తేడా ఉండదు. భారత్‌లో మహిళలు, పిల్లలతో సహా అన్ని వయసుల వారిలో ఐరన్ లోపం వల్ల కలిగే రక్తహీనత (అనీమియా) తీవ్రమైన ప్రజారోగ్య సమస్యగా ఉంది. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే గణాంకాలు కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. దేశంలో చాలా మందికి అన్నమే ప్రధాన ఆహారం. ఇడ్లీ, దోశ, పులావ్, కిచిడీ వంటి ఎన్నో రకాలుగా బియ్యాన్ని ఉపయోగిస్తారు. అందుకే, ప్రజల ఆహారపు అలవాట్లను మార్చకుండా, వారి రోజువారీ భోజనం ద్వారానే పోషకాలను అందించేందుకు ఫోర్టిఫికేషన్ ఒక సులభమైన, సమర్థవంతమైన మార్గమని నిపుణులు చెబుతున్నారు. ఈ పథకం కోసం కేంద్ర ప్రభుత్వం సుమారు ?17,082 కోట్లు కేటాయించింది.

## నిమ్స్‌లో చికిత్స పొందుతున్న
# ఖమ్మం బాలికకు హరీశ్ రావు పరామర్శ..


హైదరాబాద్: తెలంగాణలోని ఖమ్మం పట్టణంలో 12 ఏళ్ల బాలికపై జరిగిన అమానుష దాడి రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపుతోంది. బాలికపై లైంగిక దాడికి యత్నించి, ఆమెను ఒక అపార్ట్‌మెంట్ మూడో అంతస్తు నుంచి కిందకు తోసేసిన ఈ ఘటనపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈ ప్రమాదంలో వెన్నెముక, పక్కటెముకలు, చేతులకు తీవ్ర గాయాలైన బాధితురాలు ప్రస్తుతం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. వివరాల్లోకి వెళితే.. జూన్ 6న ఖమ్మంలోని రాపర్తి నగర్‌లో ఈ దారుణం చోటుచేసుకుంది. అదే అపార్ట్‌మెంట్‌లో కారు డ్రైవర్‌గా పనిచేస్తున్న మహమ్మద్ గౌస్, వాచ్‌మెన్ కుమార్తె అయిన సదరు బాలికను పైఅంతస్తులోకి తీసుకెళ్లి లైంగిక దాడికి యత్నించాడు. బాలిక ప్రతిఘటిస్తూ కేకలు వేయడంతో, నిందితుడు ఆమెను భవనం పైనుంచి కిందకు తోసేశాడు. మొదట ఇది ప్రమాదవశాత్తు జరిగిన ఘటనగా భావించిన కుటుంబ సభ్యులు, బాలిక స్పృహలోకి వచ్చిన తర్వాత అసలు విషయం చెప్పడంతో దిగ్భ్రాంతికి గురయ్యారు. ఈ ఘటనపై ఖమ్మం పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, 24 గంటల్లోనే నిందితుడిని అరెస్ట్ చేశారు. ప్రస్తుతం బాలిక ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, ఆమె ఆహారం తీసుకుంటోందని నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాహుల్ దేవరాజ్ వెల్లడించారు.

నిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాలికను బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి టి. హరీశ్ రావు పరామర్శించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, కాంగ్రెస్ పాలనలో ప్రతిరోజూ 5 నుంచి 6 పోక్సో కేసులు నమోదవుతున్నాయని ఆయన ఆరోపించారు. బాధితురాలికి ప్రభుత్వం తక్షణమే రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, మెరుగైన వైద్యాన్ని పూర్తిగా ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు. నిమ్స్‌లో మందులు ఉచితంగా లభించడం లేదని, పేద కుటుంబానికి చెందిన బాధితులు వాటిని బయట కొనాల్సి వస్తోందని ఆయన విమర్శించారు.

# అమెరికా క్షిపణి దాడిలో
# మెరైన్ ఇంజినీర్ పట్నాల సురేష్ మృతి...

అమరావతి: ఒమన్ తీరంలో ఆయిల్ ట్యాంకర్‌పై జరిగిన అమెరికా క్షిపణి దాడిలో విశాఖపట్నానికి చెందిన చీఫ్ ఇంజినీర్ పట్నాల సురేష్ మృతి చెందారు. ఈ విషాద ఘటనపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. సురేష్ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని విధాలా అండగా నిలవాలని ఆయన అధికారులను ఆదేశించారు. మృతదేహాన్ని వీలైనంత త్వరగా స్వదేశానికి తరలించేందుకు చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. ఈ మేరకు ఒమన్‌లోని భారత రాయబార కార్యాలయం, స్థానిక అధికారులతో సమన్వయం చేసుకోవాలని స్పష్టం చేశారు. సీఎం ఆదేశాలతో ఏపీ భవన్ అధికారులు ఈ వ్యవహారాన్ని ప్రత్యేకంగా పర్యవేక్షిస్తూ ఒమన్ ప్రభుత్వం, భారత ఎంబసీతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారు. సురేష్ ప్రయాణిస్తున్న నౌక ప్రస్తుతం ఒమన్ తీరానికి 30 నాటికల్ మైళ్ల దూరంలో నిలిచిపోయినట్లు సమాచారం. ఒమన్ అధికారులు నౌకను పోర్టుకు తరలించే పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ అర్ధరాత్రికి నౌక ఒడ్డుకు చేరుకునే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. పోర్టుకు చేరిన తర్వాత మృతదేహాన్ని అధికారికంగా గుర్తించి, భారత్‌కు తరలించే ప్రక్రియను ప్రారంభిస్తారు. బాధితుడి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని సీఎం చంద్రబాబు భరోసా ఇచ్చారు.

## 'అఖండ' కాంగ్రెస్ దిశగా అడుగులు?
# ఆ పార్టీలు విలీనం కానున్నాయా?



ఈ ప్రశ్నలే ప్రస్తుతం జాతీయ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్‌లో నెలకొన్న అంతర్గత సంక్షోభం, ఇటీవల జరిగిన వరుస రాజకీయ భేటీల నేపథ్యంలో ఈ ఊహాగానాలు మరింత ఊపందుకున్నాయి. ఈ అంశంపై ఎన్‌డీటీవీ తాజాగా ఓ ఆసక్తికర కథనాన్ని ప్రచురించింది. తృణమూల్ కాంగ్రెస్ తమ పార్టీలో విలీనం కానుందనే ప్రచారాన్ని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఇప్పటికే ఖండించినప్పటికీ మహారాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నేత నానా పటోలే చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో కొత్త చర్చకు దారితీశాయి. కాంగ్రెస్ భావజాలానికి దగ్గరగా ఉన్న పార్టీలు మళ్లీ ఒక్కటయ్యే దిశగా ఆలోచిస్తున్నాయని, శరద్ పవార్, మమతా బెనర్జీ కూడా ఆ దిశగా అడుగులు వేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఇది కేవలం పొత్తు కాదని, విలీనం స్థాయిలో చర్చలు జరుగుతున్నాయని చెప్పడం మరింత ఆసక్తిని రేకెత్తించింది. ఇటీవల శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్ కూడా కాంగ్రెస్ నుంచి విడిపోయిన చిన్న పార్టీలన్నీ తిరిగి కాంగ్రెస్‌లో కలవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ కూడా ఇదే తరహా వ్యాఖ్యలు చేశారు. ప్రాంతీయ పార్టీలన్నీ తిరిగి కాంగ్రెస్‌లో చేరి రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలపర్చాలని సూచించారు. అయితే ఈ వ్యాఖ్యలను ఆయా పార్టీలు అధికారికంగా సమర్థించలేదు. శరద్ పవార్ కుమార్తె సుప్రియా సూలే మాత్రం "సమయం వచ్చినప్పుడు చూద్దాం" అని అన్నారు. ఈ ఊహాగానాలకు ప్రధాన కారణం ఇటీవల ఢిల్లీలో జరిగిన రాజకీయ భేటీలే. ఇండియా కూటమి సమావేశం సందర్భంగా మమతా బెనర్జీ, అభిషేక్ బెనర్జీలు వరుసగా సోనియా, రాహుల్ గాంధీతో సమావేశమయ్యారు. ముఖ్యంగా అభిషేక్-రాహుల్ సమావేశం గంటన్నరపాటు సాగడం రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే కాంగ్రెస్ వర్గాలు మాత్రం విలీనం అంశంపై తమ నుంచి ఎలాంటి ప్రయత్నాలు లేవని, అలాంటి ప్రతిపాదన వస్తే అది తృణమూల్ కాంగ్రెస్ నుంచే రావాల్సి ఉంటుందని స్పష్టం చేస్తున్నాయి. దీంతో విలీనం చర్చలు వాస్తవ రూపం దాలుస్తాయా? లేక రాజకీయ ఊహాగానాలుగానే మిగిలిపోతాయా? అన్నది రానున్న రోజుల్లో తేలనుంది.

## ఈ నెల 14న కొమ్మల దేవస్థానం, విష్ణు ప్రియ గార్డెన్ లో వైభవంగా మహా చండీయాగం.





ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రతినిధి,జూన్(లోకల్ గైడ్ న్యూస్):లోక కళ్యాణార్థం వరంగల్ జిల్లా గీసుగొండ మండలం కొమ్మాల గ్రామం లోని విష్ణుప్రియ గార్డెన్స్ (కొమ్మాల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం దగ్గర) లో ఈ నెల 14వ తేదీ ఆదివారం ఉదయం 8:00 గంటల నుంచి "మహా చండీయాగం" వైభవంగా నిర్వహించనున్నట్లు సంస్కృతి ఫౌండేషన్ (ట్రస్ట్) నిర్వాహకులు కక్కెర్ల శ్రీనివాస్ (రాజు), నన్నెం రాజ్య లక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు.స్వస్తిశ్రీ పరాభవ నామ సంవత్సరం అధిక జ్యేష్ఠ అమావాస్య (తిథి ద్వయం) పురస్కరించుకొని వేదమూర్తులైన బ్రహ్మణోత్తములచే అంగరంగ వైభవంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.ప్రత్యేక రక్షా కంకణాల పంపిణీ?ఈ యాగానికి విచ్చేసే భక్తుల వివిధ సమస్యల నివారణార్థం శక్తి సమన్వితమైన, మంత్రపూరితమైన ప్రత్యేక రాగి కంకణాలను యాగ వేదిక వద్ద పంపిణీ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.విద్యా ప్రాప్తి కొరకు, సరస్వతి కంకణాలు.ఉద్యోగ ప్రాప్తి కొరకు, రాజశ్యామల కంకణాలు.వివాహ ప్రాప్తి కొరకు, వివాహ కంకణాలు.ఆరోగ్య సిద్ధి కొరకు, మృత్యుంజయ కంకణాలు.ఆర్థిక, వ్యాపార అభివృద్ధి కొరకు,కుబేర కంకణాలు.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలి. ?అధిక మాసంలో చేసే పూజ, జపం, హోమం, దానం వల్ల అధిక పుణ్యఫలం లభిస్తుందని, కావున భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ హోమంలో పాల్గొనదలచే దంపతులు మరిన్ని వివరాల కోసం 9652185325, 9849378581 మొబైల్ నంబర్లలో సంప్రదించాలని సంస్కృతి ఫౌండేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.

## సమన్వయంతో రహదారి విస్తరణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

**కడిపికొండ--బొడ్రాయి రహదారి అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరేడ్డి**



హనుమకొండ జిల్లా ప్రతినిధి,జూన్(లోకల్ గైడ్ న్యూస్):హన్మకొండ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు చేపడుతున్న రహదారి విస్తరణ, అభివృద్ధి పనులను సమన్వయంతో, నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా వేగవంతంగా పూర్తి చేయాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అధికారులను ఆదేశించారు.హనుమకొండ జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్‌పాయ్, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరేడ్డిలతో కలిసి ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు కడిపికొండ నుంచి బొడ్రాయి వరకు ఆర్ అండ్ బి ఆధ్వర్యంలో 1.6 కిలోమీటర్ల మేర చేపడుతున్న రహదారి విస్తరణ, అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా రహదారి విస్తరణ, డ్రైనేజీ నిర్మాణం, యుటిలిటీల మార్పిడి, ఇతర అనుబంధ అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. పనులు నిర్దేశిత గడువులోగా పూర్తయ్యేలా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలని, నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు.రోడ్డు విస్తరణకు అనుగుణంగా వర్షపు నీరు నిల్వ కాకుండా రహదారి ఇరువైపులా అవసరమైన డ్రైనేజీ వ్యవస్థను శాస్త్రీయ పద్ధతిలో ఏర్పాటు చేయాలని జీడబ్ల్యూఎంసీ అధికారులకు సూచించారు. పనుల నిర్వహణలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని, ట్రాఫిక్‌కు ఆటంకం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.అభివృద్ధి పనుల అమలులో సంబంధిత శాఖల మధ్య సమన్వయం పెంపొందించి, ప్రజల అవసరాలకు అనుగుణంగా పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సురేష్, జీడబ్ల్యూఎంసీ సిటీ ప్లానర్ రవీంద్ర వాడేకర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవికుమార్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## జీవో నంబర్ 15 ను ఎత్తేసి చేనేత కార్మికుల హక్కుల ను పరిరక్షించాలి..

బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం డిమాండ్




హనుమకొండ జిల్లా ప్రతినిధి,జూన్(లోకల్ గైడ్ న్యూస్):గత పది రోజులుగా వరంగల్ జిల్లా కేంద్రంలో గల కొత్తవాడ గోపాలస్వామి గుడి వద్ద చేనేత కార్మికులు శాంతియుతంగా నిరసన దీక్ష చేస్తున్నారు. ప్రధానంగా పదేళ్ల క్రితం నుండి ప్రభుత్వం ౹వం౹షీ ద్వారా చేనేత ఉత్పత్తులు బెడ్ షీట్లు, కార్పెట్లు, టవల్స్ మొదలైనవన్నీ కొని ప్రభుత్వ ఆసుపత్రులు, కారాగారాలు, హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలలకు అందించేవారు. దానికి జీ వో నంబర్ 1 అనుమతించేది అలాగే ఇంతకాలం కొనసాగింది. ఇటీవల ప్రభుత్వం దానికి వ్యతిరేకంగా జీవో నంబర్ 15 తీసుకొచ్చి ౹వం౹షీ ద్వారా కాకుండా బహిరంగ టెండర్ ద్వారా తీసుకోవాలని నిర్ణయించింది. అందువల్ల రెండు నెలల నుంచి మొగ్గాల ద్వారా ఉత్పత్తి అయిన వస్త్రాలు కొనక పోవడం వల్ల అవి మూత పడ్డాయి. ఫలితంగా చేనేత కార్మికులు రోడ్డున పడ్డారు. అడుక్కు తినే పరిస్థితి ఉత్పన్నం అయింది. కాబట్టి బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం డిమాండ్ చేసేదేమిటంటే తక్షణమే జి వో నంబర్ 15 రద్దుచేసి పాత పద్ధతి ద్వారా అంటే టెస్కో ద్వారా నే చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేసి చేనేత కార్మికుల ను ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం. అది కూడా ఈ నెల 14 లోపు జరుగకుంటే 15 నాడు హైదరాబాద్ లో గల రాష్ట్ర ౹వం౹షీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరిస్తున్నారు . ప్రభుత్వంలో చలనం లేకుంటే దీనిని రాష్ట్ర వ్యాప్త ఉద్యమంగా విస్తరింప చేసి ప్రభుత్వాన్ని స్తంభింప చేస్తామని బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం చైర్మన్ టీ చిరంజీవులు హెచ్చ రించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా చీఫ్ కో ఆర్డినేటర్ డాక్టర్ కె వీరస్వామి, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కూరపాటి రమేష్, చేనేత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రమాద వెంకన్న, రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు డాక్టర్ కొణతం కృష్ణ, డాక్టర్ అవ్వార్ వేణు, చెన్న శ్రీకాంత్, జిల్లా ముఖ్య నాయకులు రాజగోవిందు, డాక్టర్ సూర్య కిరణ్, డాక్టర్ ఏం జనార్ధన్, తుమ్మ తిరుపతి, కందకట్ల సురేష్, వద్నాల నరేందర్, డి సూర్యనారాయణ మూర్తి, ప్రొఫెసర్ మురళీమనోహర్, టి పి సి సి చేనేత విభాగం అధ్యక్షులు చిప్ప వెంకటేశ్వర్లు మొదలగు వారు హాజరై ప్రసంగించినారు. దాదాపు 600మంది చేనేత కార్మికులు ఈ శాంతియుత నిరసనలో పాల్గొన్నారు.డాక్టర్ కె వీరస్వామి చీఫ్ కో - ఆర్డినేటర్ బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటి తెలియజేశారు.




# ఓరుగల్లు గడ్డపై క్రీడా విప్లవం, వరంగల్ వారియర్స్ రోడ్ మ్యాప్ ఆవిష్కరణ

## ఘనంగా 'మీట్ యువర్ వరంగల్ వారియర్స్' వేడుక



హనుమకొండ జిల్లా ప్రతినిధి,జూన్(లోకల్ గైడ్ న్యూస్):వరంగల్, కాకతీయుల శిల్పకళా వైభవానికి నిలయమైన ఓరుగల్లు గడ్డపై క్రీడా రంగంలో ఒక సరికొత్త చరిత్రకు అంకురార్పణ జరిగింది. 'టీజీ20 క్రికెట్ లీగ్'లో వరంగల్ కీర్తి పతాకం రెపరెపలాడటమే లక్ష్యంగా అడుగులు పడుతున్నాయి. బెయిన్ గ్లోబల్ రిసోర్సెస్ సారథ్యంలోని 'వరంగల్ వారియర్స్' ఫ్రాంచైజీ నగరంలోని కాళోజీ కళాక్షేత్రంలో 'మీట్ యువర్ వరంగల్ వారియర్స్' నిర్వహించింది. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్సీఏ) ఆధ్వర్యంలో ఈ 'టీజీ20 క్రికెట్ లీగ్' జరగనుంది. ఈ వేదికపై నగర క్రీడా ప్రతిభను జాతీయ స్థాయికి తీసుకెళ్లే ఒక రోడ్‌మ్యాప్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి; 'వరంగల్ వారియర్స్' సహ-యజమానులు వరుణ్ జూపల్లి, శ్రీ ఫణి చిట్నేని, ధీరజ్ ఇందురు హాజరయ్యారు. భారత స్టార్ క్రికెటర్ మహ్మద్ సిరాజ్‌ను ఈ టీమ్ దక్కించుకుంది. ఈ సందర్భంగా వరంగల్ వారియర్స్ సహ యజమాని వరుణ్ జూపల్లి మాట్లాడుతూ ఈ ఫ్రాంచైజీ కేవలం లీగ్‌లో గెలవడమే కాకుండా, తెలంగాణ యువతను అంతర్జాతీయ స్థాయి ఆటగాళ్లుగా తీర్చిదిద్దడం లక్ష్యమన్నారు. 'టీజీ20 క్రికెట్ లీగ్'లోని ఎనిమిది ఫ్రాంచైజీలలో ముఖచిత్రంపై వరంగల్‌ను నిలబెట్టడమే కాకుండా, ఈ లీగ్‌లో తాము ఒక బలమైన శక్తిగా అవతరించ నున్నామని చెప్పారు. పోటీలలో గెలవడం తమ ఏకైక లక్ష్యం కాదన్నారు. క్షేత్ర స్థాయిలో ప్రతిభను వెలికితీయడం, ప్రాంతీయ క్రీడా మౌలిక సదుపాయాలు కల్పించడం, లోపాలను పూడ్చడం తమ అజెండా అన్నారు. ఇదొకటన్నారు. మహ్మద్ సిరాజ్ రాకతో జాతీయ క్రికెట్ 'తెలంగాణలోని యువ ప్రతిభను గుర్తించి, వారికి తగిన మార్గదర్శకత్వం అందిస్తూ, క్షేత్రస్థాయి క్రికెట్ నుంచి అత్యున్నత స్థాయి క్రికెట్ వరకు ఒక స్పష్టమైన మార్గాన్ని నిర్మించడం. తద్వారా భవిష్యత్తులో ఐపీఎల్ (ఐపీఎల్), భారత జట్టుకు ఆడే ఆటగాళ్లను తయారు చేయడమే అంతిమ లక్ష్యం. దీనిని సాధించడానికి అవసరమైన కార్యాచరణ ప్రణాళికను త్వరలోనే వెల్లడించనున్నాం. స్థానిక అథ్లెట్లకు దేశంలో అత్యుత్తమ సదుపాయాలతో పోటీపడే అవకాశాలు కల్పించేందుకు వరంగల్‌లో ప్రపంచ స్థాయి క్రీడా సౌకర్యాలు, శిక్షణా వ్యవస్థల కోసం పెట్టుబడులు పెట్టడం. ఇక ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న టీజీ20 లీగ్ సీజన్ కంటే ముందే.. మార్క్యూ ప్లేయర్ మహ్మద్ సిరాజ్ నాయకత్వంలో అమన్ రావు పేరాల, ఇతర ప్రతిభావంతులైన క్రికెటర్లతో కూడిన జట్టు వ్యూహాత్మక విధానాన్ని ప్రదర్శించడం అన్నారు. వరంగల్ వారియర్స్ ఆవిర్భావం ఈ నగరం క్రీడా ప్రయాణంలో ఒక మైలురాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో వరంగల్, తెలంగాణకు చెందిన ఎంతో మంది యువ అథ్లెట్లు పెద్ద కలలు కనేలా, మరింత పట్టుదలగా పోటీపడేలా, ఒకరోజు గర్వంగా భారత జెర్సీని ధరించేలా వారిని ప్రేరేపించడానికి, అండగా నిలవడానికి ప్రపంచ స్థాయి క్రీడా మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని ఆశిస్తున్నామని తెలిపారు. ఇది ఒక క్రికెట్ జట్టుగా మాత్రమే కాకుండా.. ప్రతిభను పెంపొందించడానికి, కలలను ప్రేరేపించడానికి, యువతకు శాశ్వత అవకాశాలు సృష్టించడానికి కట్టుబడి ఉన్నామన్నారు. భవిష్యత్తు తరాలు గర్వించదగిన క్రీడా వారసత్వాన్ని అందించేందుకు తమతో చేతులు కలపాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సహ యజమానులు ఫణి చిట్నేని, ధీరజ్ ఇందూరు పాల్గొన్నారు.మరింత సమాచారానికి సంప్రదించండి : 9959154371 / 9985310069



## ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

**పరకాల ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్**



హనుమకొండ జిల్లా ప్రతినిధి,జూన్(లోకల్ గైడ్ న్యూస్):ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ వైద్యులు, సిబ్బందిని ఆదేశించారు.పరకాల పట్టణంలోని సమగ్ర అత్యవసర ప్రసూతి-శిశు ఆరోగ్య కేంద్రం (ఏరియా ఆసుపత్రి) జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.తనిఖీలో భాగంగా ముందుగా ఓపీ నమోదును పరిశీలించి, రోగుల వివరాలను ఎలా నమోదు చేస్తున్నారనే విషయాన్ని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మెడికల్ ఆఫీసర్ గది, ఇన్‌పేషెంట్ వార్డులను సందర్శించి చికిత్స పొందుతున్న రోగులు, వారి సహాయకులతో మాట్లాడారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. వార్డుల్లోని ప్రతి రోగి వద్దకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని, అందుతున్న చికిత్సపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.మాతా-శిశు వార్డును సందర్శించిన కలెక్టర్ అక్కడ ప్రసూతులు, శిశువులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. ఆసుపత్రిలో రోగులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నారా, ఇతర సౌకర్యాలు ఎలా ఉన్నాయనే విషయాలను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గౌతమ్ చౌహాన్, వైద్యులను అడిగి తెలుసుకున్నారు. డెలివరీల సంఖ్యలో వ్యత్యాసాలు ఉండటంపై ఆరా తీశారు.ఆసుపత్రి వంటశాలను సందర్శించి రోగుల కోసం సిద్ధం చేసిన ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. అనంతరం ఐసీటీసీ, ఎక్స్‌రే విభాగం, ప్రయోగశాల (ల్యాబ్), బ్లడ్ బ్యాంక్‌ను సందర్శించి అక్కడి సేవలపై సమీక్ష నిర్వహించారు.వైద్యులు, సిబ్బంది హాజరు రికార్డులు, ఆసుపత్రి నిర్వహణకు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించిన కలెక్టర్, రికార్డుల నిర్వహణ సంతృప్తికరంగా లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆధార్ ఆధారిత హాజరు నమోదును, మాన్యువల్ అటెండెన్స్ రిజిస్టర్లను కూడా పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. వైద్య సేవల కోసం ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించకుండా పారదర్శకంగా నిర్వహించాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పరకాల మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్, కౌన్సిలర్లు కొయ్యడ శ్రీనివాస్, బండి శ్రీధర్, పరకాల ఆర్డీవో డి.ఎస్. వెంకన్న, మున్సిపల్ కమిషనర్ పోతరాజు పవన్, నాయబ్ తహసీల్దార్ సుమన్ తదితరులు పాల్గొన్నారు.



## మీసేవ సేవల అమలులో పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలి

ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ సైదేశ్వరరావు



కొత్తగూడెం : లోకల్ గైడ్ :ప్రజలకు మీసేవ ద్వారా అందిస్తున్న సేవలను మరింత పారదర్శకంగా, వేగవంతంగా అందించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న డిజిటల్ విధానాలను సమర్థవంతంగా వినియోగించాలని ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ సైదేశ్వరరావు సూచించారు. శుక్రవారం కొత్తగూడెం తహసీల్దార్ పుల్లయ్య ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో జీపీఓలు, ఆర్ఐలు, మీసేవ వీఎల్ఈలు, సెక్షన్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సైదేశ్వరరావు మాట్లాడుతూ ఆదాయ, కుల, నివాస, కుటుంబ సభ్యుల ధృవపత్రాలు, ఈబీసీ, ఓబీసీ తదితర సేవలకు సంబంధించిన మీసేవ దరఖాస్తుల పరిశీలన పూర్తిగా ఆన్‌లైన్ విధానంలోనే నిర్వహించబడుతుందని తెలిపారు. దరఖాస్తుదారులు సమర్పించిన డిజిటల్ పత్రాల ఆధారంగానే నిబంధనల మేరకు ఆమోదం లేదా తిరస్కరణ నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. భౌతిక పత్రాలను స్వీకరించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీపీవోఎస్ అండ్ ఎంఆర్ఐ వెరిఫికేషన్ మొబైల్ అప్లికేషన్ వినియోగంపై అధికారులకు ప్రత్యేక శిక్షణ అందించారు. ఈ యాప్ ద్వారా దరఖాస్తుల పరిశీలనను సులభతరం చేసి నిర్ణీత గడువులోగా పరిష్కరించవచ్చని వివరించారు. ప్రతి దరఖాస్తును నిష్పక్షపాతంగా పరిశీలించి సకాలంలో పరిష్కరించాలని సూచించారు. మీసేవ కేంద్రాల నిర్వాహకులు ప్రభుత్వం నిర్ణయించిన రుసుములను మాత్రమే వసూలు చేయాలని, అదనపు రుసుములు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దరఖాస్తుల నమోదు సమయంలో వివరాలను కచ్చితంగా నమోదు చేయడంతో పాటు డేటా ఎంట్రీలో పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడంలో అధికారులు, మీసేవ కేంద్రాల నిర్వాహకులు సమన్వయంతో పనిచేయాలని, సాంకేతిక లేదా పరిపాలనా సమస్యలు ఎదురైతే సంబంధిత తహసీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. ఈ సమావేశంలో జీపీఓలు, ఆర్ఐలు, మీసేవ వీఎల్ఈలు, సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా ప్రత్యేక సమావేశంలో పాల్గొన్న విజయ్ నాయుడు



చర్ల : లోకల్ గైడ్ :భద్రాచలంలోని హరిత హోటల్‌లో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమావేశం (ఎస్ఐఆర్)లో చర్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు విజయ్ నాయుడు పాల్గొన్నారు. చర్ల మండలంలోని 36 బూత్‌లకు చెందిన బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఓటర్ల జాబితాలో చోటుచేసుకునే అక్రమాలు, ఓటు చోరీకి దారితీసే అంశాలు, వాటిని గుర్తించి అడ్డుకునే విధానాలపై జిల్లా కాంగ్రెస్ నాయకులు బీఎల్ఏలకు అవగాహన కల్పించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటర్ల జాబితా ప్రాముఖ్యతను వివరిస్తూ, ప్రతి ఓటు విలువను కాపాడేందుకు అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు హాజరై బీఎల్ఏలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా విజయ్ నాయుడు మాట్లాడుతూ, ప్రతి అర్హుడైన ఓటరు పేరు ఓటర్ల జాబితాలో నమోదు అయ్యేలా చూడడం, అక్రమ తొలగింపులు జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించడం బీఎల్ఏల బాధ్యత అని అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో బీఎల్ఏల పాత్ర అత్యంత కీలకమని పేర్కొంటూ, ఓటు హక్కు రక్షణకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, బీఎల్ఏలు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## BRSఎమ్మెల్సీ తాతా మధుసూదన్



లోకల్ గైడ్' ఖమ్మం' నాయకత్వంలో ఖమ్మం పోలీస్ కమిషనర్‌ను కలిసిన బీఆర్ఎస్ జిల్లా పార్టీ బృందం:మైనర్ బాలికపై దారుణానికి ఒడిగట్టిన నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ఖమ్మం నగరంలో 12 ఏళ్ల మైనర్ బాలికపై జరిగిన అమానుష, ఘోరమైన ఘటనను భారత రాష్ట్ర సమితి ఖమ్మం జిల్లా పార్టీ తీవ్రంగా ఖండించింది. ఈ విషయమై బీఆర్ఎస్ మీాజ మరియు పార్టీ రాష్ట్ర కార్యదర్శి తాతా మధుసూదన్ నాయకత్వంలో పార్టీ ప్రతినిధుల బృందం శుక్రవారం ఖమ్మం జిల్లా పోలీస్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించింది. సభ్య సమాజాన్ని తీవ్రంగా కలచివేసిన ఈ ఘటనలో బాధిత బాలికకు తక్షణమే న్యాయం చేయాలని, నిందితుడిపై పోక్సో (౹ూజుూ) చట్టం కింద కఠిన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ బృందం డిమాండ్ చేసింది.రాష్ట్రవ్యాప్తంగా మహిళలు, బాలికలపై జరుగుతున్న అత్యాచారాల పట్ల ఈ సందర్భంగా వారు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.నిందితుడిపై పోక్సో చట్టంతో పాటు ఇతర సంబంధిత చట్టాల కింద అత్యంత కఠినమైన చర్యలు తీసుకోవాలని, బాధితురాలికి త్వరితగతిన న్యాయం జరిగేలా కేసును ఫాస్ట్-ట్రాక్ కోర్టు ద్వారా విచారించాలని, బాధిత బాలికకు ప్రభుత్వం తరపున అవసరమైన వైద్య, ఆర్థిక, మరియు కుటుంబంలో ఒకరికి ఉద్యోగ భద్రత తక్షణమే కల్పించాలని, భవిష్యత్తులో జిల్లాలో ఇలాంటి దారుణమైన ఘటనలు పునరావృతం కాకుండా మహిళలు, బాలికల రక్షణ కోసం గట్టి నిఘా, పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని, పాఠశాలలు, హాస్టళ్లు, అపార్ట్‌మెంట్‌లు మరియు ఇతర ప్రాంతాలలో బాలికల మరియు మహిళల భద్రతకు సంబంధించి ప్రత్యేక నిఘా ఉంచాలని, పోక్సో చట్టంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించి, బాలల రక్షణకు కట్టుదిట్టమైన చర్యలు అమలు చేయాలని కోరారు.నేరస్థులు ఏ స్థాయిలో ఉన్నా వదలకుండా, చట్ట ప్రకారం కఠినంగా శిక్షించడం ద్వారానే సమాజంలో నేరగాళ్లకు గట్టి హెచ్చరిక పంపినట్లవుతుందని బీఆర్ఎస్ బృందం స్పష్టం చేసింది.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ తో పాటు మాజీ బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు బెల్లం వేణుగోపాల్, ఉన్నం బ్రహ్మయ్య, భాషబోయిన వీరన్న, నాయకులు రెంటాల ఆనంద్, దర్గయ్య, బలుసు మురళీకృష్ణ, లింగనబోయిన సతీష్, మహమ్మద్ రఫీ, పగడాల నరేందర్, యలమద్ది రవి, గవర్రాజు శంకర్ రాజు, పటేటి సాయి, పోలూరి రామ్, మరియు ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# నర్సింగ్ కాలేజ్ ను సందర్శించిన కలెక్టర్

**విద్యార్థినుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని నిర్వాహకులకు ఆదేశం**



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్ ), జూన్ 12 : నిజామాబాదు జిల్లా మాక్లూర్ మండల కేంద్రంలో కొనసాగుతున్న ప్రభుత్వ నర్సింగ్ కాలేజ్ ను కలెక్టర్ ఇలా త్రిపాఠి శుక్రవారం సందర్శించారు. కాలేజీ ఆవరణను పరిశీలించిన సందర్భంగా ప్రహరీ లేకపోవడాన్ని గమనించిన కలెక్టర్, వెంటనే ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థినుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, నర్సింగ్ కాలేజీ వద్ద, పరిసర ప్రాంతాలలో పోలీసులు పెట్రోలింగ్ చేసేలా చూడాలని అన్నారు. తుది దశలో కొనసాగుతున్న నిర్మాణ పనుల నాణ్యతను తనిఖీ చేసి, వివరాలను అడిగి తెలుసుకున్నారు. యుద్ధప్రాతిపదికన పనులను పూర్తి చేయించాలని, విద్యార్థినులకు అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. తరగతి గదులను సందర్శించి విద్యార్థినులతో భేటీ అయ్యారు. విద్యార్థినులకు పలు ప్రశ్నలు వేస్తూ వారి అభ్యాసన సామర్థ్యాన్ని అంచనా వేశారు. తన వెంట తెచ్చిన డైరీలు, చాక్లెట్లు, బహుమతులను అందించారు. నర్సింగ్ కోర్సు ఎంతో డిమాండ్ కలిగిన చక్కటి కోర్సు అని, ఏకాగ్రతతో ఇష్టంగా చదువుకోవాలని హితవు పలికారు. కరోనా సమయంలో పారా మెడికల్ సిబ్బంది అందించిన సేవలు ఎంతో గొప్పవని కొనియాడారు. సేవా భావంతో కూడిన నర్సింగ్ కోర్సు వల్ల ఉద్యోగ అవకాశాలతో పాటు ఆకర్షణీయమైన వేతనాలతో విరివిగా ఉపాధికి లభించేందుకు ఆస్కారం ఉంటుందని అన్నారు. స్మార్ట్ ఫోన్, సోషల్ మీడియా వంటికి ఒకింత దూరంగా ఉండాలని, ఉన్నత భవిష్యత్తు కోసం ప్రణాళికతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా, వారి కలలను నిజం చేయాలని, అధ్యాపకులకు మంచి పేరు తేవాలని హితవు పలికారు. కాగా, వ్యక్తిగత భద్రత విషయంలో ఏమరుపాటుగా ఉండకుండా అనుక్షణం అప్రమత్తంగా వ్యవహరించాలని విద్యార్థినులకు జాగ్రత్తలు సూచించారు. ఏవైనా ఇబ్బందులు ఎదురైతే ధైర్యంగా అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఏవైనా అనుకోని ఘటనలు జరిగితే సఖీ వన్ స్టాప్ సెంటర్ ను సంప్రదిస్తే, వారు అన్ని విధాలుగా వెన్నుదన్నుగా నిలుస్తూ న్యాయం జరిగేలా కృషి చేస్తారని, మీ వ్యక్తిగత గుర్తింపు బయటపడకుండా గోప్యత పాటిస్తారని కలెక్టర్ తెలిపారు. బాలికల రక్షణకు, వారి ఆరోగ్యాల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, బయటి వ్యక్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ లోనికి అనుమతించకూడదని, బంధువులు అయినా సరే లోనికి రాకుండా చూడాలని నిర్వాహకులను, సిబ్బందిని ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిని ఎంతమాత్రం ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. కలెక్టర్ వెంట స్థానిక తహసీల్దార్ శేఖర్, నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ భూలక్ష్మి తదితరులు ఉన్నారు.



# నైపుణ్యాభివృద్ధిపై గీతం విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ

**జూన్-2026 సెషన్ సిరీస్' ద్వారా కెరీర్, ఉన్నత విద్యపై అవగాహన**




పఠాన్ చేరు, జూన్ 12:(లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): విద్యార్థుల లో నైపుణ్యాభివృద్ధి, కెరీర్ ప్రణాళిక, పరిశ్రమలకు సంసిద్ధత, ప్రపంచ ఉన్నత విద్యావకాశాలపై అవగాహన పెంపొందించేందుకు గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం 'జూన్-2026 సెషన్ సిరీస్' పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ (జీసీజీసీ)లోని శిక్షణ, మార్గదర్శకత్వం, వృత్తిపరమైన సలహాల (టీఎంసీజీ) డైరెక్టర్ డాక్టర్ రోజీనా మాథ్యూ తెలిపారు. విజయవంతమైన పూర్వ విద్యార్థులు, పరిశ్రమ నిపుణులు, పరిశోధకులతో విద్యార్థులను అనుసంధానిస్తూ ఆచరణాత్మక జ్ఞానం అందించడమే ఈ కార్యక్రమం లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. విదేశాలలో ఉన్నత విద్య, కృత్రిమ మేధస్సు (ఏఐ), ప్రొడక్ట్ మేనేజ్‌మెంట్, డేటా అనలిటిక్స్ వంటి భవిష్యత్ అవకాశాలపై విద్యార్థులకు మార్గదర్శనం అందించనున్నట్లు తెలిపారు. ఏఐ, డేటా అనలిటిక్స్, విదేశీ విద్యపై నిపుణుల మార్గదర్శనం ఈ సిరీస్‌లో భాగంగా యూనివర్సిటీ ఆఫ్ సిన్సినాటి మాస్టర్స్ విద్యార్థిని శ్రీజ నల్లమోతు, యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్ ఎట్ డల్లాస్ పట్టభద్రుడు హార్దిక్ మల్లిచెట్టి, గ్లోబల్ డేటా పీఎల్సీ ప్రొడక్ట్ అనలిస్ట్ వంశిక సాయి బొత్స, యూనివర్సిటీ ఆఫ్ హ్యూస్టన్ రీసెర్చ్ అసిస్టెంట్ ఆకాంక్ష గోవిందరాజు, ఎంఎస్డీ డేటా సైన్స్ మేనేజర్ సమీక్ష నిమ్జే, నార్త్ కరోలినా స్టేట్ యూనివర్సిటీ విద్యార్థిని ఎన్. శ్రేయారెడ్డి, పోలాండ్‌లోని కోజ్మిన్స్కి విశ్వవిద్యాలయం విద్యార్థి సాయిరామ్ నాగేష్ వివిధ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించనున్నారు. విద్యార్థులు పరిశ్రమల్లో వస్తున్న మార్పులను అర్థం చేసుకోవడం, ప్రపంచవ్యాప్త విద్యావకాశాలను అన్వేషించడం, విదేశాలలో చదువుతున్న, పనిచేస్తున్న పూర్వ విద్యార్థుల అనుభవాల ను తెలుసుకోవడం, భవిష్యత్ ఉద్యోగ అవకాశాలకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని డాక్టర్ రోజీనా మాథ్యూ తెలిపారు. విద్యార్థులు ప్రతి సెషన్‌లో చురుకుగా పాల్గొని వక్తలతో పరస్పర చర్చలు జరపాలని, తమ విద్యా, వృత్తి జీవితాలకు సంబంధించి సరైన నిర్ణయాలు తీసుకోవాలని ఆమె సూచించారు. ఇప్పటివరకు టీఎంసీజీ ఆధ్వర్యంలో 149 నైపుణ్యాభివృద్ధి సెషన్లు విజయవంతంగా నిర్వహించి వందలాది మంది విద్యార్థులకు మార్గదర్శనం అందించినట్లు ఆమె వెల్లడించారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ

**-విద్యార్థుల విద్యాభివృద్ధికి అవసరమైన అన్ని సహకారాలు అందిస్తాం..కొమిరిశెట్టి సాయిబాబా**

**-గచ్చిబౌలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా టెక్స్ట్ బుక్‌ల పంపిణీ**



శేరిలింగంపల్లి, జూన్ 12 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): శేరిలింగంపల్లి నియోజకవర్గం లోని గచ్చిబౌలి డివిజన్ మధురా నగర్ కాలనీలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం, రెండవ సంవత్సరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శేరిలింగంపల్లి సీనియర్ నాయకులు, గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా హాజరై విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ..విద్యార్థుల భవిష్యత్తుకు విద్యే బలమైన పునాది అని పేర్కొన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి అవసరమైన అన్ని రకాల సహకారాలను అందించేందుకు తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని హామీ ఇచ్చారు. పాఠ్యపుస్తకాలు సమయానికి అందడం వల్ల విద్యార్థులు విద్యా సంవత్సరాన్ని ప్రణాళికాబద్ధంగా ప్రారంభించే అవకాశం లభిస్తుందని ఆయన అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల ప్రధానాచార్యులు శ్రీనివాసులు, సభాధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, విద్యా కమిటీ అధ్యక్షులు కృష్ణ గౌడ్, ప్రవీణ్ ముదిరాజ్, రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. విద్యార్థులకు అవసరమైన విద్యా వనరులను అందిస్తూ వారి ఉన్నత విద్యాభ్యాసానికి బాటలు వేయడం అభినందనీయమని పలువురు అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ విద్యా సంస్థల బలోపేతానికి ప్రజాప్రతినిధులు, సామాజిక నాయకులు, విద్యా కమిటీలు సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని కార్యక్రమంలో పలువురు పేర్కొన్నారు. విద్యార్థులలో చదువుపై మరింత ఆసక్తి పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయ ని వారు అన్నారు.

# "సాగునీరు, వైద్య సేవలపై భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్ ప్రత్యేక దృష్టి"

**తాలిపేరు ఎడమ కాలువలో నీటి ప్రవాహానికి అడ్డంకులు తొలగించాలి**

**ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి -- జిల్లా కలెక్టర్ అంకిత్**



భద్రాద్రి జిల్లా, దుమ్ముగూడెం : లోకల్ గైడ్ :దుమ్ముగూడెం మండలంలో జిల్లా కలెక్టర్ అంకిత్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పర్యటించి తాలిపేరు ప్రాజెక్టు ఎడమ కాలువతో పాటు దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. సాగునీటి సరఫరా, వైద్య సేవల నిర్వహణపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. మొదటగా వీరభద్రపురం గ్రామ పరిధిలోని తాలిపేరు ప్రాజెక్టు ఎడమ కాలువను పరిశీలించిన కలెక్టర్, కాలువ పరిస్థితులు, నీటి ప్రవాహం, ఆయకట్టు వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. తాలిపేరు ప్రాజెక్టు ద్వారా సుమారు 24,700 ఎకరాలకు సాగునీరు అందుతుండగా, ఎడమ కాలువ 46.46 కిలోమీటర్ల పొడవుతో 34 డిస్ట్రిబ్యూటరీల ద్వారా 21,100 ఎకరాల ఆయకట్టుకు నీటిని సరఫరా చేస్తున్నట్లు అధికారులు వివరించారు. కాలువలో పెరిగిన గడ్డి, చెత్త, పూడికను వెంటనే తొలగించి నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. రైతులకు సాగునీరు సకాలంలో అందేలా కాలువల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఆయకట్టు చివరి భూముల వరకు నీరు చేరేలా పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. అనంతరం దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, ఆరోగ్య కేంద్రంలోని వివిధ విభాగాలను పరిశీలించి వైద్య సేవల నిర్వహణపై సమగ్రంగా ఆరా తీశారు. ఇన్‌పేషెంట్ వార్డును సందర్శించి చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు, సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది హాజరు వివరాలు, సేవల నిర్వహణను పరిశీలించారు. ఫిజికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కోసం వచ్చిన విద్యార్థులతో మాట్లాడి వారి వివరాలను తెలుసుకున్న కలెక్టర్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీ విధానంపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఔషధ నిల్వల గదిని పరిశీలించి మందుల నిల్వలు, అందుబాటులో ఉన్న స్టాక్ వివరాలను తనిఖీ చేశారు. అలాగే ఇన్‌పేషెంట్, ఔట్‌పేషెంట్ రిజిస్టర్లు, ఇతర వైద్య రికార్డులను పరిశీలించారు. పాముకాటు, తేలు కాటుకు గురైన రోగులకు అవసరమయ్యే అత్యవసర మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పాముకాటుకు గురైన వ్యక్తికి అందించే చికిత్స విధానం, అనుసరించే వైద్య ప్రోటోకాల్‌పై వైద్యులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ రైతులకు సాగునీరు సకాలంలో అందించేందుకు కాలువల నిర్వహణను సమర్థవంతంగా చేపట్టాలని, అలాగే ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన, సత్వర వైద్య సేవలు అందేలా వైద్య సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట తహసీల్దార్ అశోక్ కుమార్, ఇరిగేషన్ ఈఈ జానీ, డాక్టర్ రుక్మాకర్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం ఎంపీడీవో ఆఫీస్ ముందు ఉపాధి కూలీల ధర్నా




ఇబ్రహీంపట్నం జూన్ 12 (లోకల్ గైడ్ ) ఉపాధి హామీ పనిలో రెండుసార్లు ఫోటో తీసే విధానం రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు కాకి రమేష్, చాతాళ్ల జంగయ్య డిమాండ్ చేశారు. ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం ఇబ్రహీంపట్నం ఎంపీడీవో ఆఫీస్ ముందు ధర్నా చేసి అనంతరం సూపర్ డెంట్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు కాకి రమేష్, చాతాళ్ల జంగయ్య మాట్లాడుతూ ఉపాధి హామీలో పనిచేస్తున్న కూలీలకు ప్రతిరోజు రెండుసార్లు ఫోటో తీయడం ద్వారా సిగ్నల్ రాకపోవడంతో కూలీలు ఇబ్బంది పడుతున్నారు. పనిచేసిన కూలీలకు వారం వారం డబ్బులు చెల్లించాలి. జి.రామ్. జీ చట్టాన్ని రద్దు చేసి మహాత్మ గాంధీ పేరుతో ఉన్న ఉపాధి చట్టాన్ని కొనసాగించాలి. పని ప్రదేశంలో నీళ్లు, నీడ కల్పించాలి. పెండింగ్ లో ఉన్న మూడు వారాల డబ్బులు వెంటనే చెల్లించాలి. ఎండలు తీవ్రంగా ఉన్నందున ఉదయం పూట మాత్రమే పనులు చేయించాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనం 26,000 రూ. జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్లు లేని గ్రామాల్లో సీనియర్ మేట్లను ఎఫ్.ఏ లుగా నియమించాలన్నారు. పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలి. పెరిగిన ధరలకు అనుగుణంగా ఉపాధి కూలీలకు కూలీ రేటు 800 రూ. పెంచాలని డిమాండ్ చేశారు. ఉపాధి ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని ఈ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు సామెల్, వ్యవసాయ కార్మిక సంఘం మండల ఉపాధ్యక్షులు మేడిబాయ్ ఆనంద్, మండల సహాయ కార్యదర్శి దయ్యాల గణేష్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బుగ్గరాములు, సీఐటీయూ జిల్లా నాయకులు తులసిగారి నర్సింహ, నాయకులు బండి సత్తన్న, యాదగిరి, చెరుకూరి నర్సింహ తదితరులు పాల్గొన్నారు.




# ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బాలల హక్కుల పరిరక్షణకు పిలుపు



శేరిలింగంపల్లి, జూన్ 12 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బాలల హక్కుల పరిరక్షణ, విద్యాభివృద్ధి, సంక్షేమంపై సమాజం మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కాంగ్రెస్ పార్టీ యూత్ ఐకాన్ మిరియాల ప్రీతం పిలుపునిచ్చారు. చిన్నారులు దేశ భవిష్యత్తుకు బలమైన పునాదులని, వారిని బాల కార్మికులుగా మార్చకుండా విద్యావంతులుగా తీర్చిదిద్దడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బాల్య దశలో పిల్లలు పాఠశాలలలో విద్యను అభ్యసిస్తూ తమ ప్రతిభను పెంపొందించుకోవాల్సిన సమయంలో అనేక మంది చిన్నారులు వివిధ రంగాలలో కార్మికులుగా పనిచేయడం ఆందోళన కలిగించే విషయమన్నారు. పేదరికం, అవగాహన లోపం, కుటుంబ ఆర్థిక సమస్యలు, విద్య పట్ల నిర్లక్ష్యం వంటి కారణాల వల్ల బాల కార్మిక వ్యవస్థ ఇంకా పూర్తిగా నిర్మూలించబడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నారులు విద్యకు దూరమై తమ బాల్యాన్ని కోల్పోవడం సమాజానికి తీరని నష్టమని పేర్కొన్న ఆయన, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రభుత్వం అమలు చేస్తున్న చట్టాలు, సంక్షేమ పథకాలతో పాటు ప్రజల సహకారం కూడా ఎంతో అవసరమన్నారు. ప్రతి చిన్నారి పాఠశాలకు వెళ్లేలా చూడటం, వారి విద్యా హక్కులను కాపాడటం సమాజంలోని ప్రతి పౌరుడి బాధ్యత అని స్పష్టం చేశారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు, సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని మిరియాల ప్రీతం సూచించారు. బాల కార్మికులను గుర్తించిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించి, వారిని తిరిగి విద్యా వ్యవస్థలో చేర్చేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి చిన్నారి విద్య, ఆరోగ్యం, భద్రత, గౌరవప్రదమైన జీవనం పొందే హక్కు కలిగి ఉన్నాడని గుర్తు చేసిన ఆయన, బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించి ప్రతి చిన్నారి కలలను సాకారం చేసే సమాజ నిర్మాణానికి అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. "చిన్నారుల చేతులకు పొరలు కాదు.. పుస్తకాలు అందిద్దాం. వారి హక్కులను కాపాడి, విద్యా వెలుగులతో వారి భవిష్యత్తును నిర్మిద్దాం. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి అని కాంగ్రెస్ పార్టీ యూత్ ఐకాన్ మిరియాల ప్రీతం పేర్కొన్నారు.

# నానకరామ్‌గూడ లోధా బస్తీలో డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి జలమండలి డీజీఎంను కలిసిన..బాలకృష్ణ దేవరకొండ

**-వర్షాకాలానికి ముందే నాళాల పూడిక తొలగించి ప్రజలకు ఉపశమనం కల్పించాలని వినతి**




శేరిలింగంపల్లి, జూన్ 12 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): నానకరామ్‌గూడలోని లోధా బస్తీలో నెలకొన్న డ్రైనేజీ సమస్యల పరిష్కారం కోసం సామాజిక కార్యకర్త బాలకృష్ణ దేవరకొండ జలమండలి అధికారులను కలిసి వినతిపత్రం సమర్పించారు. బస్తీలో డ్రైనేజీ ఓవర్‌ఫ్లో కావడం, నాళాల్లో పూడిక పేరుకుపోవడం వల్ల స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో బాలకృష్ణ దేవరకొండ బుధవారం లోధా బస్తీలోని పలు గల్లీల్లో పర్యటించి స్థానిక ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. డ్రైనేజీ నీరు రోడ్లపైకి రావడం వల్ల దుర్వాసన వ్యాపించడంతో పాటు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం బాలకృష్ణ దేవరకొండ జలమండలి డీజీఎంను కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని అన్ని ప్రధాన, ఉప నాళాల్లో పేరుకుపోయిన పూడికను వెంటనే తొలగించి డ్రైనేజీ వ్యవస్థను సక్రమంగా నిర్వహించాలని కోరారు. ప్రజారోగ్య పరిరక్షణ కోసం అత్యవసర చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రంపై స్పందించిన జలమండలి డీజీఎం సమస్య తీవ్రతను గుర్తించి, రెండు రోజులలోనే పూడిక తొలగింపు పనులను ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. సమస్య పరిష్కారానికి అధికారులు సానుకూలంగా స్పందించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న బాలకృష్ణ దేవరకొండకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రజా సేవలో నిరంతరం ముందుండే గొట్టుముక్కల వెంకటేశ్వరరావుకు జన్మదిన శుభాకాంక్షలు

**-ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సేవా కార్యక్రమాలతో ముందుకు సాగుతున్న నాయకుడు..జివిఆర్**



కూకట్ పల్లి, జూన్ 12 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): సేవే తన లక్ష్యంగా, ప్రజల సంక్షేమమే తన ధ్యేయంగా భావిస్తూ నిరంతరం ప్రజల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ప్రజానాయకుడు గొట్టుముక్కల వెంకటేశ్వరరావు (జీవీఆర్)కి హృదయపూర్వక జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు. ప్రజలతో మమేకమై వారి కష్టసుఖాలలో భాగస్వామ్యం అవుతూ, సామాజిక సేవను జీవిత లక్ష్యంగా చేసుకుని ముందుకు సాగుతున్న ఆయన సేవా తత్వం ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తోందని కొనియాడారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తూ, ముఖ్యంగా యువత, మహిళలు, రైతులు, కార్మికుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలను చేపడుతున్న గొట్టుముక్కల వెంకటేశ్వరరావు ప్రజల హృదయాలలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం ద్వారా ప్రజలకు అండగా నిలుస్తున్నారు. అంకితభావం, నిజాయితీ, సేవా దృక్పథంతో ప్రజల విశ్వాసాన్ని పొందిన జీవీఆర్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, విజయాలతో నిండి దీర్ఘాయుష్షుతో జీవించాలని అభిమానులు, మిత్రులు, ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, సమాజ సేవలో మరింత ఉత్సాహంతో ముందుకు సాగాలని, ప్రజల ఆశయాలను నెరవేర్చే నాయకుడిగా మరింత గుర్తింపు పొందాలని పలువురు అభిలషించారు. జన్మదిన శుభాకాంక్షలు గొట్టుముక్కల వెంకటేశ్వరరావు (జీవీఆర్)కి ప్రజా సేవలో మీ ప్రయాణం మరింత విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నాము.

# ఉద్యోగుల జీవితంలో బదిలీలు సహజం.. చేసిన సేవలే చిరకాలం నిలుస్తాయి

గుడికందులలో వ్యవసాయ విస్తరణ అధికారి, పంచాయతీ కార్యదర్శికి ఘన వీడ్కోలు



సిద్దిపేట జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్) జూన్ 12: ప్రభుత్వ ఉద్యోగుల జీవితంలో బదిలీలు సహజమని, అయితే వారు ప్రజలకు అందించిన సేవలే చిరకాలం గుర్తుండిపోతాయని గుడికందుల గ్రామ సర్పంచ్ కన్నయ్య గారి లక్ష్మి, సొసైటీ చైర్మన్ కన్నయ్య గారి హరికృష్ణ రెడ్డి అన్నారు.మండలంలోని గుడికందుల గ్రామ రైతు వేదికలో బదిలీపై వెళుతున్న వ్యవసాయ విస్తరణ అధికారి దేవేందర్, పంచాయతీ కార్యదర్శి రజనిలకు శుక్రవారం ఘన వీడ్కోలు సమావేశం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కన్నయ్య గారి లక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి కోసం రాత్రింబవళ్లు కృషి చేసిన అధికారులు ఎప్పటికీ ప్రజల మన్ననలు పొందుతారని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధి, రైతుల సంక్షేమం, పారిశుధ్య కార్యక్రమాల్లో విశేష సేవలందించిన పంచాయతీ కార్యదర్శి రజని, వ్యవసాయ విస్తరణ అధికారి దేవేందర్‌ల సేవలను కొనియాడారు.అనంతరం గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు ఇద్దరు అధికారులను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మోహన్, ఉపసర్పంచ్ పర్మయ్య, వార్డు సభ్యులు, నూతన పంచాయతీ కార్యదర్శి రవి, మాజీ సర్పంచ్ మల్లయ్య, మాజీ ఉపసర్పంచ్ మల్లు గారి శ్రీకాంత్ రెడ్డి, లక్ష్మణ్, పరమేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్)ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేస్తు విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.శుక్రవారం జిల్లాలోని తాండూరు మండల కేంద్రంలో విద్య,సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిబా పూలే వసతి గృహ నిర్మాణానికి బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్,బెల్లంపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం వినోద్,మండల తహసిల్దార్ జ్యోత్స్న,మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్,మహాత్మ జ్యోతిబాపూలే ఆర్ సి ఓ బాల భాస్కర్ లతో కలిసి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతు అన్ని ప్రభుత్వ పాఠశాలలలో త్రాగునీరు,విద్యుత్, ప్రహరీ గోడ,మూత్రశాలలు ఇతర పూర్తి సౌకర్యాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.ఈ క్రమంలో తాండూరు మండలంలో 1కోటి 95లక్షల రూపాయల ఎస్ డి ఎఫ్ నిధుల అంచనా వ్యయంతో మహాత్మ జ్యోతిబాపూలే వసతి గృహ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు.ప్రభుత్వ పాఠశాలలు,జూనియర్ కళాశాలలలో విద్యార్థినీ విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్,మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం అందించడం జరుగుతుందని తెలిపారు.విద్యా సంవత్సరం ప్రారంభం రోజునే పాఠ్యపుస్తకాలు,ఏకరూప దుస్తులు అందించడం జరుగుతుందని,ప్రభుత్వ పాఠశాలలను విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు.అనంతరం బెల్లంపల్లి పట్టణంలోని రామ్ నగర్ ప్రాంతంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల అదనపు తరగతి గదులను జిల్లా కలెక్టర్,బెల్లంపల్లి సబ్ కలెక్టర్,బెల్లంపల్లి శాసనసభ్యులు, బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ రమేష్,మున్సిపల్ చైర్ పర్సన్ దావ స్వాతి,మండల విద్యాధికారి లతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతు విద్య,సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 13లక్షల 50వేల రూపాయల సమగ్ర శిక్ష అంచనా నిధులతో పాఠశాల అదనపు తరగతి గదులు నిర్మించినట్లు తెలిపారు.గదుల నిర్మాణ పనులను వేగవంతం చేసి విద్యా సంవత్సరం ప్రారంభంలోగా పూర్తి చేసేందుకు అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.విద్యా వ్యవస్థలో ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# ఉప ముఖ్యమంత్రి పర్యటనకు పూర్తిస్థాయి ఏర్పాట్లు



మంచిర్యాల జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్)ఈనెల13న జిల్లాలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పర్యటన నేపథ్యంలో పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.శుక్రవారం జిల్లాలోని గూడెం శ్రీసత్యనారాయణ స్వామి ఆలయాన్ని డిసిపి ఎ భాస్కర్,జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ వి రాములు,మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు,గిరిజన సహకార అభివృద్ధి సంస్థ చైర్మన్ కొట్నాక తిరుపతి,జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్,మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్,దండేపల్లి మండల తహసిల్దార్ రోహిత్ దేశ్ పాండే,మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రసాద్,లక్షెట్టిపేట మున్సిపల్ కమిషనర్ విజయ్,ఆలయ ఈఓ శ్రీనివాస్ లతో కలిసి సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి13న ఉదయం జిల్లాలోని దండేపల్లి మండలం శ్రీ గూడెం సత్యనారాయణ స్వామి ఆలయం పునర్నిర్మాణం,మినీ లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి శంకుస్థాపన చేస్తారని తెలిపారు.మంచిర్యాల పట్టణంలోని పద్మనాయక ఫంక్షన్ హాల్ లో సింగరేణిలో వైద్య పరంగా విధులు నిర్వహించలేని ఉద్యోగుల కుటుంబ సభ్యులకు నియామక పత్రాలు అందజేస్తారని,సాయంత్రం శ్రీరాంపూర్ ఏరియాలో ఓపెన్ కాస్ట్ గనులను పరిశీలిస్తారని,అనంతరం మంచిర్యాల పట్టణంలో శ్రీవిశ్వనాథ ఆలయ పునర్నిర్మాణానికి భూమి పూజ చేస్తారని తెలిపారు.ఈ నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి పర్యటన విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.మంచిర్యాల పట్టణంలోని వేంపల్లి ప్రాంతంలో గల పద్మావతి ఫంక్షన్ హాల్ లో ఏర్పాట్లను డిసిపి,మంచిర్యాల శాసనసభ్యులు,ఎసిపి ప్రకాష్ లతో కలిసి పరిశీలించారు.అనంతరం మంచిర్యాల పట్టణంలోని కాలేజ్ రోడ్డులో గల పద్మనాయక ఫంక్షన్ హాల్ ను సింగరేణి సంస్థ శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ తో కలిసి సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.

# రుద్రారం గ్రామానికి చెందిన లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి/షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



దుబ్బాక (లోకల్ గైడ్)జూన్ 12: దుబ్బాక నియోజకవర్గ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి గారు రుద్రారం గ్రామానికి చెందిన ఆరుగురు మహిళలకు కళ్యాణలక్ష్మి/షాదీ ముబారక్ పథకాల చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా రామిండ్ల నందిని, పడాల కవిత, సిమ్రాన్ మోయుద్దిన్, తోడేటి వినోద, బోయిని మౌనిక, బడికల ప్రవల్లిక, అల్వాల రేణుక తదితర లబ్ధిదారులకు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి గారు చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కెసిఆర్ గారు పెట్టిన ఈ పథకం ఎంతో మంది పేదలకు ఉపయోగపడుతుందని పేద కుటుంబాల ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను పొందాలని ఆయన సూచించారు.లబ్ధిదారులు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి గారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పడాల రాజు పాలమాకుల శివకృష్ణ గ్రామ బిఆర్ఎస్ కార్యకర్తలు యువకులు పాల్గొన్నారు

# ఈనెల 20న జాతీయ లోక్ అదాలత్ ను సద్వినియోగ పరుచుకోండి


తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, సభ్య కార్యదర్శిసి.హెచ్.పంచాక్షరీ, వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బి.నిర్మలా గీతాంబ.




హనుమకొండ జిల్లా ప్రతినిధి,జూన్12(లోకల్ గైడ్ న్యూస్):వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నిర్వహించిన మీడియా సమావేశంలో వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బి. నిర్మలా గీతాంబ తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి సిహెచ్.పంచాక్షరి, హనుమకొండ జిల్లా ఇంఛార్జి ప్రధాన న్యాయమూర్తి డా.టి.శ్రీనివాసరావు, వరంగల్ హనుమకొండ జిల్లాల న్యాయ సేవాదికార సంస్థ కార్యదర్శులు ఏ.ప్రదీప్, జి.రామలింగం, వరంగల్ హనుమకొండ జిల్లాల న్యాయవాదుల సంఘం అధ్యక్షులు సిహెచ్.ఉపేందర్ సిహెచ్.రామకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ "రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలను అనుసరించి జూన్ 20 , 2026 శనివారం రోజున జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం వరంగల్, హనుమకొండ జిల్లా కోర్టు, నర్సంపేట, పర్కాల కోర్టులలో నిర్వహించతలపెట్టామని తెలియజేశారు.ఈ జాతీయ లోక్ అదాలత్ విజయవంతం చేయడం కొరకు వరంగల్, హనుమకొండ జిల్లాల వివిధ న్యాయమూర్తులతో, పోలీసు, రెవెన్యూ అధికారులతో, వరంగల్ బార్ అసోసియేషన్ న్యాయవాదులు, ఇన్సూరెన్స్ సంబంధ, చిట్ ఫండ్ కంపెనీ, బ్యాంకు అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ జాతీయ లోక్ అదాలత్ లో రాజీ పడదగు క్రిమినల్, సివిల్, వివాహ /కుటుంబ తగాదా కేసులు, మోటార్ వెహికల్ యాక్ట్, బ్యాంకు, చిట్ ఫండ్, ఎక్సైజ్ కేసులు, ఎలక్ట్రిసిటీ సంబంధ కేసులను,రాజీ పడదగు ఇతర కేసులు పరిష్కరించుటకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కనుక ఇన్సూరెన్స్ బ్యాంకు,చిట్ ఫండ్ అధికారులు కోర్టులలో పెండింగ్ లలో ఉన్న తమ తమ కేసులను అధిక సంఖ్యలో పరిష్కరించుకొని లోక్ అదాలత్ ను విజయవంతం చేయాలని కోరారు. కోర్టులలో లేని కేసులను ప్రీ-లిటిగేషన్ ద్వారా న్యాయసేవాధికార సంస్థ లో పరిష్కరించుకోవాలని తెలిపారు. ప్రి-లిటిగేషన్ కేసుల విషయాలలో న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శిని సంప్రదించాలని తెలిపారు. ఇన్సూరెన్స్, బ్యాంక్, చిట్ ఫండ్ కేసుల పరిష్కారం కొరకు ఏవైనా సలహాలు, సూచనలు అవసరమైనట్లయితే న్యాయసేవాధికార సంస్థ ను నేరుగా సంప్రదించి, ఉచిత సలహాలు పొందవచ్చునని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగ పరచుకుని, ఎక్కువ కేసులు పరిష్కరించబడుటకు న్యాయవాదులు, చిట్ ఫండ్, బ్యాంకు ఇన్సూరెన్స్ అధికారులు సహకరించాలని ఈ సందర్భంగా తెలియజేశారు. ఇప్పటివరకు వరంగల్ జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ లో గుర్తించబడిన కేసులలో మొత్తం 884 రాజీపడదగు పెండింగ్ కేసులలోని కక్షిదారులకు నోటీసులు జారీ చేసి రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవాలని విజ్ఞప్తి చేశాం అన్నారు. వీటిలో క్రిమినల్-748, ఎన్.ఐ.యాక్ట్-80, ఎం.ఎ.సి.టి.-109,మనీ రికవరీ-2,అదర్ సివిల్ -25,ఎలక్ట్రిసిటి కేసులు- 65, బ్యాంక్ ప్రీ-లిటిగేషన్ కేసులు-1412,బి.ఎస్.యన్.ఎల్. ప్రీ-లిటిగేషన్ కేసులు-284 అని తెలిపారు. ఈ కేసులను పరిష్కరించుటకు వరంగల్ జిల్లాలో-08, నర్సంపేట మండల కోర్టులో-02 బెంచీలను ఏర్పాటు చేయడం జరిగింది అని తెలిపారు. కావున కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరచుకునేలా సహకరించాలని కోరారు. జాతీయ లోక్ అదాలత్ లో అధిక కేసుల పరిష్కారానికి ప్రి-లోక్ అదాలత్ ను న్యాయ సేవాధికార సంస్థ, వరంగల్ ఆధ్వర్యంలో ప్రారంభించామని తెలిపారు. ఈ ప్రి-లోక్ అదాలత్ కక్షిదారుల కేసును ఇరుపక్షాల అంగీకారంతో రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవడానికి సులభతరం అవుతుందని భావిస్తున్నాం అన్నారు.రాజీ పడదగు కక్షిదారులు తమ వీలును బట్టి తమ కేసులను సాయంత్రం 5.00 గంటలలోపు రాజీ కుదుర్చుకునేలా ఏర్పాటు చేశామని తెలిపారు.అనంతరం వరంగల్ జిల్లా కమ్యూనిటీ మీడియేటర్స్, ప్యానెల్ లాయర్లు, పారా లీగల్ వాలంటీర్స్ లతో సమావేశమయ్యి, న్యాయ సేవాధికార సంస్థ విధి, విధానాలను లక్ష్యాలను ప్రజలకు తెలియచేసి, ప్రజలను చైతన్య పరచవలసిందిగా కోరారు.

# సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో టౌన్ ప్లానింగ్ అధికారుల బదిలీలు

-కమిషనర్ జి.శ్రీజన ఉత్తర్వులు జారీ




సైబరాబాద్, జూన్ 12 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) పరిధిలో టౌన్ ప్లానింగ్ విభాగంలో పలువురు అధికారుల బదిలీలు, పోస్టింగ్‌లు చేపడుతూ కమిషనర్ జి.శ్రీజన శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టర్ జారీ చేసిన ఆదేశాల మేరకు సీఎంసీలో చేరిన అధికారులకు కొత్త బాధ్యతలు అప్పగించారు. ఉత్తర్వుల ప్రకారం భాస్కర్‌ను మేడ్చల్ సర్కిల్-60 ఇన్‌చార్జి అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా, ఎం. ప్రసాద్‌ను అమీన్‌పూర్ సర్కిల్-47 ఇన్‌చార్జి అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా నియమించారు. ఎస్.హబీబున్నిసాను మాదాపూర్ సర్కిల్-50 ఇన్‌చార్జి అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా నియమించడంతో పాటు ఆల్విన్ కాలనీ సర్కిల్-51 అదనపు బాధ్యతలు అప్పగించారు. కె.సుష్మకు మియాపూర్ సర్కిల్-48 బాధ్యతలతో పాటు శేరిలింగంపల్లి సర్కిల్-49 అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ.సురేందర్ రెడ్డిని కూకట్‌పల్లి సర్కిల్-52 అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా బదిలీ చేసి, మూసాపేట్ సర్కిల్-53 అదనపు బాధ్యతలు ఇచ్చారు. ఏ.కరుణాకర్‌ను చింతల్ సర్కిల్-54కు, ఐ.రాణిని జీడిమెట్ల సర్కిల్-55కు బదిలీ చేయడంతో పాటు కొంపల్లి సర్కిల్-56 అదనపు బాధ్యతలు అప్పగించారు. శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ జోన్ లలో కీలక నియామకాలు ఎం.ప్రసీదాను నార్సింగి సర్కిల్-45కు బదిలీ చేసి పఠాన్ చేరు సర్కిల్-46 అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆర్.సుమిత్ర గాజులరామారం సర్కిల్-57లో, ఈ.శ్రీనివాస్ దుండిగల్ సర్కిల్-59లో కొనసాగనుండగా నిజాంపేట్ సర్కిల్-58 అదనపు బాధ్యతలు నిర్వర్తించనున్నారు. ఎంఏ జీషాన్‌ను కూకట్‌పల్లి జోనల్ కార్యాలయానికి అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా బదిలీ చేయగా, ఏ.భార్గవి సాయి శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో కొనసాగనున్నారు. టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్లు (టీపీఎస్), టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్‌సీర్లు (టీపీబీఓ) తదితర సిబ్బందికి కూడా వివిధ సర్కిళ్లలో పోస్టింగ్‌లు కల్పించారు. సంబంధిత అధికారులు వెంటనే బాధ్యతలు స్వీకరించి విధులలో చేరాలని కమిషనర్ ఆదేశించారు. ఈ బదిలీలు, పోస్టింగ్‌లు తక్షణమే అమలు లోకి వస్తాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# దుబ్బాక నూతన తహసీల్దార్‌కు ఘన స్వాగతం

కేతావత్ మోతీ సింగ్‌ను సన్మానించిన పీఏసీఎస్ వైస్ చైర్మన్ కాల్వ నరేష్



దుబ్బాక( లోకల్ గైడ్)జూన్ 12: దుబ్బాక మండల నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన కేతావత్ మోతీ సింగ్‌ను పీఏసీఎస్ వైస్ చైర్మన్ కాల్వ నరేష్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు.తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాల్వ నరేష్ నూతన తహసీల్దార్‌కు శాలువా కప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. మండల ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ, పరిపాలనలో మంచి గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా కేతావత్ మోతీ సింగ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. నూతన బాధ్యతల్లో విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ తమ పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు.

# బెల్లంపల్లి మార్కెట్ కమిటీ పాలక వర్గం ఏర్పాటు...



బెల్లంపల్లి (లోకల్ గైడ్)మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా రత్నం సుకుమారి,వైస్ చైర్మన్ గా సంగర్సు రవీందర్ రావు పాలకవర్గం నియమించినట్లు వ్యవసాయ మార్కెట్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ,కె సురేంద్ర మోహన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ తెలిపారు.ఈ సందర్భంగా బెల్లంపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చైర్మన్ రత్నం సుకుమారి మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యేను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆమెకు నియామక ఉత్తర్వులు అందజేశారు.ఇప్పటికే చైర్మన్ నియామకం పూర్తయిందని,త్వరలో ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఎమ్మెల్యే మాట్లాడుతు మార్కెట్ కమిటీ అభివృద్ధికి సుకుమారి సమర్థవంతంగా పని చేసి రైతులు, వ్యాపారులకు న్యాయం చేసే విధంగా కృషి చేయాలని ఆకాంక్షించారు.ఎమ్మెల్యే తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని తెలిపారు.బెల్లంపల్లి పట్టణ అభివృద్ధి,ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నామని బెల్లంపల్లి ఎమ్మెల్యే తెలిపారు.బెల్లంపల్లి పట్టణంలోని రామ్‌నగర్‌లో 3.50 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక పాఠశాల భవనాన్ని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తో కలిసి ప్రారంభించారు.పిల్లలకు నాణ్యమైన విద్య అందించాలంటే మెరుగైన వసతులు అవసరం అని అందుకే ప్రభుత్వం విద్యా రంగానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు.అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని స్వయం సహాయక సంఘాల మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు.మహిళల ఆర్థిక స్వావలంబనకు స్వయం సహాయక సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని,ప్రభుత్వం మహిళల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు.అనంతరం రామ్‌నగర్ 27వ వార్డులో12లక్షల వ్యయంతో సిసి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడం తమ ప్రధాన బాధ్యత.ప్రతి వార్డులో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగిస్తున్నాని తెలిపారు.ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ మనోజ్ కుమార్,డిసిసి అధ్యక్షులు పిన్నింటి రఘునాథ్ రెడ్డి,మున్సిపల్ చైర్ పర్సన్ దావ స్వాతి,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్,మాజీ జడ్పిటిసి కారుకూరి రామచందర్,బెల్లంపల్లి పట్టణ అధ్యక్షులు బండి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# దీప్తిశ్రీనగర్ కాలనీ పార్కు కబ్జాపై అధికారులకు ఫిర్యాదు

-పార్కు ఆక్రమణలు, అక్రమ వసూళ్లపై విచారణ జరిపించాలని 'జనం కోసం' డిమాండ్

-అసోసియేషన్ పేరుతో జరుగుతున్న అక్రమ కార్యకలాపాలను అడ్డుకోవాలని విజ్ఞప్తి




సైబరాబాద్, జూన్ 12 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): దీప్తిశ్రీనగర్ కాలనీలోని పార్కు స్థలాన్ని కబ్జా చేయడం, అసోసియేషన్ పేరుతో అక్రమ వసూళ్లు నిర్వహించడం వంటి అంశాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ 'జనం కోసం' సంస్థ అధ్యక్షుడు కసిరెడ్డి భాస్కరరెడ్డి, ప్రధాన కార్యదర్శి నాగం రాజశేఖర్‌లు శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్, మియాపూర్ డిప్యూటీ కమిషనర్‌లకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కొందరు వ్యక్తులు తాము కాలనీ అసోసియేషన్ ప్రతినిధులమని స్వయంగా ప్రకటించుకుని, పార్కు స్థలాన్ని ఆక్రమించడమే కాకుండా వివిధ అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రజా ప్రయోజనాల కోసం కేటాయించిన పార్కు స్థలాన్ని వ్యక్తిగత ప్రయోజనాల కోసం వినియోగించడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. కాలనీలోని చిరు వ్యాపారుల వద్ద నుండి, అలాగే పార్కు పరిసర ప్రాంతాలలో బోర్డులు ఏర్పాటు చేసుకునే వారి వద్ద నుండి అసోసియేషన్ పేరుతో వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. ఈ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి, వాస్తవాలను వెలికితీసి బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. పార్కులు ప్రజల ఆరోగ్యం, వినోదం, పర్యావరణ పరిరక్షణకు ఎంతో అవసరమని, వాటిని కాపాడటం స్థానిక సంస్థల బాధ్యత అని 'జనం కోసం' నాయకులు పేర్కొన్నారు. ప్రజా స్థలాలపై ఎలాంటి ఆక్రమణలు, అక్రమ వసూళ్లు జరగకుండా అధికారులు వెంటనే జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ అంశంపై నిష్పక్షపాత దర్యాప్తు నిర్వహించి, ప్రజా ఆస్తులను రక్షించడంతో పాటు కాలనీవాసుల ప్రయోజనాలను కాపాడాలని 'జనం కోసం' సంస్థ డిమాండ్ చేసింది.

# ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం..



మంచిర్యాల జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్)తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గూడెం సత్యనారాయణ స్వామి దేవస్థానాన్ని అభివృద్ధి చేస్తానని చెప్పిన 36రోజుల్లోనే శంకుస్థాపన చేసుకోవడం చాలా గర్వకారణమని మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు అన్నారు.శుక్రవారం ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.శనివారం గూడెం సత్యనారాయణ స్వామి దేవస్థానాన్ని అభివృద్ధి పనుల శంకుస్థాపన చేసేందుకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క,దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ,మంత్రులు శ్రీధర్ బాబు,జూపల్లి కృష్ణారావు,అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లు హాజరై పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు.70కోట్లతో దేవస్థానాన్ని అభివృద్ధి చేస్తానని తన అభ్యర్థన మేరకు పిప్పిరి సభలో సీఎం రేవంత్ రెడ్డి మాటిచ్చారని అన్నట్టుగానే నిధులు విడుదల చేసి అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్నామని అన్నారు.ఇచ్చిన మాట ప్రకారం ఆలయ అభివృద్ధి కోసం నిధులు ఇచ్చినందుకు సీఎం,మంత్రుల బృందానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.అదేవిధంగా సింగరేణి ప్రాంత ఎమ్మెల్యేల విజ్ఞప్తి మేరకు సింగరేణి కార్మికుల పిల్లలకు కారుణ్య నియామకాలకు సంబంధించి ఉద్యోగ నియామక పత్రాలను మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని కాలేజీ రోడ్డులోని పద్మనాయక ఫంక్షన్ హాల్ లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అందజేస్తారని తెలిపారు.మంచిర్యాల పట్టణంలో ఇంతమంది సింగరేణి కార్మికుల పిల్లలకు నియామక పత్రాలు అందించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు.అనంతరం శ్రీరాంపూర్ సింగరేణి ఓసి ని సందర్శించి మంచిర్యాల పట్టణంలోని విశ్వనాథ ఆలయ పునః నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారని పేర్కొన్నారు.ఆదివారం పద్మావతి గార్డెన్ లో జరిగే కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం,ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పై బూత్ లెవెల్ ఏజెంట్ లకు అవగాహన శిక్షణ సమావేశంలో డిప్యూటీ సీఎం పాల్గొంటారని తెలిపారు.ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ,మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్,టీపీసీసీ ఉపాధ్యక్షులు చిట్ల సత్యనారాయణ,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పూదరి తిరుపతి,కార్పొరేటర్లు,నాయకులు తదితరులు పాల్గొన్నారు..

# చేనేత కార్మికుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తా

రాష్ట్ర మంత్రి కొండా సురేఖ...వెల్లడి,మీ ఇంటి బిడ్డను...చేనేత కార్మికులు ఆందోళన చెందవద్దు




హనుమకొండ జిల్లా ప్రతినిధి,జూన్12(లోకల్ గైడ్ న్యూస్):వరంగల్ కొత్తవాడలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద చేనేత సహకార సంఘాల కార్మికులు చేపట్టిన శాంతియుత నిరసన కార్యక్రమంలో పాల్గొని, వారి దీక్షను విరమింపజేసిన మంత్రి కొండా సురేఖ.ఈ సందర్భంగా చేనేత



కార్మికులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలు, వారి న్యాయమైన డిమాండ్లను తెలుసుకుని, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని మంత్రి సురేఖ హామీ ఇచ్చారు. చేనేత రంగంపై ఆధారపడిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందనే భరోసా మంత్రి కొండా సురేఖ కల్పించారు.త్వరలోనే చేనేత కార్మికుల సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిసి, సంబంధిత శాఖలతో సమన్వయం చేసి తగిన పరిష్కారం దిశగా చర్యలు చేపట్టేందుకు కృషి చేస్తామని ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ తెలియజేశారు .

# అమెరికా పర్యటన ముగించుకొని స్వదేశానికి చేరుకున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు ఘన స్వాగతం



సిద్దిపేట జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్)జూన్ 12: తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ శ్రీ బక్కి వెంకటయ్య గారు తన కుమార్తె వివాహ కార్యక్రమాన్ని అమెరికాలో ఘనంగా నిర్వహించి, పర్యటనను విజయవంతంగా ముగించుకొని స్వదేశానికి చేరుకున్నారు.ఈ సందర్భంగా హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆయనకు అభిమానులు, శ్రేయోభిలాషులు, కమిషన్ అధికారులు, సిబ్బంది ఘన స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.అమెరికాలో కుటుంబ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి తిరిగి వచ్చిన చైర్మన్ గారికి పలువురు అభినందనలు తెలియజేశారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తున్న బక్కి వెంకటయ్య గారు మరింత ఉత్సాహంతో ప్రజాసేవలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కమిషన్ సిబ్బంది, వ్యక్తిగత సహాయకులు, అభిమానులు, శ్రేయోభిలాషులు పాల్గొని చైర్మన్ గారికి స్వాగతం పలికారు.

# ప్రతి చిన్నారిని ప్రభుత్వ పాఠశాలకు పంపుదాం... వారి కలలకు రెక్కలు తొడుగుదాం

చిన్నారి చేతిలో పుస్తకం ఉండాలి... పనిముట్టు కాదు

బాల్యం పనికోసం కాదు... బంగారు భవిష్యత్తు కోసం

తెలంగాణ దివ్యాంగా ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం జిల్లా కార్యదర్శి బానోత్ లక్ష్మా



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, టేకులపల్లి : లోకల్ గైడ్, జూన్ 12 : ప్రతి సంవత్సరం జూన్ 12 న ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురించీ తెలంగాణ దివ్యాంగ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ లక్ష్మా తెలిపారు . చిన్నారుల హక్కులను పరిరక్షించడం , బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై సమాజంలో అవగాహన పెంచడం ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశ్యం. ప్రతి చిన్నారికి చదువుకునే హక్కు , ఆడుకునే హక్కు , సురక్షితమైన బాల్యాన్ని గడిపే హక్కు ఉంది. కానీ పేదరికం, నిరక్షరాస్యత, సామాజిక అసమానతల కారణంగా ఇంకా ఎంతోమంది చిన్నారులు బాల కార్మికులుగా మారుతున్నారు.బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు,ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రతి పౌరుడు తమ వంతు బాధ్యత నిర్వర్తించాలి. పనిలో ఉన్న చిన్నారిని చూసినప్పుడు సంబంధిత అధికారులకు సమాచారం అందించడం కూడా మన సామాజిక బాధ్యత. చట్టాలు ఉన్నప్పటికీ హోటళ్లు, టీ దుకాణాలు, ఇటుక బట్టీలు, వ్యవసాయ రంగం, పరిశ్రమలు, గృహ పనులు వంటి అనేక రంగాల్లో బాల కార్మికులు లేకుండా చేయాలి. చిన్నారి చేతిలో పుస్తకం ఉండాలి... పనిముట్టు కాదు బాల్యం పనికోసం కాదు... బంగారు భవిష్యత్తు కోసం...ప్రతి చిన్నారిని పాఠశాలకు పంపుదాం... వారి కలలకు రెక్కలు తొడుగుదాం.బాల కార్మిక వ్యవస్థ లేని సమాజమే నిజమైన అభివృద్ధి చెందిన సమాజం." అని తెలంగాణ దివ్యాంగ , ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ లక్ష్మా తెలిపారు.

# డ్రగ్స్ నిర్మూలన గురించి విస్తృత తనిఖీలు: మాగనూర్ ఎస్ఐ అశోక్ బాబు



నారాయణపేట జూన్ 12:మాగనూరు మండల కేంద్రంలో జిల్లా ఎస్పీ ఆదేశా లతో శుక్రవారం మత్తు పదార్థాల నిర్మూలన కోసం ఈగల్ ఫోర్స్ టీంతో కలిసి, నార్కోటిక్స్ స్నైపర్ పోలీసు జాగిలం విక్కి తో ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు మాగనూర్ ఎస్ఐ అశోక్ బాబు తెలిపారు. బస్ స్టాండ్ పరిసర ప్రాంతాలు, పాన్ షాపులు, కిరణ దుకాణాలు అనుమానాస్పద ప్రదేశాల్లో విస్తృతంగా తనిఖీలు చేప ట్టామని తెలిపారు.మత్తు పదార్థాల రవాణా, నిల్వ, విక్రయాలు, వినియోగాన్ని పూర్తిగా అరికట్టేందుకు జిల్లా పోలీసులు పకడ్బందీ చర్య లు చేపడుతున్నారని ఎస్ఐ పేర్కొన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండా లని సూచిస్తూ, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు సమాజా న్ని నాశనం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రజలు ఎవరైనా గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల ను వినియోగిస్తున్నా, విక్ర యిస్తున్నా, రవాణా చేస్తు న్నా వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1908 లేదా డయల్-100కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందిం చిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.ఈ తనిఖీల్లో నార్కోటిక్స్ స్నైపర్ డాగ్ విక్కి, డాగ్ హ్యాండ్లర్ పీసీ రవి,మాగనూర్ పోలీసులు పాల్గొన్నారు.

# ఖమ్మం ఘటనను తీవ్రంగా ఖండించిన వి ఎచ్ పి నిందితుడు మహమ్మద్ గౌస్ ను ఎన్ కౌంటర్ చేయాలి

నారాయణపేట జూన్ 12:ఖమ్మం లో పసిపాపపై పశు వులా వ్యవహరించిన నింది తుడు మహమ్మద్ గౌస్ ను ఎన్ కౌంటర్ చేయాలని నారాయణపేట జిల్లా విశ్వ హిందూ పరిషత్ కార్యదర్శి కన్న శివకుమార్, టౌన్ ప్రెసిడెంట్ మురళి భట్టడ్, బజరంగ్దళ్ జిల్లా అధ్యక్షులు శ్రవణ్, కడుదాస్ ప్రవీణ్ లు శుక్రవారం ప్రకటనలో డిమాండ్ చేశారు.నిందితు డిని కాపాడే ప్రయత్నం మానుకోవాలన్నారు. ఖమ్మం జిల్లాలో బాలికపై జరిగిన అత్యాచారం, హత్యాయత్న ఘటన అత్యంత దారుణ మని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం పూర్తి స్థాయిలో న్యాయం చేయాలని, బాధి తురాలి హెల్త్ బుల్లెట్ విడు దల చేయాలని డిమాండ్ చేశారు. మహిళలు, బాలికల భద్రత విషయంలో ప్రభు త్వం ఎలాంటి రాజీ పడ కుండా కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సమా జంలో ఇలాంటి దారుణ ఘటనలు పునరావృతం కాకుండా నిరోధించేందుకు శిక్షలు భయపడేలా ఉండాల ని అభిప్రాయపడ్డారు. నేరా లను ఖండించే విషయంలో కులం, మతం, రాజకీయ అనుబంధాలుప్రామాణికంగా మారకూడదన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరించాలని నిందితు డిపై జూడీషినల్ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

# పదవి విరమణ మహోత్సవ కార్యక్రమం లో పాల్గొన్న సర్పంచ్ రంజిత్ కుమార్



ఖమ్మం జిల్లా , కారేపల్లి:లోకల్ గైడ్, జూన్ 12 : మండలం లోని గాదెపాడు గ్రామంలో గత 40 సంవత్సరాలుగా పోస్టల్ బ్యాంకు యొక్క సేవలను ప్రతి ఒక్కరికి అందుబాటులోకి తీసుకువచ్చి, వారి యొక్క అకౌంట్లో ఓపెన్ చేసి వారికి ఇన్సూరెన్స్ సేవింగ్ , బ్యాంక్స్ పోస్టల్ అకౌంట్స్ , సుకన్య సమృద్ధి యోజన అకౌంట్స్, ఇన్సూరెన్స్ బాండ్స్ మరియు ఈ ప్రాంతంలోని రైతులకి వ్యవసాయ పెట్టుబడి అవసరాలకు ఎంతోమందికి తన వంతుగా సహకారాలు అందిస్తూ వచ్చినా పుచ్చకాయల వెంకటేశ్వర్లు పదవి విరమణ మహోత్సవ కార్యక్రమం లో పాల్గొన్న గాదెపాడు సర్పంచ్ భూక్యా రంజిత్ కుమార్ సభను ఉద్యేశించి అన్నారు. శుక్రవారం నాడు తన యొక్క పదవి విరమణ మహోత్సవ కార్యక్రమంలో ప్రతి ఒక్కరిని పిలిచి తమ కుటుంబ సభ్యుల సమక్షంలో ఈ యొక్క కార్యక్రమం జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని , ఇకముందు పుచ్చకాయల వెంకటేశ్వర్లు సహకారాలతో గ్రామాభివృద్ధికి తోడ్పాటు సలహాలు సూచనలు ఇస్తారని సర్పంచ్ రంజిత్ కుమార్ వారి యొక్క సేవలను ప్రజలకు బ్యాంకు ఖాతాదారులకు ఏ విధంగా సహకరించారో ఈ సందర్భంగా వివరించడం జరిగింది.ఈ కార్యక్రమం లో ఉపసర్పంచ్ నన్నెబోయిన ఉపేందర్, కో -ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ముప్వ విజయ్ బాబు, మాజీ ఇల్లందు మునిస్పల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి కుమార్, గ్రామ పెద్దలు మర్ల వెంకటరెడ్డి, బత్తుల బాబు రావు, యలమంచి భాస్కర్, మధ్యబోయిన జోగయ్య, గడిపార్తి వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

# సిద్దిపేటలో ట్రాఫిక్ ఉల్లంఘనలపై ఉక్కుపాదం -- డంక్ అండ్ డ్రైవ్, లైసెన్స్ లేని వాహనదారులకు రూ.4.18 లక్షల జరిమానా

మద్యం సేవించి వాహనాలు నడిపిన 38 మందికి రూ.3,12,500 జరిమానా

డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన 22 మందికి రూ.1,05,500 జరిమానా



సిద్దిపేట జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్) జూన్ 12:సిద్ధిపేట ట్రాఫిక్ సీఐ సీహెచ్. ముత్యం రాజు ఆధ్వర్యంలో ట్రాఫిక్ సిబ్బంది ఇటీవల సిద్దిపేట పట్టణం మరియు పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 38 మంది వ్యక్తులను గుర్తించి, బ్రీత్ అనలైజర్ ద్వారా పరీక్షించగా మద్యం సేవించినట్లు నిర్ధారణ అయింది.వారిని సిద్దిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ శ్రీ కాంతారావు గారి కోర్టులో హాజరుపరచగా, విచారణ అనంతరం 38 మందికి కలిపి రూ.3,12,500 జరిమానా విధించారు.అదేవిధంగా, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న 22 మంది వ్యక్తులను గుర్తించి, వారికి మొత్తం



రూ.1,05,500 జరిమానా విధించారు.ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ ముత్యం రాజు మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా ప్రతిరోజూ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల తమకే కాకుండా ఇతర వాహనదారుల ప్రాణాలకు కూడా ప్రమాదం కలుగుతుందని హెచ్చరించారు.డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన వారిని కోర్టులో హాజరుపరచగా, మెజిస్ట్రేట్ విచారణ అనంతరం రూ.10,000 వరకు జరిమానా విధించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అలాగే డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే ఒక్కొక్కరికి రూ.5,000 వరకు జరిమానా విధించబడుతుందని తెలిపారు.ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటించి, సురక్షితంగా ప్రయాణించాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు.

# వర్షాకాలానికి ముందస్తు సన్నద్ధతపై ప్రత్యేక దృష్టి

-శేరిలింగంపల్లి జోన్‌లో వాటర్ లాగింగ్ పాయింట్లు, మల్కాం చెరువును తనిఖీ చేసిన..జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్



శేరిలింగంపల్లి, జూన్ 12 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని వాటర్ లాగింగ్ పాయింట్లు, మల్కాం చెరువు ప్రాంతాలను జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్, శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ తనిఖీలలో ఉప కమిషనర్‌తో పాటు ఇంజనీరింగ్, హైడ్రా, సాగునీటి శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు ఆయా ప్రాంతాలలో ప్రస్తుతం ఉన్న పరిస్థితులను, వర్షపు నీటి ప్రవాహ మార్గాలను, డ్రైనేజీ వ్యవస్థ పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. భారీ వర్షాలు కురిసే సమయంలో నీరు నిల్వ ఉండకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా మల్కాం చెరువు పరిసర ప్రాంతాలలో వర్షపు నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని, చెరువుకు అనుసంధానమైన కాలువలు, డ్రైనేజీలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అలాగే ప్రజలకు ఇబ్బందులు కలిగించే వాటర్ లాగింగ్ సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో తుఫాను నీటి నిల్వలు ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ స్పష్టం చేశారు. సంబంధిత శాఖల మధ్య సమన్వయాన్ని పెంపొందించి, వరద ఉపశమన చర్యలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. ప్రజల భద్రత, సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం చేపడుతున్న చర్యలలో భాగంగా ఈ తనిఖీలు నిర్వహించామని అధికారులు తెలిపారు. వర్షాకాలంలో ఎలాంటి అవాంఛనీయ పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు చర్యలను వేగవంతం చేయనున్నట్లు పేర్కొన్నారు.

# కేటీఆర్ ను కలిసిన చిర్రా రవీందర్ యాదవ్



లోకల్ గైడ్ శేరిలింగంపల్లి:భారాస వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శేరిలింగంపల్లి ఉద్యమకారుడు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత చిర్రా రవీందర్ యాదవ్ కలిశారు. హైదరాబాద్ లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా సమావేశం అయ్యారు. మలేషియా పర్యటన ముగించుకొని వచ్చిన సందర్భంగా కలిసి ఆయనకు చిర్రా రవీందర్ యాదవ్ మొక్కను బహుమతిగా అందించారు. అనంతరం మలేషియా పర్యటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే శేరిలింగంపల్లిలోని తాజా రాజకీయాలపై కేటీఆర్ తో చిర్రా రవీందర్ యాదవ్ సుధీర్ఘంగా చర్చించారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతం దిశగా తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. మారిన రాజకీయ పరిస్థితులను సైతం కేటీఆర్ దృష్టికి తీసుకువెళ్లినట్లుగా పేర్కొన్నారు. నియోజకవర్గం లోని పలు డివిజన్ లోని పార్టీ సమస్యలను సైతం కేటీఆర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చిర్రా రవీందర్ యాదవ్ మాట్లాడుతూ.. శేరిలింగంపల్లిలో భారాస పార్టీకి తిరుగులేదని, ఎవరు ఎన్ని కుట్రలు పన్నినా వచ్చే ఎన్నికల్లో బంపర్ మెజార్టీతో గెలవడం ఖాయం అన్నారు. కేటీఆర్ మార్గదర్శకంలో శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని గెలిపించుకొని తీరుతామని చెప్పారు. మరోవైపు అన్ని డివిజన్ లోనూ భారాస జెండాను ఎగరవేస్తామంటూ చిర్రా రవీందర్ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు.

# పేదల సంక్షేమం, అభివృద్ధే ప్రజా ప్రభుత్వ లక్ష్యం...

రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



లోకల్ గైడ్' ఖమ్మంఇందిరమ్మ ఇళ్ల రెండవ విడత లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేతప్రతి పేద కుటుంబ సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందిఏదులాపురంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల క్రింద 76 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేసిన మంత్రి పొంగులేటిఏదులాపురం, పేదల సంక్షేమం, అభివృద్ధే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు.శుక్రవారం ఏదులాపురం మున్సిపల్ పరిధిలోని రాంలీలా ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల క్రింద 76 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు.అలాగే ఇందిరమ్మ ఇళ్ల రెండవ విడత లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ఖమ్మం రూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని అర్హులైన కుటుంబాలకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా ఆర్థిక సహాయాన్ని అందించడం సంతోషంగా ఉందన్నారు. అదే విధంగా ఇందిరమ్మ ఇళ్ల రెండవ విడత లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేయడం ద్వారా వారి సొంత ఇంటి కలను సాకారం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని తెలిపారు.గత రెండున్నర సంవత్సరాలుగా ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సన్న బియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డుల మంజూరు, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం వంటి పలు ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తోందన్నారు.సమాజంలోని అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని మంత్రి తెలిపారు. పేదల సంక్షేమాన్ని కేంద్ర బిందువుగా చేసుకుని ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ప్రజల ఆశీస్సులు, సహకారంతో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తామని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వానికి ప్రజల ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని మంత్రి ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, ఏదులాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, ఆర్ అండ్ బి ఎస్‌ఈ యాకోబు, మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్ రెడ్డి, తహసీల్దార్ వినయందర్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజ్ ఓవర్‌ఫ్లో సమస్యను తక్షణమే పరిష్కరించిన అధికారులకు కృతజ్ఞతలు

-ప్రజా సమస్యల పరిష్కారంలో హెచ్‌ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ బోర్డు స్పందన అభినందనీయం.. మొహమ్మద్ అలాఉద్దీన్ పటేల్



శేరిలింగంపల్లి, జూన్ 12 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): కొండాపూర్ 234వ డివిజన్ పరిధిలో గత రెండు రోజులుగా డ్రైనేజ్ ఓవర్‌ఫ్లో కారణంగా మురుగునీరు రోడ్డుపై పారుతూ స్థానిక ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగించిన విషయం తెలిసిందే. ఈ సమస్యపై హెచ్‌ఎండబ్ల్యూ ఎస్ఎస్‌బీ (హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు) అధికారులకు ఫిర్యాదు చేసిన వెంటనే వారు స్పందించి సమస్యను త్వరితగతిన పరిష్కరించడం పట్ల స్థానిక నాయకుడు, 234వ డివిజన్ బిఆర్ఎస్ కార్పొరేటర్ అభ్యర్థి మొహమ్మద్ అలాఉద్దీన్ పటేల్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రజల ఆరోగ్యం, పారిశుధ్యం దృష్ట్యా డ్రైనేజ్ సమస్యలను వెంటనే పరిష్కరించడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. స్థానిక ప్రజల తరఫున తమ ఫిర్యాదును సానుకూలంగా స్వీకరించి, ఆలస్యం చేయకుండా చర్యలు చేపట్టి సమస్యను పూర్తిగా నివారించిన హెచ్‌ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ బోర్డు అధికారులైన వరుణ్ కుమార్ కి, శ్రీకాంత్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే పారిశుధ్య సమస్యల విషయంలో అధికారులు ఇదే విధంగా స్పందిస్తే నగరంలో పరిశుభ్రమైన వాతావరణం నెలకొంటుందని ఆయన అన్నారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. స్థానిక ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కట్టుబడి ఉండటం ప్రజాప్రతినిధుల బాధ్యత అని పేర్కొన్న అలాఉద్దీన్ పటేల్, ప్రజా సేవే తన లక్ష్యమని స్పష్టం చేశారు. కొండాపూర్ ప్రాంత అభివృద్ధి, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, మౌలిక వసతుల కల్పన వంటి అంశాలపై నిరంతరం పనిచేస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్న నాయకత్వానికి తన మద్దతును తెలియజేస్తూ కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో ముందుకు వెళుతారు అంటూ తన సంఘీభావాన్ని వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు సమన్వయంతో పనిచేస్తే సమాజాభివృద్ధి మరింత వేగవంతమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

## పేదల సంక్షేమం, అభివృద్ధే ప్రజా ప్రభుత్వ లక్ష్యం...



ఏదులాపురం, జూన్ 12:లోకల్ గైడ్ :-పేదల సంక్షేమం, అభివృద్ధే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు.శుక్రవారం ఏదులాపురం మున్సిపల్




పరిధిలోని రాంలీలా ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల క్రింద 76 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు.అలాగే ఇందిరమ్మ ఇళ్ల రెండవ విడత లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ఖమ్మం రూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని అర్హులైన కుటుంబాలకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా ఆర్థిక సహాయాన్ని అందించడం సంతోషంగా ఉందన్నారు. అదే విధంగా ఇందిరమ్మ ఇళ్ల రెండవ విడత లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేయడం ద్వారా వారి సొంత ఇంటి కలను సాకారం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని తెలిపారు.గత రెండున్నర సంవత్సరాలుగా ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సన్న బియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డుల మంజూరు, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం వంటి పలు ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తోందన్నారు.సమాజంలోని అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని మంత్రి తెలిపారు. పేదల సంక్షేమాన్ని కేంద్ర బిందువుగా చేసుకుని ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ప్రజల ఆశీస్సులు, సహకారంతో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తామని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వానికి ప్రజల ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని మంత్రి ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, ఏదులాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, ఆర్ అండ్ బి ఎస్ఈ యాకోబు, మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్ రెడ్డి, తహసీల్దార్ వినయందర్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ స్టార్టప్‌ల అభివృద్ధికి బయోనెస్ట్ కో-ఇంక్యుబేషన్ కార్యక్రమంలో త్రైపాక్షిక అవగాహన ఒప్పందం



. రాజేంద్ర నగర్, జూన్ 12, (లోకల్ గైడ్ ): బయోనెస్ట్ కో-ఇంక్యుబేషన్ కార్యక్రమం కింద త్రైపాక్షిక అవగాహన ఒప్పందం కార్యక్రమం ఐకార్-నార్మ్ లో జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఐడిఈఏ, ఐసిఏఆర్-నార్మ్, ఐసిఏఆర్-ఐఐఓఆర్ లతో పాటు ఎంపికైన స్టార్టప్‌లు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో ఎంపికైన స్టార్టప్‌లలో క్రియేటర్స్ అగ్రో ట్రేడింగ్ అండ్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ తమిళనాడు వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ శామ్యూల్ ప్రిన్స్ ఎ. ప్రాతినిధ్యం వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఈ సంస్థ స్థిరమైన కీటక నియంత్రణ కోసం ప్రాంతానుకూల ఎంటోమోపథోజెనిక్ నేమటోడ్స్ అభివృద్ధి చేస్తోందని తెలిపారు. అగ్రికల్చర్ రూరల్ అలైడ్ మాన్యుఫాక్టరీ ప్రైవేట్ లిమిటెడ్ తెలంగాణ డైరెక్టర్ కె. వంశీ కృష్ణారెడ్డి ఈ కార్యక్రమానికి ప్రాతినిధ్యం వహించారు. ఈ సంస్థ జీవ ఎరువులు, జీవ పురుగుమందుల వికేంద్రీకృత ఉత్పత్తిని ప్రోత్సహిస్తోందని తెలిపారు. ముందుగా ఐడిఈఏ సీఈఓ డా. రంజిత్ కుమార్ స్వాగతోప్యాన్యాసం చేశారు. అనంతరం స్టార్టప్‌ల ఎంపిక ప్రక్రియపై కు ఐ సీ ఏ ఆర్ ఐ ఐ ఓ ఆర్ కు చెందిన డా. ఆర్.డి. ప్రసాద్, నార్మ్ కు చెందిన డా. పి. సుప్రియ పలు అంశాలు వివరించారు. అదే విధంగా ఐ ఐ ఓ ఆర్ డైరెక్టర్ డా. ఆర్.కే. మాథుర్ మాట్లాడుతూ...శాస్త్రీయ నైపుణ్యం, సాంకేతిక ధృవీకరణ పరిశోధనా మౌలిక సదుపాయాల ద్వారా స్టార్టప్‌లకు సంస్థ అందిస్తున్న సహకారాన్ని వివరించారు. ఐ డి ఈ ఏ ఉపాధ్యక్షులు, నార్మ్ సంయుక్త డైరెక్టర్ డా. గోపాల్ లాల్, నూనెగింజల రంగంలో స్టార్టప్‌ల భాగస్వామ్యం పరిమితంగా ఉన్నప్పటికీ వాటి ప్రభావం అత్యంత కీలకమని పేర్కొన్నారు. వినూత్న ఆవిష్కరణలను కొనసాగించాలని సూచించారు.నార్మ్ డైరెక్టర్ డా. రామన్ మీనాక్షి సుందరం మాట్లాడుతూ వాతావరణ మార్పులకు తట్టుకునే వ్యవసాయం, జీవ ఆధారిత ఇన్‌పుట్లు ఇంకా శాస్త్ర ఆధారిత వ్యవసాయ పారిశ్రామికవేత్తల ప్రాధాన్యతను వివరించారు. ఇవి భారతీయ వ్యవసాయ రంగాన్ని రూపాంతరం చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐ డి ఈ ఏ సీఓఓ పరితోష్ త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు.

## మోడీ 12 ఏళ్ల పాలనతో భారత్ విశ్వవేదికపై అగ్రగామి బీజేపీ నేతలు గొట్టిముక్కుల సురేష్ రెడ్డి, నరెడ్ల ప్రవీణ్ రెడ్డి




పెద్దపల్లి , జూన్ 12: (లోకల్ గైడ్ )ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో గత 12 సంవత్సరాలుగా దేశం అన్ని రంగాల్లో విశేష అభివృద్ధిని సాధించి, ప్రపంచ వేదికపై భారత్ ప్రతిష్ఠను మరింత ఉన్నత స్థాయికి చేర్చిందని బీజేపీ రాష్ట్ర నాయకులు గొట్టిముక్కుల సురేష్ రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు నరెడ్ల ప్రవీణ్ రెడ్డి పేర్కొన్నారు. పెద్దపల్లి బీజేపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, 2014లో అవినీతి, విధానపరమైన స్థబ్దతతో ఉన్న దేశాన్ని నేడు ప్రపంచంలో ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దిన ఘనత మోదీ ప్రభుత్వానిదేనని అన్నారు. సమీప భవిష్యత్తులో భారత్ ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఆర్థిక శక్తిగా అవతరించనున్నదని విశ్వాసం వ్యక్తం చేశారు. యువత సాధికారతకు ప్రాధాన్యం ఇస్తూ స్టార్టప్ ఇండియా, డిజిటల్ ఇండియా వంటి కార్యక్రమాల ద్వారా లక్షలాది మంది యువకులకు ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించబడుతున్నాయని తెలిపారు. 'ఆత్మనిర్భర్ భారత్' కార్యక్రమం ద్వారా రక్షణ రంగంలో స్వదేశీ తయారీ పెరిగి, భారత్ ఆయుధాల ఎగుమతి దేశంగా ఎదుగుతోందని పేర్కొన్నారు. అయోధ్యలో శ్రీరామ మందిర నిర్మాణం కోట్లాది భారతీయుల చిరకాల ఆకాంక్షను నెరవేర్చిందని, దేశ సంస్కృతి, సంప్రదాయాలకు అంతర్జాతీయ స్థాయిలో కొత్త గుర్తింపు లభించిందని అన్నారు. అంతరిక్ష రంగంలో చంద్రయాన్ విజయాలు, గగన్‌యాన్ వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులతో ప్రపంచ దేశాల దృష్టి భారత్ వైపు మళ్లిందని తెలిపారు. దేశవ్యాప్తంగా జాతీయ రహదారుల విస్తరణ, వందేభారత్ రైళ్ల ప్రారంభం, మెట్రో రైలు వ్యవస్థల అభివృద్ధి, విమానాశ్రయాల విస్తరణతో మౌలిక వసతుల రంగంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయని వివరించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన, ఆయుష్మాన్ భారత్, ఉచిత ఆహార ధాన్యాల పంపిణీ, జల్ జీవన్ మిషన్, పీఎం కిసాన్, ముద్ర యోజన వంటి సంక్షేమ పథకాల ద్వారా పేదలు, రైతులు, మహిళలు, యువతకు ప్రత్యక్ష లబ్ధి చేకూరుతోందని పేర్కొన్నారు. డిజిటల్ చెల్లింపుల్లో యూపీఐ ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందని, డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) విధానం ద్వారా అవినీతికి అడ్డుకట్ట పడుతూ ప్రభుత్వ ప్రయోజనాలు నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు చేరుతున్నాయని చెప్పారు. దేశ భద్రత, ఆర్థికాభివృద్ధి, సంక్షేమం, మౌలిక వసతులు, సాంకేతికత, మహిళా సాధికారత, రైతు సంక్షేమం తదితర రంగాల్లో కేంద్ర ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అలాగే "వికసిత భారత్--2047" లక్ష్య సాధనలో ప్రతి భారతీయుడు భాగస్వామి కావాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కన్వీనర్ శివంగారి సతీష్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు అమరాగాని ప్రదీప్ కుమార్, దాడి సంతోష్, కందుల శ్రీనివాస్, బెజ్జంకి దిలీప్, రామగిరి అఖిల్, బుతాగడ్డ రాజ్‌కుమార్, రాజేందర్ రెడ్డి, పెంజర్ల ఐలయ్య, రగుల రాజ్‌కుమార్ తదితర పార్టీ నాయకులు, యువమోర్చ ప్రతినిధులు పాల్గొన్నారు.

## రుణాల మంజూరులో బ్యాంకర్లు చొరవ చూపాలి కలెక్టర్ ప్రియాంక



నారాయణపేట జూన్ 12:రైతులు, విద్యార్థులు, ఎం ఎస్ ఎం ఈ యూనిట్లు, స్వయం సహాయక సంఘా లు, స్వయం ఉపాధి రంగాల కు రుణాల మంజూరు లో బ్యాంకులు చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఇక్కడి వీసీ హాల్ లో ఎల్ డీ ఎం విజయ్ కుమార్ అధ్యక్షతన డీ సీ సీ ( డిస్టిక్ కన్సల్టేటివ్ కమిటీ) సమీక్షా సమావేశం నిర్వహించారు. గత ఆర్థిక సంవత్సరం లో బ్యాంకుల ద్వారా చేపట్టిన రుణాల పురోగతిపై కలెక్టర్ సమావేశంలో సమీక్షించారు. గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వ్యవసాయ, ఎం.ఎస్. ఎం.ఈ, విద్య, స్వయం సహాయక సంఘాల, ప్రభుత్వ పథకాల రుణాల మంజూరు పై కేటగిరి వారీగా సమీక్ష జరిపారు. రుణాల మంజూరులో సిబిల్ స్కోర్ ను ఒక ప్రమాణంగా పరిగణించినప్పటికీ, అర్హులైన రైతులు, విద్యార్థులు , స్వయం ఉపాధి లబ్ధిదారులు రుణాల కోసం తిరస్కరణకు గురికాకుండా బ్యాంకర్లు సానుకూల దృక్పథంతో వ్యవహరించాలని ఆమె సూచించారు. జిల్లాలోని కొన్ని బ్యాంకులు వివిధ ప్రభుత్వ పథకాల కింద రుణాల మంజూరులో వెనుకబడి ఉన్నాయని, అలాంటి బ్యాంకులు వెంటనే తమ పనితీరును మెరుగుపరచుకొని లక్ష్యాలను చేరుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. బ్యాంకులు అభివృద్ధి భాగస్వాములుగా వ్యవహరించి వ్యవసాయం, స్వయం ఉపాధి, సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమలు తదితర రంగాలకు విస్తృతంగా రుణాలు అందించాలని ఆమె కోరారు. అలాగే ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన, ముద్ర యోజన తదితర ప్రభుత్వ పథకాల కింద అర్హులైన లబ్ధిదారులకు నిర్ణీత గడువులోపు రుణాలు మంజూరు చేసి జిల్లా అభివృద్ధికి తోడ్పడాలని కలెక్టర్ బ్యాంకర్లను కోరారు. చివరగా ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ. 4524.78 కోట్ల జిల్లా వార్షిక రుణ ప్రణాళిక పుస్తకాన్ని కలెక్టర్ విడుదల చేశారు. ఈ సమావేశంలో ఆర్బీఐ ఎల్ డి ఓ శ్రీకాంత్, ఎస్ బి ఐ ఏ జీ ఎం పవన్ కుమార్, నాబార్డ్ డి డి ఎం మహేందర్, శీలా, కెనరా బ్యాంక్ నుంచి నరేష్, యూ బి ఐ నుంచి రమేష్ బాబు, డిఆర్డిఏ వెంకట్ రాములు, జిల్లా వ్యవసాయ అధికారి సక్రియా నాయక్, జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ అధికారి అబ్దుల్ ఖలీల్, హార్టికల్చర్ అధికారి సాయిబాబ, పశు సంవర్ధక శాఖ అధికారి ఈశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఐ డి ఓ సి నీ పరిశీలించిన మంత్రి శ్రీహరి



నారాయణపేట జూన్ 12:నారాయణ పేట జిల్లా కేంద్రం లో నూతనంగా నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ డిస్ట్రిక్ట్ ఆఫీస్ కాంప్లెక్స్ (ఐ డి ఓ సి ) పనులను రాష్ట్ర క్రీడా, పాడి పరిశ్రమాభివృద్ధి, పశు సంవ ర్ధక ,మత్స్య, యువ జన సేవల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి శుక్రవారం పరిశీలించారు. కలెక్టర్ ప్రియాంక తో కలిసి భవనం మొత్తం తిరిగి నిర్మాణ వివరాలను అడిగి తెలుసు కున్నారు. బిల్డింగ్ లోని మీటింగ్ హాల్, మంత్రి ఛాంబర్, కలెక్టర్ ఛాంబర్ ను పరిశీలించి తగు సూచనలు చేశారు. కలెక్టరేట్ బిల్డింగ్ ప్రాంగణంలోనే హెలిపాడ్ ను ఏర్పాటు చేయవలసిందిగా అధికారులకు సూచన చేశా రు. ఈ ఏడాది పంద్రాగస్టు వరకు భవన నిర్మాణం పూర్తి అయ్యి ఐ డి ఓ సి ని అందు బాటులోకి తేవాలని అధికా రులను ఆదేశించారు. చివ రగా నూతన కలెక్టరేట్ సమీపంలోనే జిల్లా ఎస్పీ కార్యాలయానికి ఇచ్చిన 7 ఎకరాల ప్రభుత్వ స్థలం గురించి డీఎస్పీ లింగయ్య తో మంత్రి ఆరా తీశారు. అధికారులు,ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

## పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులే భవిష్యత్ దార్శనికులు -- విజేతలకు కలెక్టర్ హైమావతి బహుమతుల ప్రదానం



సిద్దిపేట జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్) జూన్ 12:ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖన పోటీలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ కె. హైమావతి బహుమతులు ప్రదానం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులలో సృజనాత్మకతతో పాటు పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించడం ఎంతో ముఖ్యమని అన్నారు. పర్యావరణాన్ని కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, విద్యార్థులు చిన్న వయస్సు నుంచే ప్రకృతి సంరక్షణ పట్ల చైతన్యంతో ముందుకు సాగాలని సూచించారు.పోటీలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించిన కలెక్టర్, భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలలో చురుకుగా పాల్గొని తమ ప్రతిభను మరింత మెరుగుపరుచుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి పద్మజారాణి, అటవీ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఖానామేట్‌లో 15 ఎకరాల ప్రభుత్వ భూమి రక్షణ

-హైకోర్టు ఆదేశాలతో ఫెన్సింగ్ ఏర్పాటు చేసిన రెవెన్యూ, హైడ్రా అధికారులు



శేరిలింగంపల్లి, జూన్ 12 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): శేరిలింగంపల్లి మండలం మాదాపూర్ ఖానామేట్ గ్రామంలోని సర్వే నంబర్లు 41/12, 13, 14లో ఉన్న సుమారు 15 ఎకరాల ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు రక్షించారు. హైకోర్టు తీర్పు మేరకు హైడ్రా అధికారుల సహకారంతో భూమి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, ప్రభుత్వ భూమిగా బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ భూమి తమదని ఇట్టినా ప్రాపర్టీస్ సంస్థ క్లెయిమ్ చేస్తూ వచ్చిన నేపథ్యంలో, 2016లో టీజీఐఐసీ అధికారులు నోటీసులు జారీ చేశారు. దీనిపై విచారణ జరిపిన జస్టిస్ నగేశ్ భీమపాక, పిటిషనర్లు సమర్పించిన పట్టా పత్రాలు నకిలీవని గుర్తించి ప్రభుత్వ భూమిని రక్షించాలని ఆదేశించారు. నకిలీ పత్రాలతో ప్రభుత్వ భూమిపై హక్కుల ప్రయత్నం విఫలం విచారణలో 1978లో ఏర్పాటైన రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయం పేరుతో 1972, 1973 సంవత్సరాలకు సంబంధించిన పత్రాలు సమర్పించడంపై రెవెన్యూ అధికారులు అనేక ఆధారాలు కోర్టుకు సమర్పించారు. అలాగే ప్రొసీడింగ్స్ జారీ చేసినట్లు పేర్కొన్న అధికారి పేరు, రికార్డులు సరిపోలకపోవడంతో పత్రాల ప్రామాణికతపై సందేహాలు వ్యక్తమయ్యాయి. ఈ సందర్భంగా తహసీల్దార్ మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రభుత్వ తరఫున పూర్తి ఆధారాలతో కౌంటర్ దాఖలు చేయడంతో హైకోర్టు అనుకూల తీర్పు వెలువడిందన్నారు. ప్రభుత్వ ఆస్తిని రక్షించడం ఆనందంగా ఉందని తెలిపారు. భూమి స్వాధీనం, ఫెన్సింగ్ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, సర్వేయర్ సతీష్ రెడ్డి, హైడ్రా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అరైవ్ అలైవ్ కార్యక్రమంలో మంత్రి

హెల్మెట్ ధరించండి.. ప్రాణాలు కాపాడుకోండి" -- హుస్నాబాద్ 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్




సిద్దిపేట, జూన్ 12:ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ముగింపు కార్యక్రమంలో భాగంగా హుస్నాబాద్‌లోని తిరుమల గార్డెన్స్‌లో శుక్రవారం రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమం 'అరైవ్--అలైవ్ 2026' ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.కార్యక్రమంలో పోలీసులు రోడ్డు నిబంధనల ఉల్లంఘన వల్ల జరిగే ప్రమాదాలపై ప్రత్యేక వీడియో ప్రదర్శించారు. ఓవర్ స్పీడ్, డ్రంక్ అండ్ డ్రైవ్, హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం, ట్రిపుల్ రైడింగ్, మొబైల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వంటి చర్యలు ప్రమాదాలకు ఎలా కారణమవుతున్నాయో ప్రజలకు వివరించారు. అలాగే డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలు యువత జీవితాలను ఎలా నాశనం చేస్తున్నాయో అవగాహన కల్పించారు.అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను కాపాడే సీపీఆర్ (ఝూ=) విధానాన్ని నిపుణుల ద్వారా ప్రదర్శించి ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ చేత ప్రతిజ్ఞ చేయించారు.ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లకు యూనిఫాంలు, వాహనదారుల సురక్షిత ప్రయాణం కోసం హెల్మెట్లు పంపిణీ చేశారు.మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రహదారి భద్రత కోసం పోలీసు, రవాణా శాఖలు సంయుక్తంగా చేపడుతున్న 'అరైవ్--అలైవ్' కార్యక్రమం రాజకీయాలకు అతీతమైన సామాజిక ఉద్యమమని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల్లో కుటుంబ పెద్దలను కోల్పోయిన కుటుంబాలు



ఎదుర్కొనే బాధ వర్ణనాతీతమని అన్నారు. వేగంగా వాహనాలు నడపడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, మొబైల్ ఫోన్ ఉపయోగిస్తూ వాహనం నడపడం వంటి నిర్లక్ష్యాల వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు.యాక్సిడెంట్ జరిగిన తొలి గంటలో బాధితుడిని ఆస్పత్రికి చేర్చిన వారికి ప్రభుత్వం 'రహవీర్ అవార్డు' కింద రూ.25 వేల నగదు ప్రోత్సాహకాన్ని అందజేస్తోందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ప్రాణాలను కాపాడాలని పిలుపునిచ్చారు.డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనను ఎప్పటికప్పుడు గమనిస్తూ వారికి సరైన మార్గనిర్దేశనం చేయాలని సూచించారు. హెల్మెట్ లేకుండా బయటకు వెళ్లొద్దని, మద్యం సేవించి వాహనం నడపవద్దని, ట్రాఫిక్ నిబంధనలు పాటించి హుస్నాబాద్‌ను రాష్ట్రంలోనే ఆదర్శ ప్రాంతంగా నిలపాలని కోరారు.అలాగే రానున్న వర్షాకాలంలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు కృషి చేయాలని మంత్రి సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె. హైమావతి, సిద్దిపేట పోలీస్ కమిషనర్ సాధన రష్మీ పెరుమాళ్, మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మీ, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

## చేసిన అభివృద్ధి, సంక్షేమం మేం చెప్తాం.. పదేళ్లలో మీరు చేసింది చెప్పగలరా....ఎమ్మెల్యే నాయిని



హనుమకొండ జిల్లా ప్రతినిధి,జూన్12(లోకల్ గైడ్ న్యూస్):అభివృద్ధి చేయలేనోళ్ళు అభివృద్ధి గురించి మాట్లాడటం చాలా హాస్యాస్పదం.. రెండున్నరేళ్ల కాలంలో 47 వ డివిజన్ లో 6 కోట్ల పై చిలుకు అభివృద్ధి చేశాం..కాజిపేట గత పాలనలో ఎలా ఉందో ఇప్పుడెలా ఉందో ప్రజలు గమనిస్తున్నారు...47 వ డివిజన్ లో ఎమ్మెల్యే నాయిని రూ.125 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన... బూత్ ఏజెంట్ల ప్రక్రియ వేగవంతం చేయాలని నాయకులకు దిశా నిర్దేశం..శుక్రవారం,కాజిపేట, వరంగల్ పశ్చిమ నియోజకవర్గం లో చేసిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమం గురించి మేం ధైర్యంగా ప్రజలకు చెబుతున్నామని పదేళ్ల పాలనలో మీరు చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పగలరా అని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం రోజున 47వ డివిజన్ పరిధిలోని డీజిల్ కాలనీ, ఇంపీరియల్ కాలనీలలో రూ.1.25 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, సీసీ డ్రైనేజీ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పాలకులు ప్రజల మౌలిక అవసరాలను పూర్తిగా విస్మరించారని, అభివృద్ధి పనుల గురించి మాట్లాడే నైతిక హక్కు వారికి లేదన్నారు. అభివృద్ధి చేయలేని వారు, ప్రజల సమస్యలను పట్టించుకోని వారు ఇప్పుడు అభివృద్ధి గురించి మాట్లాడటం చాలా హాస్యాస్పదంగా ఉందనివిమర్శించారు.వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్న ఆయన, కేవలం రెండున్నరేళ్ల కాలంలోనే 47వ డివిజన్‌లో రూ.6 కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేసినట్లు తెలిపారు. రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సౌకర్యాలు, వీధి దీపాలు తదితర మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు.కాజీపేట ప్రాంతం గత పాలనలో ఎలా ఉండేదో, ప్రస్తుతం ఎలా అభివృద్ధి చెందుతోందో ప్రజలందరూ గమనిస్తున్నారని అన్నారు. ప్రతి కాలనీలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.అనంతరం పార్టీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో సంస్థాగత బలోపేతంపై దిశానిర్దేశం చేసిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, బూత్ ఏజెంట్ల నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ప్రతి బూత్‌లో పార్టీ బలాన్ని మరింత పెంచేందుకు నాయకులు సమన్వయంతో పనిచేయాలని, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో యువ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి మాజీ కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, విజయ శ్రీ రజాలి, సీనియర్ నాయకులు అంకుష్, మనోహర్,జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు సాంబయ్య, స్థానిక డివిజన్ అధ్యక్షులు షేక్ అస్గర్ నాయకులు సిరి లారెన్స్,దొంగల కుమార్,తమ్మడి మానస మధు, ఇప్ప శ్రీకాంత్, దువ్వ రాజులు రేవతి, బర్ల రాజకుమార్, శ్రీనివాస్ తో పాటు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాల నిర్మూలనకు సమష్టి కృషి అవసరం.

- బాలలను పనిలో పెట్టుకోరాదు, చట్టరీత్యా నేరం.
- బడిడు పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలి.
- ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు ధ్యావరి నరేందర్ రెడ్డి.
- బాల్య వివాహాలను నిర్మూలించాలని స్థానిక ఠాణాలో వినతి పత్రం అందజేత.




లోకల్ గైడ్ తాండూర్: బాల్య వివాహాల నిర్మూలనకు సమష్టి కృషి అవసరం అని పెద్దేముల్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు ధ్యావరి నరేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా, బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలని కోరుతూ పెద్దేముల్ పోలీస్ స్టేషన్ లో ఎస్సై ప్రశాంత్ వర్ధన్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... ఆధునిక సమాజంలో బాల్య వివాహాలు చేయడం. ఎంత మాత్రం తగదని బాలలను పనిలో పెట్టు కోరాదని అన్నారు. బడిఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలని కోరారు. ముఖ్యంగా బడిడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం పేద విద్యార్థుల కోసం ఉచిత పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలతో పాటు... దుస్తులు, నాణ్యమైన ఆహారం విద్యార్థుల శారీరక పెరుగుదలకు క్రీడాలు వంటి వసతులు కల్పిస్తుందని తెలిపారు. తల్లిదండ్రులు ఆలోచన చేసి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలలో చేర్పించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ప్రశాంత్ వర్ధన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## వరి ధాన్యం సేకరణను విజయవంతంగా పూర్తి ఎమ్మెల్యేకు సుల్తానాబాద్ రైతుల ఘన సన్మానం



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి 12 (లోకల్ గైడ్ తెలంగాణ)పెద్దపల్లి నియోజకవర్గంలో గత రెండు మాసాలుగా సాగిన వరి ధాన్యం సేకరణ ప్రక్రియను రైతులకు ఎలాంటి ఇబ్బందులు, నష్టాలు కలగకుండా అత్యంత విజయవంతంగా పూర్తి చేసినందుకు గాను, ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు శ్రీ చింతకుంట విజయ రమణారావుని సుల్తానాబాద్ రైతులు ఘనంగా సన్మానించారు. పెద్దపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో రైతులు, రైతు ప్రతినిధులు ఎమ్మెల్యే కి శాలువా కప్పి, పూలమాలలతో కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ సందర్భంగా రైతు నాయకులు మాట్లాడుతూ, వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను ఎమ్మెల్యే తన భుజాలపై వేసుకొని రాత్రింబగళ్లు శ్రమించారని కొనియాడారు. క్షేత్రస్థాయిలో ఐకేపీ సెంటర్ ఇన్చార్జ్ లు,



హమాలీలు,లారీ ఓనర్లు, రైస్ మిల్లర్లు ఉన్నతాధికారులతో నిరంతరం సమీక్షలు జరుపుతూ ఎక్కడా చిన్న సమస్య కూడా రాకుండా పర్యవేక్షించారని తెలిపారు.ఎమ్మెల్యే గారి చొరవ వల్ల అటు రైతులకు, ఇటు రైతు అనుబంధ కూలీలకు ఎలాంటి ఇబ్బంది కలగలేదని, పెద్దపల్లి నియోజకవర్గ వరి ధాన్య సేకరణ విధానం రాష్ట్రంలోనే కాకుండా దేశంలోనే ఒక దిక్సూచిగా నిలిచిందని రైతులు హర్షం వ్యక్తం చేశారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న శాసనసభ్యులకు నియోజకవర్గ రైతాంగం ఎల్లప్పుడూ రుణపడి ఉంటుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రైతు నాయకులు శ్రీ గెలు కొమురయ్య, పల్లె నల్ల ముత్యాలు, జునగరి భూమయ్య, గిర్గుల ప్రభాకర్, మ్యారవేణి లక్ష్మయ్య, జునగిరి చంద్రయ్య మరియు సహకార సంఘాల అధ్యక్షులు, మార్కెట్ కమిటీల ఛైర్మెన్స్, పెద్ద సంఖ్యలో సుల్తానాబాద్ ప్రాంత రైతులు పాల్గొన్నారు.

# ప్రజా ప్రభుత్వంలో సంక్షేమం అభివృద్ధి రెండింటికీ సమ ప్రాధాన్యత...

రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

భైరవునిపల్లి గ్రామ అభివృద్ధికి రెండున్నరేళ్లలో రూ.19.25 కోట్ల వ్యయం

భైరవునిపల్లిలో గ్రామ పంచాయతీ భవనం ప్రారంభం, బుద్ధారంలో రూ.2 కోట్ల వ్యయం తో నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి పొంగులేటి



నేలకొండపల్లి జూన్ 12:లోకల్ గైడ్ :ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు పూర్తయ్యాయని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో సంక్షేమం - అభివృద్ధి రెండింటికీ సమ ప్రాధాన్యత ఇస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు.శుక్రవారం నేలకొండపల్లి మండలంలో పర్యటించి ముందుగా భైరవునిపల్లి గ్రామంలో 20 లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డితో కలిసి మంత్రి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని కేంద్ర బిందువుగా చేసుకుని పనిచేస్తోందన్నారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, పేదలకు సన్న బియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డుల మంజూరు, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు.గత ప్రభుత్వానికి పేదలకు ఇళ్లు ఇవ్వాలనే ఆలోచన లేకపోయిందని, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందన్నారు. రెండవ విడతలో నియోజక వర్గానికి 2 వేల ఇళ్లను మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఇల్లు అనేది పేదలకు ఆత్మ గౌరవానికి ప్రతీక అని పేర్కొంటూ, ప్రతి సోమవారం లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో పారదర్శకంగా నిధులు జమ చేస్తున్నామని తెలిపారు.గత ప్రభుత్వ హయాంలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ప్రస్తుతం రైతులకు కనీస మద్దతు ధరతో పాటు క్వింటాలుకు 500 రూపాయలు బోనస్ అందిస్తున్నామని చెప్పారు. 25 లక్షల మంది రైతులకు రెండు లక్షల వరకు 21 వేల కోట్ల రుణమాఫీ అమలు చేశామని, రైతు భరోసా మొత్తాన్ని ఎకరాకు 12 వేలకు పెంచామని తెలిపారు. నిరుద్యోగ యువత కు 72 వేల ఉద్యోగాలు కల్పించినట్లు పేర్కొన్నారు.భైరవునిపల్లి గ్రామ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. నందిగామ బ్రాంచ్ కెనాల్ నుంచి అజయ్ తండా వరకు భైరవునిపల్లి క్రాస్ రోడ్డు మీదుగా రూ.4.50 కోట్లతో రోడ్డు నిర్మాణం చేపట్టామని చెప్పారు. భైరవునిపల్లి బోదులబండ మీదుగా కొనాయి గూడెం వరకు రూ.7.90 కోట్లతో మరో రోడ్డు నిర్మాణం జరుగుతోందన్నారు.భైరవునిపల్లి నుంచి నాచేపల్లి వరకు రూ.4.72 కోట్లతో బీటీ రోడ్డు పనులు కొనసాగుతున్నాయని తెలిపారు.అలాగే భైరవునిపల్లి నుంచి చెరువుమాదారం వరకు రూ.1.22 కోట్లతో రోడ్డు నిర్మాణం చేపట్టామని, రూ.60 లక్షలతో అంతర్గత సీసీ రోడ్లు నిర్మించామని పేర్కొన్నారు. మంచినీటి సరఫరా, సైడ్ డ్రెన్లు, విద్యుత్ తీగల సమస్యల పరిష్కారానికి మొత్తంగా భైరవునిపల్లి గ్రామ అభివృద్ధి కోసం గత రెండున్నరేళ్లలో రూ.19.25 కోట్ల పనులు చేపట్టినట్లు స్పష్టం చేశారు.రాష్ట్రంలో రైతులు పండించిన రికార్డు స్థాయి ధాన్యాన్ని ప్రభుత్వం పూర్తిస్థాయిలో కొనుగోలు చేసిందని మంత్రి తెలిపారు. కొంత ఆలస్యం జరిగినప్పటికీ మద్దతు ధరతో కొనుగోలు చేయడంతో పాటు తడిసిన ధాన్యాన్ని కూడా స్వీకరించామని చెప్పారు. రైతులకు ఇచ్చిన హామీ మేరకు చివరి గింజ వరకు కొనుగోలు చేశామని, రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు వెల్లడించారు.ధాన్యం కొనుగోలుతో పాటు రైతుల ఖాతాల్లో వెంటనే చెల్లింపులు జమ చేసినట్లు తెలిపారు. రైతులు ఏ పంట పండించినా మద్దతు ధరతో కొనుగోలు చేసిన ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమేనని పేర్కొన్నారు. పేదల అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్న ప్రజా ప్రభుత్వానికి ప్రజల ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.అనంతరం నేలకొండపల్లి మండలం బుద్ధారం గ్రామంలో 2 కోట్ల వ్యయంతో బుద్ధారం తండా - రాజారాంపేట్ రోడ్డు నుండి లకారం ఏటి వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి శంకుస్థాపన చేశారు. గత రెండున్నర సంవత్సరాలలో గ్రామంలో వివిధ అభివృద్ధి పనుల కోసం సుమారు రూ.12.39 కోట్లు వ్యయం చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ వి సీతారాములు, డిపిఓ రాంబాబు, ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ పిల్లి, రాంప్రసాద్, ఎంపీడీఓ ఎర్రయ్య, ఏఓ రాధ, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ పనులు వేగవంతం చేయాలి.

మహాత్మా గాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్, పాలమూరు-రంగారెడ్డి, డిండి ఎత్తిపోతల పథకాల పురోగతిపై కమిషనర్ సమీక్ష.




రంగారెడ్డి జిల్లా బ్యూరో, ( లోకల్ గైడ్ ): సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ, పునరావాసం, పరిహారం చెల్లింపుల ప్రక్రియలను వేగవంతం చేయాలని రెవెన్యూ పునరావాసం, పునర్ ఉపాధి భూసేకరణ కమిషనర్ కె. శివకుమార్ నాయుడు అధికారులను ఆదేశించారు.శుక్రవారం సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన అంశాలపై సమీక్ష సమావేశంలో పాల్గొనేందుకు కలెక్టరేట్‌కు విచ్చేసిన కమిషనర్ కె. శివకుమార్ నాయుడుకు జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రారెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) అనంత్ రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏఓ) సునీల్ ఘన స్వాగతం పలికారు.అనంతరం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కమిషనర్ మహాత్మా గాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, డిండి ఎత్తిపోతల పథకం తదితర ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించారు. భూసేకరణ, అవార్డుల జారీ, పరిహారం చెల్లింపులు, పునరావాస చర్యలు, పెండింగ్ కేసుల పరిష్కారం తదితర అంశాలపై అధికారులతో విస్తృతంగా చర్చించారు. ప్రాజెక్టుల అమలులో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని సూచించారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న సాగునీటి ప్రాజెక్టులు నిర్దేశిత గడువులోగా పూర్తయ్యేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ పేర్కొన్నారు.ఈ సమావేశంలో కందుకూరు, ఇబ్రహీంపట్నం రెవెన్యూ డివిజన్ల ఆర్డీవోలు, నీటిపారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, ఆమనగల్లు, మాడ్గుల్ తహసీల్దార్లు మరియు ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రంగారెడ్డి జిల్లాలో 281 లైసెన్స్ సర్వేయర్ల ఎంపిక.

## కలెక్టర్ కార్యాలయంలోలైసెన్స్ సర్వేయర్లతో సమీక్ష సమావేశం.



రంగారెడ్డి జిల్లా బ్యూరో, ( లోకల్ గైడ్ ): రంగారెడ్డి జిల్లాలో 281 లైసెన్స్ సర్వేలను ఎంపిక చేసినట్లు రంగారెడ్డి జిల్లా అదనపు(రెవిన్యూ ) కే చంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్లో లైసెన్స్ సర్వేయర్ల సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. 1. రీసర్వే



యందు (02 లైసెన్స్ సర్వేయర్ల ను ఎంపికచేసుకొని 2000 ఏకరముల కొలిచినచో 40 వేలు రూపాయలు, 2000 కంటే 2000 ల కంటే ఎక్కువ ఏకరములు కొలిచినచో 60 వేలు రూపాయలు ఇవ్వడం జరుగుతుందన్నారు. 2. 1 ఏకరము సర్వే చేసినందుకు 20 రూపాయలు నుంచి 50 రూపాయలు ఒక నెలకు 500 ఎకరములు సర్వే చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ ఒక్క నిబంధనలు అమలు చేయడం జరుగుతుందన్నారు. లైసెన్స్ సర్వేయర్ల రెమ్యూనరేషన్ పై వివరించారు. ఎంపికైన 281 లైసెన్స్ సర్వేయర్లను గవర్నమెంట్ పనులకు అనగా భూభారతి, రీసర్వే , భూ సేకరణ పనులకు గైడ్ లైన్స్ ఇచ్చారు.

## సైబరాబాద్ ప్రెస్, పోలీస్ ఫ్రెండ్లీ క్రికెట్ లీగ్- 2026 విజయవంతంగా ముగింపు

-పోలీస్ హంటర్స్ ఘన విజయం-అద్వైత్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, నరేష్ మ్యాన్ ఆఫ్ ది సిరీస్




సైబరాబాద్, జూన్ 12 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): సైబరాబాద్ పోలీస్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన సైబరాబాద్ ప్రెస్, పోలీస్ ఫ్రెండ్లీ క్రికెట్ లీగ్-2026 విజయవంతంగా ముగిసింది. పోలీసు సిబ్బంది, మీడియా ప్రతినిధుల మధ్య స్నేహపూర్వక సంబంధాలను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ఈ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఫైనల్ మ్యాచ్‌లో పోలీస్ హంటర్స్ జట్టు అద్భుత ప్రదర్శనతో ఛాంపియన్‌గా నిలిచింది. తొలుత బ్యాటింగ్ చేసిన హంటర్స్ జట్టు నిర్ణీత ఓవర్లలో 224 పరుగులు చేసింది. జట్టు తరపున అద్వైత్ 92 పరుగులతో రాణించి భారీ స్కోరు సాధించడంలో కీలక పాత్ర పోషించారు. 225 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన క్రైమ్ వారియర్స్ జట్టు ప్రత్యర్థి బౌలర్ల ధాటికి 73 పరుగులకే ఆలౌటైంది. దీంతో పోలీస్ హంటర్స్ జట్టు ఘన విజయాన్ని నమోదు చేసింది. ఫైనల్ మ్యాచ్‌లో 92 పరుగులు చేయడంతో పాటు 2 వికెట్లు సాధించిన అద్వైత్ కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించగా, టోర్నమెంట్ మొత్తం 180 పరుగులు చేసిన నరేష్ మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం.రమేష్ విజేతలకు ట్రోఫీలు, వ్యక్తిగత అవార్డులు అందజేసి అభినందించారు. పోలీసు, మీడియా ఉద్యోగాలు రెండూ నిరంతర ఒత్తిడితో కూడుకున్నవని, పరస్పర అవగాహన, స్నేహపూర్వక వాతావరణాన్ని పెంపొందించడమే ఈ లీగ్ నిర్వహణ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి క్రీడా కార్యక్రమాలతో పాటు బ్యాడ్మింటన్ వంటి ఇతర క్రీడా పోటీలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అడ్మిన్ డీసీపీ అన్నపూర్ణ, శేరిలింగంపల్లి డీసీపీ శ్రీనివాస్, ఎస్‌బీ డీసీపీ సుధీంద్ర, హెడ్ క్వార్టర్ డీసీపీ సంజీవ్, సైబర్ క్రైమ్స్ డీసీపీ సాయి మనోహర్, శేరిలింగంపల్లి ట్రాఫిక్ ఏడీసీపీ హనుమంతరావు, సీఏఆర్ హెడ్ క్వార్టర్స్ ఏడీసీపీలు హనుమంతరావు, షమీర్, ఆర్‌ఐలు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## యూనివర్సిటీని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది.



రాజేంద్రనగర్ జూన్ 12, ( లోకల్ గైడ్ ): విద్యార్థులు బాగా చదివి దేశంలోని రైతులందరికీ సేవలు అందించాలని రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ సూచించారు. ఇంత గొప్ప యూనివర్సిటీ నా నియోజకవర్గంలో ఉండడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం 62వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను యూనివర్సిటీ ఆడిటోరియంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జస్టిస్ సుదర్శన్ రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఉడవల్లి అరుణ్ కుమార్లతో కలసి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అగ్రికల్చర్ యూనివర్సిటీ మొదలైనప్పటినుండి ఎన్నో విజయాలు సాధించిందని విద్యార్థులు మంచిగా చదువుకొని రైతులకు సేవ చేసేందుకు బయటికి వస్తున్నారన్నారు. యూనివర్సిటీ ని మరింత అభివృద్ధి చేసుకుంటూ కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని అన్నారు. రాజకీయాల విషయానికొస్తే పెద్దలు అరుణ కుమార్ చెప్పిన మాటలు చాలా అద్భుతంగా ఉన్నాయని ఆనాటి రాజకీయాలు వేరు ఈనాటి రాజకీయాలు వేరు అన్ని ఎంతోమంది చదువుకొని



ఐపీఎస్, ఐఏఎస్ అవుతున్నారని దేశ రాజకీయాల్లో యువత ముందుకు రావాలని దేశ అభివృద్ధికి యువత పాటుపడాలని అన్నారు. నేను నియోజకవర్గంలో నాలుగు సార్లు గెలవడం జరిగిందని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో రెండుసార్లు గెలవడంతో టిడిపి నుండి ఒకనే ఎమ్మెల్యేగా ఉండడంతో రాజశేఖర్ హయంలో నన్ను పిలిచి నాతో పని చేయాలని అడిగాడని నేను చంద్రబాబు గారిని వదిలి రాలేనని చెప్పడం జరిగిందని. అయినా వైయస్ రాజశేఖర్ రెడ్డి నాతో మాట్లాడుతూ నీకు ఏ అవసరమైనా నా వద్దకు వచ్చి పని చేసుకోవాలని సూచించడం జరిగిందన్నారు. కావున అప్పటి ఇప్పటి రాజకీయాలకి చాలా తేడా ఉందన్నారు.యువత ఆలోచించుకొని ముందుకు వెళ్లాలని సూచించారు.

## సాంఘిక సంక్షేమం మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడిన మాటలను ఖండిస్తున్నాం

తెలంగాణ బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ కాంట్రాక్టర్స్ జేఏసీ చైర్మెన్ -మంద శ్యామ్...వెల్లడి



హనుమకొండ జిల్లా ప్రతినిధి,జూన్12(లోకల్ గైడ్ న్యూస్):హనుమకొండ జిల్లా డా.బి ఆర్ అంబెడ్కర్ విగ్రహం దగ్గర తెలంగాణ బీసీ ఎస్సీ ఎస్టీ మరి మైనార్టీ కాంట్రాక్టర్స్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ ఆధ్వర్యంలో ప్రెస్ మీట్ నిర్వహించడం జరిగింది.బిఆర్ఎస్ పార్టీ మాజీ మంత్రి హరీష్ రావు గురుకులలో 2000 కోట్ల కుంభకోణం జరిగినది అన్న మాట వాస్తవం దీనికిగాను సాంఘిక సంక్షేమ మంత్రి హరీష్ రావు మాట్లాడిన మాటలను ఖండించిన తీరు చాలా సిగ్గుచేటు గా అనిపించింది ఒకవేళ మీరు చేసింది కుంభకోణం కాకపోతే మీరు కేటాయించబడిన సెంట్రల్ విధానం కాంట్రాక్టు పై ఒక శ్వేత పత్రాన్ని విడుదల చేయాలి మీరు సాంఘిక సంక్షేమ గురుకులాల మంత్రి అంతే కానీ హరీష్ రావు ఒక సాంఘిక సంక్షేమ గురుకుల గురించి మాట్లాడలేదు అన్ని గురుకులాల్లో అంటే బీసీ వెల్ఫేర్ ట్రైబల్ వెల్ఫేర్ మైనార్టీ కస్తూర్బా మోడల్ స్కూల్ ఎస్ ఎం ఎస్ హాస్టల్స్ ఎస్సీ ఎస్టీ బీసీ గిరిజన హాస్టల్ లో, గవర్నమెంట్ స్కూల్ లాలో అన్ని సొసైటీ యందు 2000 కోట్ల కుంభకోమన్నది వాస్తవం ఆనడం జరిగింది మీరు మీ అధినాయకుడు రేవంత్ రెడ్డి ఇచ్చిన స్క్రిప్ట్ చదువుకుంటూ మాట్లాడుతున్నారు. మీరు మంత్రి స్థాయిలో ఉండి మీ సొంత నిర్ణయాలు లేకుండా ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్ చదవడం సిగ్గుచేటు.తెలంగాణ బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ కాంట్రాక్టర్స్ జేఏసీ చైర్మన్ గా ఈ యొక్క అంబేద్కర్ విగ్రహం సాక్షిగా నిన్ను అడుగుతున్నా గురుకులాలలో కాంట్రాక్టులు సెంట్రల్ లైజ్ చేయడం వాస్తవం కాదా, జీవో 17 తీసుకురావాల్సిన అవసరం ఏమున్నది ఈ సెంట్రల్ లైజ్ వెనుక కోట్ల కుంభకోణం ఉన్నది అనేది వాస్తవం కాదా ? లిజీవో 17 రద్దు పై హైకోర్టు ఇచ్చిన తీర్పును మీరు అధికమించడం వాస్తవం కాదా మీరు గతంలో బిఆర్ఎస్ ఉన్నప్పుడు ఏం చేశారని అడుగుతున్నారు బిఆర్ఎస్ గవర్నమెంట్ ఎంతోమంది పిల్లల్ని పై చదువుల కోసం విదేశాలు పంపడం జరిగింది ఢిల్లీ యూనివర్సిటీలో చదివించడం జరిగింది వేల మంది గొప్ప గొప్ప స్థాయిలో ఉంచడం జరిగింది అన్నారు. కానీ ఇదే రేవంత్ రెడ్డి విద్యాశాఖను తన దగ్గర పెట్టుకొని గురుకుల సొసైటీలను గవర్నమెంట్ స్కూల్ లను కుంటుపరుస్తున్న విధానము మీకు అర్థం కావట్లేదా?మేము ఈ విషయాలపై చర్చకు సిద్ధం మీకు దమ్ము ధైర్యం ఉంటే హైదరాబాదులో అంబేద్కర్ విగ్రహం వద్దకు రమ్మంటారా, తెలంగాణ కోసం ప్రాణాలు ఇచ్చిన అమరవీరుల స్థూపం వద్దకు రమ్మంటారా లేదా మీ గాంధీ భవన్లో చర్చ చేసుందామా మేము సిద్ధం. మీరు సిద్ధంగా ఉన్నారా మంత్రి పదవుల్లో ఉన్న మీరు స్క్రిప్ట్ చదువుకుంటూ ఉండడం సరైనది కాదు అని చేవెళ్ల కామారెడ్డి డిక్లరేషన్ లో భాగంగా మాకు అన్ని సంపదలో కూడా మా వాటా అమలయే విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ కాంట్రాక్టర్స్ జేఏసీ చైర్మన్ మంద శ్యామ్ తెలియజేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ కాంట్రాక్టర్స్ జిల్లా కన్వీనర్ బొల్లే మధుకర్ , బి ఆర్ ఎస్ నాయకురాలు పుష్పి తలయ ,రాష్ట్ర కో కన్వీనర్ శనిగరం శ్రీనివాస్, రాష్ట్ర లీగల్ సెల్ అడ్వైజర్ మారపెల్లి మనోజ్, ఒంటెరు చక్రి, బొల్లారం రమాకాంత్, తేళ్ళూరి సురేష్, అల్లూరి తిరుపతి తదితరులు పాల్గొన్నారు

## మన బడి పరిరక్షణ టీం ఆధ్వర్యంలో మన బడి పండగ కరపత్రాలను ఆవిష్కరించిన ఎంఈఓ, టీం చైర్మన్ సుంకేట మహేష్ బాబు.



నిర్మల్ : లోకల్ గైడ్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'మన బడి పండగ' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం భైంసా పట్టణం లో ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు అడెల్లు శ్రీనివాస్ ,భైంసా మండల విద్యాధికారి చేతుల మీదుగా కరపత్రాలను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మన బడి పరిరక్షణ టీం చైర్మన్ సుంకేట మహేష్ బాబు, మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలు, ఉచిత విద్య, డిజిటల్ తరగతులు, మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ వంటి పథకాల గురించి ప్రజలకు వివరించారు. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ బడులలో నాణ్యమైన విద్య అందుతుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు.ఈ సందర్భంగా మన బడి పండగ' కార్యక్రమం ద్వారా గ్రామంలోని ప్రతి గల్లీకి వెళ్లి తల్లిదండ్రులను చైతన్యపరుస్తామని తెలిపారు. సోమవారం సాయంత్రం 5 గంటలకు గల్లీ సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో మన బడి టీం సభ్యులు రామోజీవార్. గంగప్రసాద్, అకోజీ పవన్ కుమార్ ముత్యం పేరెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

## జోగులాంబ గద్వాల పోలీస్

బాలికపై లైంగిక దాడి – నిందితుడికి 20 ఏళ్ల కఠిన జైలు శిక్ష , రూ.20,000 జరిమానా!



నేరస్తులకు శిక్ష పడేలా కృషి చేసిన అధికారులను అభినందించిన జిల్లా ఎస్పీ శ్రీ టి. శ్రీనివాస రావు, ఐపిఎస్., గారుమైనర్ బాలికను బలాత్కారం చేసిన కేసులో నిందితుడికి 20 సంవత్సరాల జైలు శిక్ష మరియు 20,000/- రూపాయాల జరిమాన విధిస్తూ గౌరవ ప్రిన్సిపాల్ డిస్టిక్ అండ్ సెషన్స్ జడ్జ - కం- ఫోక్సో కోర్టు గద్వాల, జడ్జ శ్రీ వి. శ్రీనివాస్ గారు ఈ రోజు తీరు ్రను వెల్లడించారు. అలంపూర్ మండలలో ఒక గ్రామము చెందిన ఒక మహిళ తేది:28.04.2021 నాడు అలంపూర్ పోలీస్ స్టేషన్ కు వచ్చి మైనర్ అయిన తన కూతురు పై తేది 27.04.2021 రోజున సాయంకాలం మేకలను మోపుతుండగా, పింజరి పెద్ద హుస్సేన్ అలియాస్ నడిపి హుస్సేన్ ం/శీ గోకారి, వయసు 35 సంవత్సరాలు, కులం పింజరి, వృత్తి వ్యవసాయం, అల్లంపూర్ మండలంలోని ఒక గ్రామానికి చెందిన వ్యక్తి తన కూతుర్ని బలాత్కారం చేసి అత్యాచారం చేసినట్టు పిర్యాదు ఇవ్వగా అప్పటి ఎస్సై ఎస్. మధుసూదన్ రెడ్డి, క్రైమ్ నెశీ. 42/2021, బ/ం: 376 (దీ) ఘాజ ఉంవష 5(వీ), 6 శీట ్రాజుూా ాూషే -2012 గా కేసు నమోదు చెయ్యగా అప్పటి సిఐ. ఎమ్. వెంకటరామయ్య విచారణ చేయడం జరిగింది. కొద్ది రోజులకు సి.ఐ. వెంకటరామయ్య ట్రాన్స్ఫర్ కాగా కొత్తగా వచ్చిన సిఐ ఏ.సూర్య నాయక్ విచారణ పూర్తి చేసి, కోర్టు లో చార్జి షీట్ వెయ్యడం జరిగింది. కోర్టు లో ట్రయల్స్ నడుస్తున్న సమయంలో జిల్లా అదనపు ఎస్పీ శ్రీ కె. శంకర్ గారి ఆదేశాల మేరకుడి.ఎస్పి మొగిలయ్య పర్యవేక్షణలో, అలంపూర్ సీఐ వి. ప్రదీప్ కుమార్, అలంపూర్ ఎస్సై ఎమ్. రామకృష్ణ, గద్వాల భరోసా కేంద్రం బృందం సాక్షులను పకడ్బందీగా బ్రీఫింగ్ చేసి తగిన చర్యలు తీసుకొని నేరస్తులను కోర్టులో ప్రవేశపెట్టగా పూర్వపరాలను విన్న గౌరవ ప్రిన్సిపాల్ డిస్టిక్ అండ్ సెషన్స్ జడ్జ - కం- ఫోక్సో కోర్టు గద్వాల, జడ్జ శ్రీ వి. శ్రీనివాస్ గారు నిందితుడుకి 20 సంవత్సరాల కఠిన కారాగర శిక్ష జైలు శిక్ష మరియు 20,000/- వేల రూపాయల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.కోర్టులో నిందితుడికి శిక్షపడేలా కృషి చేసిన అప్పటి ఇన్వెస్టిగేషన్ అధికారులు వెంకటరామయ్య, సూర్య నాయక్, ప్రస్తుత డి. ఎస్పీ మొగిలయ్య, సీఐ వి ప్రదీప్ కుమార్, ఎస్సై రామకృష్ణ, అడిషనల్ పిపి. కె.విజయ్ కుమార్, గద్వాల భరోసా కేంద్రం బృందం మరియు కోర్టు డ్యూటీ అధికారులు ఎస్సై జిక్కి బాబు, హెడ్ కానిస్టేబుల్ సాయి బాబా, కానిస్టేబుల్ మాభాషలను జిల్లా ఎస్పీ శ్రీ టి.శ్రీనివాస రావు, ఐపిఎస్., గారు అభినందించారు.

## జోగులాంబ గద్వాల్ పోలీస్



పోలీస్ స్టేషన్ పరిసరాలు నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవాలి : జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు, ఐపీఎస్.,పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉంచడంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో వచ్చే డయల్-100 కాల్స్‌కు తక్షణమే స్పందించాలని జిల్లా ఎస్పీ శ్రీ టి. శ్రీనివాస రావు, ఐపీఎస్., గారు సూచించారు. శుక్రవారం అలంపూర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించిన ఆయన స్టేషన్ రికార్డులు, సిబ్బంది విధుల నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత, భద్రతా ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా స్టేషన్‌లోని రిసెప్షన్, రైటర్ సెక్షన్, టెక్ టీమ్, ఎస్‌హెచ్‌వో కార్యాలయం, లాక్‌అప్ గది, విశ్రాంతి గదులు, వాహనాల పార్కింగ్ ప్రాంతాలను తనిఖీ చేసిన ఎస్పీ గారు, సిబ్బంది యూనిఫాం నిర్వహణతో పాటు జనరల్ డైరీ, బీట్ డ్యూటీ బుక్స్, ఉన్నతాధికారుల సందర్శన రికార్డులు తదితర పత్రాలను పరిశీలించారు.అనంతరం సిబ్బందితో సమావేశమైన ఎస్పీ గారు, పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాలు, బీట్ వ్యవస్థ, బ్లూ కోల్ట్స్ మరియు పెట్రోల్ వాహనాల విధుల నిర్వహణపై వివరాలు తెలుసుకున్నారు. గ్రామాల్లో క్రమం తప్పకుండా పర్యటిస్తూ సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, మూఢనమ్మకాలు, బాల్య వివాహాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను విస్తృతంగా నిర్వహించి రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని ఆదేశించారు.డయల్-100 కాల్ అందిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సమస్యలను పరిష్కరించడంతో పాటు, ప్రజా ఫిర్యాదులపై ఎటువంటి జాప్యం లేకుండా స్పందించాలని ఎస్పీ గారు స్పష్టం చేశారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ పోలీస్ శాఖపై విశ్వాసాన్ని మరింత పెంపొందించేలా సేవలు అందించాలని సూచించారు.ఈ తనిఖీలో గద్వాల డిఎస్పి వై మొగిలయ్య, సర్కిల్ ఇన్స్పెక్టర్ వి. ప్రదీప్ కుమార్, ఎస్సై ఎం. రామకృష్ణ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని శాంతిఖని గనిపై ధర్నా.



బెల్లంపల్లి (లోకల్ గైడ్)శాంతిఖని గనిపై ఎఐటియుసి ఆధ్వర్యంలో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం మంతెన రమేష్ అధ్యక్షతన ధర్నా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బెల్లంపల్లి బ్రాంచ్ అసిస్టెంట్ సెక్రెటరీ దాసరి తిరుపతి గౌడ్ హాజరై శాంతిఖని మేనేజర్ సంజయ్ కుమార్ సింహ కు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతు కార్పొరేట్ స్థాయిలో అమలు కాని సమస్యలపై 30డిమాండ్ల మీద సమ్మె నోటీసు ఇచ్చామని,కార్మికులందరు సమ్మెకు సిద్ధం కావాలని పిలుపునిచ్చినట్లు తెలిపారు.36లెవెల్,37లేవల్ నుండి 49లెవెల్ వరకు వెంటిలేషన్,తాగునీరు కార్మికుల సరిపడా అందించాలి,కెజి టైమింగ్స్ ను పాత పద్ధతిలోనే నడిపించాలి,డెసిగ్నేషన్ ఫేస్ వర్కర్లను శాంతిఖని మైన్ కి రప్పించాలి,ఖాళీగా ఉన్న పోస్టులను యాక్టింగ్ చేస్తున్న వారికే వెంటనే ప్రమోషన్ కల్పించి భర్తీ చేయాలి.మెయిన్ గేట్ నుండి ఇంటర్నల్ రోడ్స్ పూర్తిగా పాడైనందున కొత్తగా రోడ్లు వేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో దాడి రమేష్,సంతోష్ కుమార్,రాజలింగ్,మంతెన భాస్కర్,శ్రీకాంత్,సారయ్య,రాజయ్య,సేఫ్టీ కమిటీ సభ్యులు మైన్స్ కమిటీ సభ్యులు,వర్క్ మైన్ ఇన్స్పెక్టర్లు,టెంపుల్ కమిటీ సభ్యులు,క్యాంటీన్ కమిటీ సభ్యులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## యాదవుల దిశ-దశ సమావేశాన్ని విజయవంతం చేయాలి

-యాదవ సమాజ ఐక్యత, సాధికారత కోసం అందరూ తరలిరావాలి..భేరి రామచందర్ యాదవ్



సైబరాబాద్, జూన్ 12 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): యాదవ సమాజ ఐక్యత, స్వాభిమానం, సాధికారత లక్ష్యంగా నిర్వహిస్తున్న "యాదవుల దిశ-దశ" సమావేశాన్ని విజయవంతం చేయాలని యాదవ సమాజ నాయకుడు భేరి రామచందర్ యాదవ్ పిలుపునిచ్చారు. యాదవ సమాజానికి చెందిన యువత, విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, పశుపోషకులు, మేధావులు, న్యాయవాదులు, వైద్యులు, కళాకారులు, ప్రజాప్రతినిధులు సహా అన్ని వర్గాల వారు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో జనాభా నిష్పత్తి మేరకు రిజర్వేషన్లు, విద్యా మరియు ఉపాధి అవకాశాల విస్తరణ, పాల-పశుసంవర్ధక రంగాలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు, యాదవ యువతకు నైపుణ్యాభివృద్ధి, స్వయం ఉపాధి పథకాలు, సమాజ సమగ్ర అభివృద్ధికి కార్యాచరణ తదితర అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశం జూన్ 14, 2026 (ఆదివారం) ఉదయం 9.30 గంటలకు హైదరాబాద్ అబిడ్స్‌లోని సూర్యలోక్ కాంప్లెక్స్‌లో నిర్వహించబడుతుందని, యాదవ సోదర సోదరీమణులందరూ హాజరై విజయవంతం చేయాలని భేరి రామచందర్ యాదవ్ విజ్ఞప్తి చేశారు. "మన ఐక్యతే మన బలం" అని ఆయన పేర్కొన్నారు.

## క్యాన్సర్ నిపుణులు శ్రీనాథ్ భరద్వాజ్‌తో ఉస్మాన్ సమావేశం...



మంచిర్యాల జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్)హైదరాబాద్‌లోని అమెరికన్ ఆంకాలజీ ఇన్‌స్టిట్యూట్ క్యాన్సర్ నిపుణులు డాక్టర్ శ్రీనాథ్ భరద్వాజ్ ను బెల్లంపల్లి తాజ్ బాబా సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఉస్మాన్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు డాక్టర్ శ్రీనాథ్ భరద్వాజ్ మార్గదర్శకత్వం నాయకత్వంలో త్వరలో బెల్లంపల్లిలో ఒక మెగా ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ శిబిరం ముఖ్య ఉద్దేశ్యం క్యాన్సర్‌పై అవగాహన కల్పించడం,వ్యాధిని ముందుగానే గుర్తించేలా ప్రోత్సహించడం,ప్రజలకు ఉచిత వైద్య సలహాలు అందించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమం ద్వారా బెల్లంపల్లి చుట్టుపక్కల ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో ప్రజలు ప్రయోజనం పొందుతారని ఆశించారు.తాజ్ బాబా సేవా సమితి,సమాజ ప్రయోజనం కోసం ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు,సంక్షేమ కార్యకలాపాల ద్వారా సమాజానికి సేవ చేయనున్నట్లు తెలిపారు.

## సాంకేతిక వ్యవసాయ పరిజ్ఞానానికి అగ్రి వర్సిటీ దిక్సూచి కావాలి- వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు.

హరిత విప్లవంలో ఇందిరా గాంధీపాత్ర అమోఘం-జస్టిస్ సుదర్శన్ రెడ్డి.

ఇందిరాగాంధీ పరిపాలన వ్యవసాయ రంగానికి స్వర్ణయుగం-మధురా స్వామినాథన్.



రంగారెడ్డి జిల్లా బ్యూరో, (లోకల్ గైడ్ ): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణా వ్యవసాయ విశ్వవిద్యాలయం 62 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శుక్రవారం రాజేంద్ర నగర్ లోని విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో ఎంతో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా భారత దేశ హరిత విప్లవ సాధన లో ఇందిరాగాంధీ విశేష సేవలు అన్న అంశం పై జాతీయ సదస్సు నిర్వహించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు ముఖ్యఅతిథి గా హాజరై ప్రసంగించారు. తెలంగాణకు భారతదేశానికి గత 62 ఏళ్ళుగా ఈ విశ్వవిద్యాలయం అసమాన సేవలు అందిస్తోందని అభినందించారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి చేతుల మీదుగా ప్రారంభం అయిన ఈ విశ్వవిద్యాలయం వివిధ పంటల లో రూపొందించిన సుమారు 520 వంగడాలు రైతుల మన్ననలు పొందాయన్నారు.అనేక వేల మంది ని పట్టభద్రుల గా తీర్చిదిద్దిందన్నారు. ఇందిరా గాంధీ, స్వామినాథన్ వంటి ప్రముఖ శాస్త్రవేత్తల తోడ్పాటు తో అమలు చేసిన హరిత విప్లవం కారణం గా నేడు ఆహార ఉత్పత్తుల్ని ఎగుమతి చేసే స్థాయి కి దేశం ఎదిగింది అన్నారు. ముఖ్యమంత్రి వర్యులు రేవంత్ రెడ్డి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని వివరించారు.వరి, మొక్కజొన్న పంటల ఉత్పత్తి లో రాష్ట్రం రికార్డు సాధించిందన్నారు. అనేక దేశాలలో పంటలకు విలువ జోడింపు, మార్కెటింగ్,ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డ్రోన్, సెన్సర్ ల ఆధారిత వ్యవసాయ పద్ధతులు అవలంబిస్తున్నాయని మంత్రి వివరించారు. అదే విధంగా వరి, మొక్క జొన్న పంటల నుంచి ఉప ఉత్పత్తులని రూపొందిస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణా వ్యవసాయం కూడా మారాలని మంత్రి అభిప్రాయపడ్డారు. తెలంగాణా వ్యవసాయం సాంకేతిక, విలువ ఆధారిత వ్యవసాయం గా పరిణామం చెందాలని అందుకు వ్యవసాయ విశ్వవిద్యాలయం దిక్సూచి గా ఉండాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి ఆవిర్భావ దినోత్సవ ప్రసంగం చేశారు.దేశం ఆహార భద్రత సాధించడం లో , నేడు ఆహార ధాన్యాలని ఎగుమతి చేసే స్థాయి కి భారతదేశం చేరుకోవడానికి ఇందిరాగాంధీ అమలు చేసిన హరిత విప్లవం ప్రధాన కారణం అని అయన అన్నారు. వ్యవసాయ వర్సిటీ వంటి సంస్థల స్థాపన అందుకు దోహదం చేసిందన్నారు.అదే విధంగా బ్యాంక్ లని జాతీయ కరణ చేసి, నాబార్డు ని ఏర్పాటు చేసి రైతులకి, గ్రామీణ ప్రజానీకానికి చాలా మేలు చేశారన్నారు. అయితే ఇప్పటికి అనేకమంది పోషకాహార లోపం తో ఉండటం దురదృష్టం కరమన్నారు.వ్యవసాయ రంగం నేడు ఎదుర్కొంటున్న సవాళ్ళ పరిష్కారానికి వ్యవసాయ విశ్వవిద్యాలయం మరింత గా కృషి చేయాలని సుదర్శన్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో ఇండియన్ స్థాటిస్టికల్ ఇనిస్టిట్యూట్, బెంగళూరు, ప్రొఫెసర్ అండ్ హెడ్ మధుర స్వామినాథన్ కీలకోపన్యాసం చేశారు. హరిత విప్లవం తర్వాత భారతదేశం లో ఉత్పత్తి, దిగుబడులు బాగా పెరిగి ఎగుమతులు చేసే స్థాయి కి ఎదిగామని ఆమె అన్నారు. వ్యవసాయ సంస్థ లకి , పరిశోధనలకి ప్రభుత్వాలు విస్తృతం గా ప్రోత్సాహం ఇవ్వాలని మధురా స్వామినాథన్ సూచించారు. శాస్త్ర ఆధారిత,నిరూపిత విధానాలని అనుసరించాలన్నారు. అదే విధంగా ఆహార ఉత్పత్తుల లో మన దేశం స్వయం సమృద్ధి సాధించిన కారణం గా ఇతర దేశాలకి తోడ్పాటు అందించాలని మధుర స్వామినాథన్ అభిప్రాయపడ్డారు. భారతదేశం వ్యవసాయ ఆధారిత దేశం అని అనేక ఆహార ఉత్పత్తులలో అధిక దిగుబడులు సాధిస్తున్నప్పటికి నూనె గింజలు, పప్పు ధాన్యాల ఉత్పత్తి లో కాస్త వెనుక బడి ఉన్నామని మాజీ పార్లమెంట్ సభ్యులు ఉండవల్లి అరుణ్ కుమార్ అన్నారు. అయినప్పటికీ దేశం లో సుమారు 80 కోట్ల మందికి ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా బియ్యం పంపిణీ ఎందుకు చేయవలసి వస్తుందో అందరూ ఆలోచించుకోవలసిన అవసరం ఉందన్నారు. అలానే దేశంలోని పరిస్థితుల పైన విద్యావంతులు ఆలోచించాలని అరుణ్ కుమార్ అన్నారు.దేశ వ్యవసాయ రంగానికి ఇందిరా గాంధీ అమోఘం అయిన సేవలు అందించారని తెలంగాణా వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం. కోదండరెడ్డి అన్నారు.నేడు తెలంగాణా లో కూరగాయలు, పూలు, చిరు, తృణ ధాన్యాల సాగు బాగా తగ్గిపోయిందన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు పంట మార్పిడి పైన రైతులని చైతన్యవంతులని చేయాలని అభిప్రాయపడ్డారు. కేంద్ర ప్రభుత్వం కూడా శాస్త్రీయం గా పంట మద్ధతు ధరలు ప్రకటించి, వ్యవసాయ ఉత్పత్తులని కొనుగోలు చేయాలని కోదండరెడ్డి అభిప్రాయ పడ్డారు. గత 62 ఏళ్ళు గా వ్యవసాయ విశ్వవిద్యాలయం సాధించిన ప్రగతిని ఉప కులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య వివరించారు. అందుకు సంబంధించిన వీడియో లని ప్రదర్శించారు. ఎంతో పేరున్న విశ్వ విద్యాలయం రాజేంద్ర నగర్ లో ఉండటం మనకెంతో గర్వ కారణం అని కార్యక్రమానికి అధ్యాక్షత వహించిన స్థానిక శాసన సభ్యులు టి. ప్రకాష్ గౌడ్ అన్నారు. అధికారులు అప్రమత్తం గా ఉంటూ విశ్వ విద్యాలయం ఆస్తులని పరిరక్షించుకోవాలని ప్రకాష్ గౌడ్ సూచించారు.ఈ సందర్భంగా హరిత విప్లవ సాధన లో ఇందిరా గాంధీ పాత్ర అన్న అంశం పైన అల్దాస్ జానయ్య రచించిన పుస్తకాన్ని అతిధులు విడుదల చేశారు. అదే విధంగా తెలంగాణా విజన్ -2047, ్రాజీూాఖ జఖంఖశీఅ-2047 లని కూడా అతిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉత్తమ వ్యవసాయ విధానాలతో సాగు చేస్తున్న రైతులకు పురస్కారాలు అందచేశారు.అదే విధంగా అత్యుత్తమ సేవలు అందించిన బోధన, బోధనేతర సిబ్బంది, శాస్త్ర వేత్తలకి అవార్డు లు అంద చేశారు. అగ్రికల్చర్ డిప్లమా లో అత్యధిక ఓవరాల్ గ్రేడ్ పాయింట్ ఏవరేజ్ సాధించిన తెలుగు శ్రీ లక్ష్మి కి దివంగత డాక్టర్ ఆలపాటి అప్పారావు బంగారు పతకం అందచేశారు.అలాగే డాక్టర్ వై. ఎస్. ఆర్, డాక్టర్ కే వీ పీ ఫౌండేషన్ తరపున 21 లక్షల రూపాయల చెక్కు ని ఉండవల్లి అరుణ్ కుమార్ అల్దాస్ జానయ్య కి అందచేశారు. ఈ 21 లక్షల రూపాయల మొత్తం పైన ప్రతి ఏటా వచ్చే వడ్డీ తో అత్యుత్తమ ప్రతిభ కనపర్చే విద్యార్థి కి ప్రతి ఏటా విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం లో పతకం, సర్టిఫికెట్, ఒక లక్ష రూపాయల నగదు అందిస్తామని అల్దాస్ జానయ్య ప్రకటించారు.ఈ కార్యక్రమం లో హార్టికల్చర్ విశ్వ విద్యాలయం ఉప కులపతి డి. రాజి రెడ్డి, వెటర్నరీ విశ్వ విద్యాలయం ఉప కులపతి జ్ఞాన ప్రకాష్, వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ +.జు. జష్త్ర విద్యాసాగర్,వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు గోపాల్ రెడ్డి, భవానీ రెడ్డి, రాములు నాయక్, శాస్త్ర వేత్తలు, బోధన, బోధనేతర సిబ్బంది,విశ్వవిద్యాలయ పూర్వ అధికారులు, రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.తర్వాత వ్యవసాయ పరిశోధనా కేంద్రం ప్రాంగణం లో ఇటీవల హెచ్ ఎం డి ఏ సహకారం తో పునరుద్దరణ చేసిన కిద్వాయ్ కాటేజీ, రిసార్ట్ ని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు.

